

దాతల సహకారంతో నిర్మిస్తున్న పడమర వైపు గోపురం

మార్కాపురం చెన్నకేశవస్వామి ఆలయంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఆలయ అభివృద్ధి పనులకు నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో దేవదాయశాఖ నుంచి సకాలంలో నిధులు రాబట్టలేకపోయారు. దీంతో నాలుగు నెలలుగా పనులు నిలిచిపోయాయి. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోవడంతో దర్శనానికి వచ్చే భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ఇదిలా ఉండగా గత పాలకవర్గమే ప్రస్తుతం ఉంది. సాధారణంగా ప్రభుత్వం మారిన తర్వాత పాత పాలకవర్గాలు తప్పుకుంటాయి. పనులు పెండింగ్‌లో ఉన్నందున, ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదలైతే లెక్కలు చూసుకుని తప్పుకుంటామని ప్రస్తుత పాలకవర్గం చెబుతోంది. అయితే వైసీపీ ప్రభుత్వంలో నిధులు సాధించుకోలేని వారు నెపం కూటమి ప్రభుత్వంపై వేయాలని చూడటం ఏమిటని భక్తులు విమర్శిస్తున్నారు.



నిలిచిన రంగనాయకస్వామి, ఆండాల్ అమ్మవార్ల ఉపాలయాలు

చెన్నయ్య ఆలయ అభివృద్ధిపై నీలినీడలు

నిధులు ఇవ్వని వైసీపీ ప్రభుత్వం

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో నాలుగు గోపురాలు, రంగనాయక, ఆండాల్ అమ్మవారి గుళ్ల జీర్ణోద్ధరణ, నూతనంగా ఆంజనేయస్వామి గుడి, భేరి మండపం, సాలాహారాలు, బండపరుపు తదితర పనులకు సుమారు రూ.8 కోట్లు ఖర్చవుతుందని 2021లో దేవస్థాన పాలకవర్గం అంచనా వేయించింది. దేవదాయశాఖ అధికారులు మాత్రం తాము మ్యాచింగ్ గ్రాంట్ కింద కొన్ని పనులకు మాత్రమే నిధులు మంజూరు చేస్తామన్నారు. అందులో భాగంగా నాలుగు గోపురాలకు గాను మూడింటి నిర్మాణానికి రూ.కోటి చెల్లిస్తే మరో రూ.2 కోట్లు ఇస్తామని పాలకవర్గానికి చెప్పారు. దాతల నుంచి సమీకరించిన రూ.కోటిని పాలకవర్గం వెంటనే దేవదాయశాఖకు చెల్లించింది. దీంతో పనులను 2022 అక్టోబర్‌లో ప్రారంభించారు. తూర్పు, ఉత్తరం, దక్షిణ గోపురాలకు రూ.3కోట్ల పనికి దేవదాయశాఖ బిల్లులు చెల్లించాల్సి ఉంది. వీటికి పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వకపోవడంతో పనులు మధ్యలో నిలిచాయి. మరో రూ.2.10 కోట్లను పాలకవర్గం 17మంది దాతల ద్వారా సమీకరించింది. కీలకమైన పడమర గోపుర నిర్మాణం చేపట్టింది. అంతేగాక రూ.1.20 కోట్లతో పాత గుడుల స్థానే నూతనంగా రంగనాయకస్వామి, ఆండాల్ అమ్మవార్లకు, రూ.35లక్షలతో బయట ఉన్న ఆంజనేయస్వామి గుడిని, రూ.25లక్షలతో భేరి మండపం, రూ.1.50 కోట్లతో పాడైపోయిన సాలాహారాలు, బండపరుపు పనులను దాతల నుంచి సేకరించిన నిధులతో నిర్మించాలి. దాతల ద్వారా దాదాపు నిధుల సేకరణ పూర్తయింది. వాటి పనులు జరుగుతున్నాయి. కానీ దేవదాయ శాఖ నిధులతో జరగాల్సిన పనులకు బిల్లులు చెల్లించడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది. రూ.3 కోట్లకుగాను ఇప్పటివరకు రూ.1.70 కోట్లు మాత్రమే బిల్లులు చేశారు. ఇచ్చిన ఈ నిధుల్లోనూ, పాలకవర్గం చెల్లించిన రూ.కోటి ఉంది. అంటే గత వైసీపీ ప్రభుత్వం ఇంతటి కీలకమైన ఆలయ అభివృద్ధి పనికి చెల్లించింది కేవలం రూ.70లక్షలు మాత్రమే. బిల్లులు చెల్లించడంలో జాప్యం చోటుచేసుకుంటుండటంతో కాంట్రాక్టర్ ఈ ఏడాది మార్చి నుంచి పనులు నిలిపివేశారు. దాతలు పూర్తిస్థాయిలో సహకరించినా వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించింది.

దాతల సహకారంతో ప్రారంభమైన రూ.8 కోట్ల విలువైన పనులు

బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆపేసిన కాంట్రాక్టర్

లెక్కలు తేలకపోవడంతో తప్పుకోని ప్రస్తుత పాలకవర్గం

మార్కాపురం, ఆగస్టు 2 : రాయలసీమ ప్రాంత ప్రజల ఆరాధ్యదైవం శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి. మార్కాపురం పట్టణ నడిబొడ్డున కొలువైన స్వామివారి ఆలయం ఏటికేడు అభివృద్ధి చెందుతోంది. ఒక్కో పాలకవర్గం హయాంలో ఒక్కో వసతి ఆలయానికి సమకూరింది. దశాబ్దన్నర నుంచి జరుగుతున్న ఈ అభివృద్ధి పనులతో ఆలయం నూతన శోభను సంతరించుకుంది. గతంలో పాతదాని స్థానే నూతన రథం, గాలిగోపుర జీర్ణోద్ధరణ, తిరుమల స్వర్ణరథం తరహాలో వెండి రథం, ఆలయం లోపల నూతనంగా ఫ్లోరింగ్ తదితర అభివృద్ధి పనులు జరిగాయి. ఈక్రమంలోనే గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన పాలకవర్గం కూడా ఆలయానికి నూతన సొబగులు అద్దాలని తలపోసింది. ఆలయ నాలుగు దిక్కుల ఉన్న గోపురాలు శిథిలావస్థకు చేరడంతో నూతన గోపురాలు, ఉపాలయాలు నిర్మించాలని నిర్ణయించింది. దీనికోసం రూ.8కోట్ల వరకు ఖర్చవుతున్నందున దాతల సహకారం తీసుకున్నారు. అందులో దేవదాయశాఖ సీజీఎఫ్ ద్వారా రూ.3 కోట్ల వరకు నిధులు మంజూరు చేయాలి. మిగిలిన నిధులకు దాతల నుంచి సేకరించి పనులు ప్రారంభించారు. అయితే దేవదాయశాఖ నుంచి రావాల్సిన నిధులు ఆలస్యమయ్యాయి. దీంతో పనులు ఆగిపోయాయి.

లెక్కలు తేలక తప్పుకోని పాలకవర్గం

వైసీపీ ప్రభుత్వం సక్రమంగా బిల్లులు చెల్లించి ఉంటే పనులు కూడా సకాలంలోనే పూర్తయ్యేవి. బిల్లులు రాకపోవడంతో పాలకవర్గం దాతల ద్వారా సమీకరించిన నిధుల నుంచి కాంట్రాక్టర్‌కు ఇప్పటివరకు బిల్లులు చెల్లించింది. కానీ ఇంకా రూ.1.40కోట్ల మేర నిధులు దేవదాయశాఖ నుంచి రావాల్సి ఉంది. ముందుగా పనులు చేస్తే నిధులు వస్తాయో, రావో తెలియక పాలకవర్గం కూడా పనులు పూర్తిచేయించేందుకు వెనుకడుగు వేస్తోంది. అంతేకాక ప్రభుత్వం మారడం కూడా వారికి ప్రతిబంధకంగా మారింది. ఇప్పటికే పాలకవర్గంలోని కీలకమైన వ్యక్తి అధికారపార్టీ నాయకులతో ఆలయ అభివృద్ధి పనులపై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మీరు ఇప్పిస్తే పనులు పూర్తి చేసి తప్పుకొంటామని ప్రతిపాదన పంపారు. కానీ అధికారపార్టీ నాయకులు మాత్రం తొలుత ఆయనపై మండిపడినట్లు తెలిసింది. పనులు పూర్తికాకుండానే ఎన్నికలకు ముందు హడావుడిగా ఎందుకు గోపురాలకు కలశాలను అమర్చారని ప్రశ్నించారు. కేవలం రాజకీయ స్వార్థంకోసం పవిత్రమైన దేవస్థానాన్ని కూడా వేదిక చేసుకోవడం దారుణమని మండిపడ్డారు.



బిల్లులు ఇవ్వక పనులు నిలిచిన తూర్పు వైపు గోపురం

ఇప్పటివరకు చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు చెల్లించిన మొత్తం ఎంత, దాతల నుంచి సేకరించిన విరాళాలు ఎంత మొత్తం అనేవి లెక్కచెప్పి తప్పుకోవాలని సూచించారు. దీనికి పాలకవర్గం అంగీకరించలేదని తెలిసింది. మరోవైపు ప్రస్తుతం పాలకవర్గంపై దాతలు కూడా ఒత్తిడి తీవ్రం చేశారు. తాము దేవుని కోసం విరాళాలు అందజేస్తే పనులు పూర్తి చేయించకుంటే ఎలా అంటూ పాలకవర్గంలోని కీలకమైన వ్యక్తిని ప్రశ్నించారు కూడా. ఏదిఏమైనా అటు వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు రాక, పనులు పూర్తికాకుండానే రాజకీయ అవసరాల కోసం కలశస్థాపన చేయడం తదితర కారణాల వలన పాలకవర్గం అభాసుపాలైంది.

త్వరలో బిల్లులు అవుతాయి:
గొలమారి శ్రీనివాసరెడ్డి, ఈవో

ఎన్నికల కోడ్ నేపథ్యంలో గతంలో బిల్లులు నిలిచాయి. మరో వారం పదిరోజుల్లో పనులు పూర్తవుతాయి. బిల్లులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. భక్తులకు అసౌకర్యం లేకుండా చూస్తాం.

సీఎస్‌పురం తహసీల్దార్‌పై వేటు

అక్రమ మ్యుటేషన్ చేయడంతో సస్పెన్షన్

ముసునూరు వీఆర్వో కూడా..

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్



సీఎస్‌పురం తహసీల్దార్ నాగూల్‌మీరా

ఒంగోలు(కలెక్టరేట్)/సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 2: అక్రమానికి పాల్పడ్డ చంద్రశేఖరపురం తహసీల్దార్ ఎస్‌కే.నాగూల్‌మీరా, ముసునూరు గ్రామ రెవెన్యూ అధికారి డి.శ్రీనివాసులపై వేటు పడింది. వారిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. రైతుకు చెందిన భూమిని మరొకరికి అక్రమంగా మ్యుటేషన్ చేసినట్లు నిరూపణ కావడంతో కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గత నెల 2న సీఎస్‌పురం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రెడ్డిగారి కొత్తపల్లి గ్రామానికి చెందిన చావా చంద్రశేఖర్ మండలంలోని ముసునూరు గ్రామంలో సర్వే నెంబర్ 219లో గల తమ భూములను తహసీల్దార్, సిబ్బంది అక్రమంగా మ్యుటేషన్ చేశారని వినతిపత్రం అందజేశారు. దీనిపై కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారిని విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జేసీ ఆదేశాల మేరకు ఆర్డీవో జాన్‌ఇర్విన్ విచారించి నివేదిక ఇచ్చారు. తహసీల్దార్ షేక్ నాగూల్‌మీరా, ముసునూరు రెవెన్యూ గ్రామంలోని సర్వేనెంబర్ 219లో ఉన్న 1.48 ఎకరాల భూమిని ఖాతా నెంబర్ 233 నుంచి తొలగించి నిబంధనలకు విరుద్ధంగా కాకు నాగేశ్వరరావుకు ఖాతా నెంబర్ 236, 90024కు అక్రమంగా మ్యుటేషన్ చేశారని నివేదికలో పేర్కొన్నారు. ఇందులో గ్రామ వీఆర్వో దాసరి శ్రీనివాసులు పాత్ర ఉందని కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఆర్డీవో నివేదిక ఆధారంగా తహసీల్దార్ నాగూల్‌మీరా, వీఆర్వో శ్రీనివాసులును కలెక్టర్ శుక్రవారం సస్పెండ్ చేస్తు ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్‌కు వెళ్లి పెన్షన్ అందజేత

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు



హైదరాబాద్‌లో గోగిరెడ్డి సుబ్బమ్మకు పెన్షన్ ఇస్తున్నఉద్యోగి గణేష్

మార్కాపురం రూరల్, ఆగస్టు 2: మండలంలోని నికరంపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు గోగిరెడ్డి సుబ్బమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతోంది. దీంతో సచివాలయ ఉద్యోగి జక్కి గణేష్ శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్లి రూ.4000 వృద్ధాప్య పింఛన్ అందజేశారు. అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స చేయించుకుని తమ కుమారుని ఇంటి వద్ద గోగిరెడ్డి సుబ్బమ్మ ఉంటోంది.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్.. 40 మంది విధుల్లోకి..

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 2 : జిల్లాలో 40మంది తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ అన్సారియా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల సమయంలో పొరుగు జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లను తిరిగి వారి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆ వివరాలిలా.. కే ప్రవీణ్‌కుమార్(నాగులుప్పలపాడుకు బదిలీ), ఒంగోలులో పనిచేస్తున్న ఎం.సృజన్‌కుమార్(మద్దిపాడు), ఆర్.బ్రహ్మయ్య(చీమకుర్తి), వి.ఆదిలక్ష్మి(సంతనూతలపాడు), ఎం.హరిబాబు(యర్రగొండపాలెం), ఎండీ నయూమ్ అహ్మద్(పుల్లలచెరువు), జి.శ్రీనివాస్(త్రిపురాంతకం), పీ బాలాజీ విశ్వనాథ్(దోర్నాల), పీ శైలేంద్రకుమార్(పెద్దారవీడు), బీ రమాదేవి(దొనకొండ)లు నియమితులయ్యారు. జీ రజనికుమారి(కురిచేడు), ఎల్ లక్ష్మీనారాయణ(ముండ్లమూరు), ఎం శ్రావణ్‌కుమార్(దర్శి), పీ సింగారావు(తాళ్లూరు), ఎన్ వాసు(ఒంగోలు), పీ మధుసూదనరావు(కొత్తపట్నం), ఎం జ్వాలానరసింహం(మద్దిపాడు), డీ సీతారామయ్య(టంగుటూరు), వీ పుల్లారావు(పొన్నలూరు), కే చిరంజీవి (మార్కాపురం) నియమితులయ్యారు. బీ జయవర్ధన్(తర్లుపాడు), కనిగిరిలో పనిచేస్తున్న ఏ సురేష్(కొనకనమిట్ల), ఎంవీ కృష్ణారెడ్డి (పొదిలి), వీ కిరణ్(కంభం), ఎం ఆంజనేయరెడ్డి(గిద్దలూరు), బీ దిలీప్‌కుమార్(హెచ్ ఎంపాడు), ఎం సువర్ణ(వెలిగండ్ల), సీహెచ్ అశోక్‌కుమార్‌రెడ్డి(కనిగిరి), సీహెచ్ ఉష(పీసీపల్లి), ఎం మంజునాథరెడ్డి(సీఎస్‌పురం)లు నియమితులయ్యారు. బీవీ రమణారావు(పామూరు), ఎస్ ఉషారాణి(ఏవో, కనిగిరి ఆర్డీవో ఆఫీసు), కే రవీంద్రారెడ్డి(ఏవో, మార్కాపురం సబ్‌కలెక్టర్ ఆఫీస్), మార్కాపురం ఆర్డీవో ఆఫీసులో పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాసరావు(కలెక్టరేట్, అడ్మిన్), ఎస్ఎల్ నారాయణరెడ్డి(కలెక్టరేట్, సూపరింటెండెంట్), టీ రవి(కలెక్టరేట్, సూపరింటెండెంట్, కోఆర్డినేషన్), ఎం.రాజ్యలక్ష్మి(కలెక్టరేట్, సూపరింటెండెంట్, ల్యాండ్), ఎస్.సంజీవరావు(సూపరింటెండెంట్, కలెక్టరేట్ ల్యాండ్-2), కేఎస్ఆర్ కృష్ణారావు(ఒంగోలు ఆర్డీవో ఆఫీసు, కేఆర్‌సీసీ), పెద్దారవీడులో పనిచేస్తున్న కే దాసును(మార్కాపురం ఆర్డీవో ఆఫీసు కేఆర్‌సీసీ)లో నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కేజీబీవీ ప్రత్యేక అధికారి, ఏఎన్ఎంపై వేటు

ఇద్దరినీ ఉద్యోగం నుంచి తొలగిస్తూ డీఈవో ఉత్తర్వులు

పాఠశాలలో బాలిక ప్రసవంపై కలెక్టర్ సీరియస్



కేజీబీవీ ఇదే...

ఒంగోలు నగరం/విద్య, ఆగస్టు 2: కొత్తపట్నం మండలం పాదర్తి-మోటుమాల గ్రామాల మధ్య ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో రెండురోజుల క్రితం ఇంటర్ బాలిక ప్రసవించిన ఘటనపై కలెక్టర్ తమీమ్ అన్సారియా సీరియస్ అయ్యారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలకు కలెక్టర్ ఆదేశించటంతో ప్రత్యేకాధికారి వి.అరుణకుమారి, ఏఎన్ఎం జె.సత్యవతిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ డీఈవో సుభద్ర ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాలయంలో ఆ విద్యార్థిని గర్భంతో ఉంటే గుర్తించలేకపోవడానికి పాఠశాల ప్రత్యేక అధికారి(ప్రిన్సిపాల్) అరుణకుమారి నిర్లక్ష్యమే కారణమని తేల్చారు. అలాగే కేజీబీవీలో ఔట్‌సోర్సింగ్‌పై ఏఎన్ఎంగా పనిచేస్తున్న జె.సత్యవతి ప్రతిరోజూ విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలి. పాఠశాలలో బాలిక గర్భంతో ఉన్నప్పటికీ గుర్తించకపోవటంపై ఆమెను కూడా ఉద్యోగం నుంచి తొలగించేశారు.

ఘటనపై చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆరా...

కేజీబీవీలో జరిగిన ఘటనపై జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వేము రామాంజనేయులు ఆరా తీశారు. బాలిక గర్భం దాల్చటం, బాత్‌రూమ్‌లోనే ప్రసవించటంపై ఆయన ప్రాథమిక విచారణను పూర్తిచేశారు. ఈ ఘటనపై చీమకుర్తి పోలీసుస్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. నిందితులు కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాలిక పూర్తిగా కోలుకున్న తర్వాత పోలీసులు ఆమెను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచనున్నారు. ఈ కమిటీ మరోసారి బాలికను పూర్తిస్థాయిలో విచారించనున్నారు. ఈ అఘాయిత్యానికి పాల్పడిన వారు ఎవరు, బాలికను పాఠశాలలో చేర్పించిన వారు ఎవరు, అక్కడ సిబ్బంది బాలిక గర్భంతో ఉన్న విషయం తెలిసి కూడా దాచిపెట్టారా? ప్రసవించిన విషయాన్ని తొలుత దాచిపెట్టాలని చూశారని వస్తున్న ఆరోపణలు ఎంతవరకు నిజం అనే దిశగా ఇప్పటికే పోలీసులు విచారణ జరుపుతుండగా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కూడా మరోసారి పూర్తిస్థాయిలో విచారణ జరుపనున్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించాలి

టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 2: జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిచేందుకు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం బాలకార్మిక వ్యవస్థపై టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో బాలకార్మికులపై ఈనెల 1 నుంచి 31వతేదీ వరకు నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌ను పక్కాగా నిర్వహించాలన్నారు. ఎక్కడైనా బాలలు పనిచేస్తుంటే వారిని ఆ పని నుంచి విముక్తులు చేసి వారిని పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రైవ్ ద్వారా విముక్తి కల్పించిన వారందరూ బడికి వెళ్తున్నారా.. లేదా? అనేది నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రభుత్వం పిల్లల చదువుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నందున వాటిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. స్పెషల్‌డ్రైవ్‌లో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఐసీడీఎస్, పోలీస్, మెడికల్ తదితర శాఖల అధికారులను సమన్వయం చేసుకొని క్షేత్రస్థాయిలో పర్యటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అధికారులు మాధురి, సుభద్ర, డాక్టర్ సురేష్‌కుమార్, దినేష్‌కుమార్, సీడబ్ల్యూసీ చైర్మన్ రామాంజనేయులు, సార్డ్ స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ ఆర్.సునీల్‌కుమార్ పాల్గొన్నారు. అంతకుముందు బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలనపై కలెక్టరేట్ వద్ద ఏర్పాటుచేసిన ర్యాలీని కలెక్టర్ జెండాను ఊపి ప్రారంభించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పోలీసు శాఖ ప్రక్షాళన

మొన్న ఐడీ పార్టీలు రద్దు

ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్ పటిష్టతకు శ్రీకారం

దిద్దుబాటు చర్యలు చేపట్టిన ఎస్పీ





ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 2: పోలీసు శాఖ ప్రక్షాళనకు నూతన ఎస్పీ ఏఆర్.దామోదర్ శ్రీకారం చుట్టారు. పోలీసు స్టేషన్‌లో ఐడీ పార్టీల పేరుతో వసూల్ రాజాలుగా ఉన్నవారిని సాధారణ విధులకు వినియోగించుకోవాలని ఆదేశాలు జారీచేసిన ఆయన స్పెషల్ బ్రాంచ్ పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు ఔత్సాహికులైన హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల నుంచి దరఖాస్తులు కోరారు. దీంతో ఎస్‌బీలో దీర్ఘకాలికంగా ఉన్నవారి గుండెల్లో అలజడి మొదలైంది. క్షేత్రస్థాయిలో 16మంది ఎస్‌బీ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది దీర్ఘకాలికంగా పనిచేస్తున్నవారే ఉన్నారు. అనేక మందిపై ఆరోపణలు ఉన్నాయి. అదేక్రమంలో ఏఎస్సైలకు అవకాశం లేదని స్పష్టం చేశారు.

పోలీసుశాఖలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది జిల్లాలో ఏమి జరుగుతుంది, అసాంఘిక శక్తుల కార్యకలాపాలు, నాయకుల వ్యవహారశైలిపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి నేరుగా ఎస్పీకి చేరవేయడమే పని. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న సంఘటనలు, రాజకీయ మార్పులు తదితర విషయాలను నేరుగా ప్రజాప్రతినిధులకు చేరవేయడం పరిపాటిగా మారింది. ఎస్పీ కార్యాలయం కంటే ముందుగా ప్రజాప్రతినిధులకు తెలియజేయడం ఆక్షేపణీయం. అదేక్రమంలో పాస్‌పోర్టు వెరిఫికేషన్ పేరుతో వసూళ్లకు పాల్పడడం పోలీసు శాఖకు అప్రతిష్ఠ తెచ్చే అంశంగా మారింది. ఇలాంటి పరిస్థితులలో ఎస్‌బీని ప్రక్షాళన చేయడంవైపు ఎస్పీ అడుగులు వేయడం ఆహ్వానించదగ్గ అంశం.

ఎస్‌బీ నియామకాలలో నిబంధనలు ఇలా..

స్పెషల్ బ్రాంచ్ నియామకాలలో తీసుకోవాల్సిన నిబంధనలు ఇలా ఉన్నాయి. హెడ్‌కానిస్టేబుల్ మాత్రమే క్షేత్రస్థాయిలో అధికారిగా పనిచేయాలి. వారికి సహాయం కోసం కానిస్టేబుల్‌ను నియమించాలి. అవినీతి ఆరోపణలు, పోలీసు కేసులు ఉండకూడదు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేసేందుకు ఆసక్తిచూపుతున్న వారి జాబితాను తయారుచేసి ఇంటెలిజెన్సీ క్లియరెన్స్ తీసుకోవాలి. అలాంటి వారి ప్యానల్ లిస్టు తయారుచేసి అవసరమైనచోట నియామకాలు జరపాలి. అయితే గత ఐదేళ్లుగా అలాంటి ప్రక్రియను పక్కనపెట్టి రాజకీయ నాయకుల సిఫార్సులకు ప్రాధాన్యత ఇస్తూ వచ్చారు. దీంతో ఎస్‌బీ పనితీరు ఆశాజనకంగా లేదని చెప్పవచ్చు.

ఎస్‌బీలో పనిచేయాలనుకునే వారు పేర్లు నమోదు చేసుకోవాలి : ఎస్పీ

స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేసేందుకు ఆసక్తిచూపుతున్న వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. హెడ్‌కానిస్టేబుళ్లు తప్పనిసరిగా పోలీసు శాఖలో 20ఏళ్లు పనిచేయాలని, కానిస్టేబుళ్లు అయితే కనీసం మూడేళ్లు సర్వీసులో చేరి ఉండాలని అలాంటి వారు స్పెషల్ బ్రాంచ్‌కి తమ పేర్లు ఇవ్వాలని ఎస్పీ మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. అదేక్రమంలో తాము కేటాయించిన చోట పనిచేయాలన్నారు. దీంతో ఎస్బీలో ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందిలో అలజడి బయలుదేరింది. సమూలంగా మార్పులు చేస్తారా? లేక అంచెలంచెలుగా బదిలీలు ఉంటాయా అనేది చర్చనీయాంశమైంది.

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగ దర్శనయాత్ర



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 2 : భారతీయ రైల్వే అనుబంధ సంస్థ అయిన ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగ దర్శన యాత్ర కోసం ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఏరియా మేనేజరు రాజా, సూపర్‌వైజర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఒంగోలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ భారత్ గౌరవ్ టూరిస్టు రైలు విజయవాడ నుంచి నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రైలు ఆగస్టు 17వ తేదీ నుంచి 28వ వరకు పన్నెండు రోజులపాటు సాగుతుందని తెలిపారు. మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, ద్వారా, సోమనాథ్, భీమాశంకర్, త్రయంబకేశ్వర్ తదితర ప్రాంతాలతో యాత్ర సాగుతుందన్నారు. స్లీపర్ క్లాస్ ఒక వ్యక్తికి రూ. 20,590, థర్డ్ ఏసీ రూ.33,015, సెకండ్ ఏసీ రూ.43,355 టికెట్ ధరగా నిర్ణయించడమైనదని తెలిపారు. ఇందులో భాగంగా ప్రయాణం, రాత్రిపూట బస, ఇతర సౌకర్యాలు కోసం హోటల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాల కోసం విజయవాడలోని ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో లేదా 9281030714, 9281495848 సెల్ నంబర్ల ద్వారా సంప్రదించాలని వారు కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

నాగులుప్పలపాడు, ఆగస్టు 2: నాగులుప్పలపాడు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహాలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నలమలపు అంజమ్మ అధ్యక్షతన ఉదయం 11గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా తమ నివేదికలతో హాజరు కావాలని ఆమె కోరారు.

నోటు పుస్తకాలు, బస్‌పాస్‌లు అందజేత



విద్యార్థులకు పుస్తకాలు, బస్‌పాస్‌లను అందజేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ, శాంతకుమారి

కొత్తపట్నం(ఒంగోలు నగరం), ఆగస్టు 2: కొత్తపట్నంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఒంగోలులోని శ్రీరామ్ సూపర్‌స్పెషాలిటీ అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ శుక్రవారం నోటు పుస్తకాలు, ఉచిత బస్‌పాస్‌లు అందజేశారు. పాఠశాలలోని 500మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను, దూర ప్రాంతాల నుంచి స్కూలుకు వస్తున్న 120మందికి విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. వీటితోపాటు పాఠశాలకు సిమెంటు బల్లలను కూడా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వైద్య దంపతులు చాపల వంశీకృష్ణ, శాంతకుమారి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యద్వారానే ఏదైనా సాధించవచ్చని, పాఠశాలకు, ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీదేవి, గ్రామ పెద్దలు పిన్ని వెంకటేశ్వర్లు, చాపల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు

మద్దిపాడు, ఆగస్టు 2: మద్దిపాడులోని శ్రీగంగా పార్వతి కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు రాజు పంతులు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమం జరిగింది.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, ఆగస్టు 2: గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద శుక్రవారం ఆటో, మోటార్ సైకిల్ ఢీకొని యువకునికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు, అద్దంకి వైపు నుంచి ఒంగోలు వెళ్తున్న ఆటో కారును అధిగమించబోయి అదుపు తప్పి మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో మోటార్‌సైకిల్‌ను నడుపుతున్న గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలో పనిచేసే కార్మికుడు షేక్ నజీర్‌బాషాకు గాయాలు కాగా చికిత్స కోసం ఒంగోలు తరలించారు.

అక్రమంగా మద్యం విక్రయాలు

185 క్వార్టర్, 15 ఫుల్‌బాటిళ్లు సీజ్ • ఒకరి అరెస్ట్

ఒంగోలు(క్రైం), ఆగస్టు2 : ఒంగోలులోని సరిగమ రెస్టారెంట్ వద్ద అర్ధరాత్రి సమయంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 185 క్వార్టర్, 15 ఫుల్‌బాటిళ్ల మద్యంతో పాటు రూ.11వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి స్థానిక బైపాస్‌రోడ్డులో గల సరిగమ రెస్టారెంట్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఆనాల సురేష్‌ను అదుపులోకి తీసుకొన్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు. గస్తీ విధులలో ఉన్న రూరల్ సీఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. రెస్టారెంట్‌లో పనిచేస్తున్న ఆనాల సురేష్ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. ఎస్సై విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుబ్బారావు గుప్తాకు బెదిరింపు కాల్స్

• పోలీసులకు ఫిర్యాదు

ఒంగోలు(క్రైం), ఆగస్టు2: ఒంగోలుకు చెందిన ఆర్యవైశ్య నాయకుడు సుబ్బారావు గుప్తాను హత్య చేస్తామంటూ బెదిరింపు కాల్స్ రావడంతో శుక్రవారం ఆయన స్థానిక తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 31న రాత్రి వరసగా ముగ్గురు వ్యక్తులు ఫోన్‌లు చేసి తనను చంపివేస్తామని బెదిరించారని, అందులో ఓ మహిళ కూడా ఉందని తెలిపారు. ఈమేరకు ఎస్సై విజయకుమార్‌కు ఫిర్యాదును అందజేశారు. తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని సుబ్బారావుగుప్తా పోలీసులను కోరారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.358

సంతనూతలపాడు, ఆగస్టు 2: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.358 పలికింది. మద్దులూరు క్లస్టర్ నుంచి 1102 పొగాకు బేళ్లు రాగా997 బేళ్లు అమ్ముడయ్యాయి. 105 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.204, సరాసరి ధర రూ.314 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

వెల్లంపల్లిలో...

మద్దిపాడు: వెల్లంపల్లి పొగాకు కేంద్రంలో కొనుగోలు ప్రక్రియ శుక్రవారం ఊపందుకుంది. కిలో గరిష్ఠ ధర రూ.358 పలికింది. వివిధ ప్రాంతాల నుంచి 941 పొగాకు బేళ్లు రాగా 809 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. కనిష్ఠ ధర కిలో రూ.295 వచ్చిందని వేలంకేంద్రం కార్యనిర్వహణాధికారి రామకృష్ణ తెలిపారు.

ఆసుపత్రిలో రోగికి పెన్షన్ అందజేత



బంగారమ్మకు నగదును ఎలీషా

టంగుటూరు, ఆగస్టు 2 : టంగుటూరుకు చెందిన బొమ్మల బంగారమ్మ అస్వస్థతకు గురికావడంతో కొన్ని రోజులుగా ఒంగోలు కిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. ఆమెకు ఈ నెల పెన్షన్ ఇచ్చే బాధ్యత సచివాలయం-2 ఫిషరీస్ అసిస్టెంట్ ఎలీషాకు అప్పజెప్పారు. అతను బంగారమ్మ విషయం తెలుసుకుని కిమ్స్ ఆసుపత్రికి చేరుకొని పింఛన్ అందజేశారు. ఆపద సమయంలో పెన్షన్ సొమ్ము ఇచ్చి భరోసా ఇచ్చావని ఆమె కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

సింగరాయకొండ సీఐగా హజరత్తయ్య బాధ్యతల స్వీకరణ

సింగరాయకొండ, ఆగస్టు 2 : స్థానిక సర్కిల్ కార్యాలయంలో సింగరాయకొండ సీఐగా హజరత్తయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను బాపట్ల దిశ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తుండగా సింగరాయకొండకు బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సీఐ రంగనాథ్‌ను వీఆర్‌కు పంపారు.

సీఎంగా చంద్రబాబు ఉండటం మాదిగల అదృష్టం

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అభినందనీయం • ఎమ్మార్పీఎస్ నాయకుడు బ్రహ్మయ్యమాదిగ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్యమాదిగ

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 2: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉండటం మాదిగల అదృష్టమని, ఎస్సీ వర్గీకరణపై గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ హర్షం చేస్తుందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక సభ్యులు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌ల వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసుకోవచ్చని సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమన్నారు. దీనిని ఎమ్మార్పీఎస్ స్వాగతిస్తుందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమం 1994 జూలై 7న నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామంలో మొదలైందని, ముప్పై సంవత్సరాల సుదీర్ఘ పోరాటానికి నేడు తగిన న్యాయం జరిగిందని బ్రహ్మయ్య వెల్లడించారు. ఈ ఉద్యమంలో వేలాదిమంది కార్యకర్తలు జైలుపాలు కాగా, మరెందరో ప్రాణాలు కోల్పోయారన్నారు. న్యాయవ్యవస్థ ద్వారా వర్గీకరణ అంశం పరిష్కారం కావడం సంతోషదాయకమన్నారు. ముఖ్యంగా 1994లో వర్గీకరణ ఉద్యమం మొదలైనప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఆనాటి నుంచి నేటి వరకు తనదైన పాత్ర పోషించారని, వర్గీకరణ సాధన కోసం ఆయన చేసిన కృషికి మాదిగ జాతి కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు. ఉద్యమం ప్రారంభంలోనూ సీఎంగా, ఇప్పుడు తీర్పు వెలువడిన సమయంలోనూ సీఎంగా చంద్రబాబు ఉండటం మాదిగలకు పూర్తి స్థాయి న్యాయం, మేలు జరుగుతుందని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడుకు ఎమ్మార్పీఎస్ తరపున కృతజ్ఞతులు తెలియజేస్తున్నట్లు బ్రహ్మయ్య వెల్లడించారు. అలాగే కోర్టు తీర్పు వెలువడకముందే తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించడం మాదిగజాతి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు. వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు తీర్పును అంకితమిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ భవనం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్, బాబూజగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు పాలాభిషేకం చేసిన ఎమ్మార్పీఎస్ శ్రేణులు టీడీపీ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రావినూతల కోటి మాదిగ, కొమ్మూరి గరటయ్యమాదిగ, రేణమాల, నాగయ్య, బాలరాజు, బక్కా రాజు, ముప్పవరపు గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పోస్టల్ సిబ్బందికి విముక్తి

అనంతవరంలో ఖాతాదారుల సొమ్మును కాజేసిన బీపీఎం, ఏబీపీఎం • రాత్రంతా నిర్బంధంలోనే.. • హామీ పత్రాలు తీసుకుని విడుదల



కాపలా కూర్చున్న ఖాతాదారులు

టంగుటూరు, ఆగస్టు 2 : మండలంలోని అనంతవరం పోస్టాఫీసులో జరిగిన అక్రమాలపై ఖాతాదారులైన ప్రజలు గురువారం రాత్రంతా పోస్టల్ ఉద్యోగులను నిర్బంధించారు. పక్కదారి పట్టించిన నగదును తిరిగి ఖాతాదారులకు ఎప్పుడు చెల్లించేది? ఎలా చెల్లించేది? వంటి వాటికి సంబంధించి పూర్తి హామీ పత్రాలను తీసుకున్నారు. దీంతో శుక్రవారం ఉదయం బీపీఎం, ఏబీపీఎంలను నిర్బంధం నుంచి విడిపించారు. ఖాతాదారుల సొమ్ము వారి ఖాతాలకు చెల్లించకుండా బీపీఎం, ఏబీపీఎం కూడబలుక్కొని సుమారు రూ.20 లక్షలను కాజేశారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రవిరెడ్డి తనిఖీల ద్వారా విషయం బయటకు రావడంతో గ్రామస్థులు కంగుతిన్నారు. గురువారం బీపీఎం సాయి శ్రీనివాసనాయక్, ఏబీపీఎం కొమ్ము సుందరరావులను ఖాతాదారులు పోస్టాఫీస్‌లో నిర్బంధించారు. ఈ విషయంలో గ్రామ పెద్దలు మాట్లాడి ఉద్యోగులు ఇద్దరూ చెల్లించాల్సిన డబ్బు పదిరోజుల్లో ఇస్తామని చెప్పించారు. అంతవరకు వారి నుంచి బ్యాంకు చెక్కులు ఇప్పించడంతో వదిలిపెట్టారు. ప్రస్తుతం గ్రామంలో ఇదే అంశం పెద్ద చర్చనీయాంశమైంది.

సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం

• మమ అనిపించిన అధికారులు

టంగుటూరు, ఆగస్టు 2: టంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం అత్యంత సాదాసీదాగా జరిగింది. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డాక ఇదే తొలి మండల పరిషత్ సమావేశం. ఇప్పటి వరకు ప్రతి సమావేశంలో చురుగ్గా పాల్గొంటూ అధికారులను ప్రశ్నలపై ప్రశ్నలు సంధించిన అప్పటి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కొందరు ఈసారి పట్టీపట్టనట్లు కూర్చున్నారు. ఇకపోతే ప్రస్తుత అధికారపార్టీకి చెందిన టీడీపీ సభ్యులు కొందరు ఇది వరకు అవకాశం దొరికితే సభలో ప్రశ్నలతో పాలకవర్గాన్ని గుక్కతిప్పుకోకుండా చేసేవారు. ఈసారి వారూ మౌనం దాల్చారు. అధికారులు వారి శాఖల వివరాలు అప్పచెప్పడంతోనే సభను మమ అనిపించారు. టంగుటూరు ఎంపీటీసీ సభ్యుడు దాస్ మాట్లాడుతూ ఇటీవల వాటర్ స్కీం పనిచేయనప్పుడు ట్యాంకర్లతో నీరు సరఫరా చేశారని, ఈ నీరు దాతలు సరఫరా చేసినవా, కొనుగోలు చేసినవా అని ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ కిశోర్‌కుమార్‌ను ప్రశ్నించారు. తాను కొత్తగా వచ్చానని, తనకు తెలియదని ఏఈ సమాధానం చెప్పారు. ఇందుకు దాస్ అభ్యంతరం చెబుతూ సభ ముగిసేలోగా తెలుసుకుని చెప్పాలన్నారు. ఏవో స్వర్ణలత, వైద్యాధికారి ప్రసాద్‌బాబు, ఏపీవో సుభాషిణి పాల్గొన్నారు. ముందుగా ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిందని, ఇరుపార్టీల వారం ఒకరికొకరు సహకరించుకుందాం అని కోరడం గమనార్హం.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

• కేసు నమోదు



ఉమాదేవి (ఫైల్)

సంతనూతలపాడు, ఆగస్టు 2: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శుక్రవారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై దేవకుమార్ తెలిపిన వివరాల మేరకు.. సంతనూతలపాడుకు చెందిన బూదాటి శ్రీనుకు, ఉమాదేవి(37)కి 19 ఏళ్లక్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. చిన్నమ్మాయి విజయవాడలో చదువుతుండగా, కుమారుడు ఒంగోలులో చదువుతున్నాడు. అయితే పెద్దమ్మాయికి ఇటీవల ఇంజనీరింగ్ సీటు చండీఘడ్ రాష్ట్రంలో రావడంతో అమ్మాయి తండ్రి శ్రీనివాసరావు అక్కడ చేర్చాడు. అయితే చండీఘడ్‌లో పెద్దమ్మాయిని చేర్పించడం తల్లి ఉమాదేవికి ఇష్టం లేదు. ఈక్రమంలో భార్యాభర్తల మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో గత నెల 30వ తేదీన వేకువజామున కూల్‌డ్రింక్‌లో పురుగులమందు కలిపి తాగింది. ఆ సమయంలో సంతనూతలపాడులోనే తమ సొంత రైస్ మిల్లులో ఉన్న శ్రీనివాసరావుకు, చండీఘడ్ రాష్ట్రంలో ఇంజనీరింగ్ చదువుతున్న పెద్దమ్మాయికి జరిగిన విషయం ఫోన్ ద్వారా సమాచారం అందించింది. వెంటనే భర్త శ్రీనివాసరావు పురుగులమందు తాగిన భార్య ఉమాదేవిని వెంటనే ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఆరోగ్యం మెరుగుకాక పోవడంతో వెంటనే మంగళగిరిలోని ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఎయిమ్స్ వద్ద నున్న పోలీసులకు మరణ వాంగ్మూలం ఇచ్చి శుక్రవారం రాత్రి మరణించింది. మృతురాలి వాంగ్మూలాన్ని సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్‌కు పంపించారు. ఆమేరకు ఎస్సై దేవకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనపై సంబరాలు



సంతనూతలపాడులో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



మద్దిపాడులో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

సంతనూతలపాడు, ఆగస్టు 2: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు, ఉద్యమనేత మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ సాధనపై ఘనవిజయం సాధించడం అభినందనీయమని జిల్లా అధ్యక్షుడు తొరటి ఆనంద్‌మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం సంతనూతలపాడులో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగ బిడ్డలంతా మంద కృష్ణమాదిగకు రుణపడి ఉన్నామన్నారు. ఇక నుంచి మాదిగ బిడ్డల భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి, మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మంద కృష్ణమాదిగ కలిసినపుడు ఎస్సీ వర్గీకరణపై అంతా అనుకూలంగా ఉంటుందని కోర్టులో తప్పని సరిగా న్యాయం జరుగుతుందని చెప్పారన్నారు. ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు ఎస్సీ వర్గీకరణపై అనుకూలంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.విజయ, కార్పొరేటర్ చంద్రశేఖర్, ఆట్లూరి అశోక్, పి.రవి, వి.కోటేశ్వరరావు, ఎ.బిక్షాలు, నెహేమియా, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వటంతో మద్దిపాడులో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు రెబ్బవరపు ప్రభాకర్ నేతృత్వంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం ఈ తీర్పుతో ఫలించిందన్నారు. కొంత జాప్యం జరిగినప్పటికీ అంతిమ విజయం రావటానికి కృషి చేసిన ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణ మాదిగకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చెంచయ్య, వినోద్, విజయ్‌రాజు, చిన్న, జోసఫ్, అక్కయ్య, డేవిడ్, నాయకులు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బక్కా తిరుమలరావుమాదిగ శుక్రవారం తెలిపారు. ముందుగా పలువురు నాయకులు టంగుటూరు బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎద్దఎత్తున బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ పెద్దలు బక్కా సుదర్శన్, అంగలకుర్తి భాస్కర్, కొమ్ము భానుచందర్, రావినూతల మదన్, రాజు, కోటయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనం

చీమకుర్తి, ఆగస్టు 2: ప్రకృతి వ్యవసాయంతో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చని డీఏవో శ్రీనివాసరావు తెలిపారు. పల్లామల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంతో పండిస్తున్న వివిధరకాల పంటలను ఆయన వ్యవసాయశాఖాధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ప్రతి రైతు పచ్చిరొట్ట ఎరువులను సాగుచేసి భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, శైలజ, శేషమ్మ, భాస్కర్, వాస్సర్, శ్రీరామ్, నిక్కి, జానకీ, రమేష్ పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు

కానిస్టేబుల్‌పై యువకుల దాడి

ఒంగోలు(క్రైం), ఆగస్టు2 : పూటుగా మద్యం తాగిన ముగ్గురు యువకులు నానా యాగి చేసి కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన ఒంగోలులోని గోరంట్ల కాంప్లెక్స్ వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. స్థానిక గోపాల్‌నగరానకు చెందిన గడ్డి గోపీతోపాటు మరో ఇద్దరు మద్యం తాగి గోరంట్ల కాంప్లెక్స్ వద్ద బైక్‌తో శబ్దం చేస్తూ చక్కర్లు కొట్టారు. అదే సమయంలో అక్కడ వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఆప్రాంతంలో మెడికల్ షాప్‌లో మందులు కొనుగోలు చేసేందుకు ఓ ఏఆర్ కానిస్టేబుల్, హోంగార్డు వెళ్లారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయంగా ఉందని రోడ్డుకు అడ్డుగా నిలిపిన బైక్‌ను తొలిగించాలని చెప్పిన ఏఆర్ కానిస్టేబుల్‌పై గడ్డిగోపి చేయిచేసుకున్నాడు. అతని పక్కన ఉన్న ఇద్దరు యువకులు కూడా దాడికి పాల్పడ్డారు. అయితే అక్కడకు టూటౌన్ పోలీసులు వెళ్లేసరికి ముగ్గురు యువకులు పరారీ అయ్యారు. బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏఆర్ కానిస్టేబుల్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

మద్దిపాడు, ఆగస్టు 2: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేయడం ఎంతో సంతోషదాయకమని అడ్వకేట్ కావూరి సీమోను పేర్కొన్నారు. మండల పరిధిలోని ఘడియపూడికి చెందిన ఆయన శుక్రవారం మాట్లాడుతూ కోర్టు తీర్పు బలహీన వర్గాల అభివృద్ధికి తోడ్పడుతుందని, ఎమ్మార్పీఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అవీ.. ఇవీ..

పేదలకు అన్నదానం ఆదర్శనీయం



అన్నదానం చేస్తున్న కుసుమకుమారి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 2: జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ పేరుతో పేదల ఆకలి తీర్చడం ఆదర్శనీయమని తెలుగు మహిళా రాష్ట్ర నాయకురాలు కె.కుసుమకుమారి పేర్కొన్నారు. జనసేన నేత జడ బాలనాగేంద్రయాదవ్ ఆధ్వర్యంలో స్థానిక లాయర్‌పేటలోని సీతమ్మ క్యాంటీన్ వద్ద శుక్రవారం కుసుమకుమారి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పేదల పక్షాన ఉంటూ పేదల ఆకలితో పాటు వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏకేయూ వీసీకి అభినందన

ఒంగోలు(విద్య), ఆగస్టు 2: ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్, ప్రొఫెసర్ డీవీఆర్.మూర్తిని శుక్రవారం ఒంగోలులో పెద్దారవీడులోని ఎస్ఎస్ లా కళాశాల ఛైర్మన్ ఎస్.చంద్రమౌళి మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వీసీని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు పాల్గొన్నారు. అలాగే వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తిని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ రెక్టార్ ప్రొఫెసర్ వైపీ.రామసుబ్బయ్య, శ్రీవెంకటేశ్వరవిశ్వవిద్యాలయం లా విభాగం ప్రొఫెసర్ వీఆర్‌సీ.కృష్ణయ్య మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. కార్యక్రమంలో యూనివర్శిటీ సీడీసీ డీన్ డి.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

5న జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 2 : స్కీం వర్కర్లను తొలగింపును వ్యతిరేకిస్తూ ఈనెల 5వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్కీం వర్కర్లు, చిన్న ఉద్యోగులపై వేధింపులు పెరిగాయన్నారు. రాజకీయాలకు అతీతంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాల పారిశుధ్య కార్మికులు, వీవోఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లను తొలగించేందుకు వత్తిడిలు పెరిగాయన్నారు. కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో స్కీంవర్కర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

టైలరింగ్ శిక్షణతో మహిళలకు స్వయంఉపాధి



శిక్షణను ప్రారంభిస్తున్న సవిత

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 2: టైలరింగ్‌లో శిక్షణ పొందటం మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ సతీమణి సవిత పేర్కొన్నారు. స్థానిక కర్నూల్ రోడ్ సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్‌లో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టైలరింగ్ నేర్చుకోవటం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందుతారని, ఇటువంటి శిక్షణ ఏర్పాటు చేయటం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు తమ్మిశెట్టి రమాదేవి, ట్రస్ట్ ఛైర్మన్ షహనాజ్, రెడ్‌క్రాస్ సభ్యురాలు వడ్డెంపూడి సుజాత, కోసూరి శ్రీదేవి, షబాన, లక్ష్మి, జయవర్ధని పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 2 : ఒంగోలు నగరానికి దూరంగా రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేయడం అందులో ఆంతర్యం ఏమిటని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగా లేదని, అయినా రిజిస్ట్రేషన్ కార్యాలయం అద్దె భవనంలో పెట్టడం సమంజసమా అని విమర్శించారు. కలెక్టరేట్‌లో అనేక భవనాలు ఖాళీగా ఉన్నాయని, వాటిలో రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు ప్రభుత్వానికి అద్దెభారం కూడా తగ్గుతుందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 2: ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో శుక్రవారం విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు బి.శ్రీనివాసరెడ్డి, సాయివినయ్‌కుమార్, ఎం.సునీత, నవీన్‌కుమార్, సుమంత్, ప్రసన్నలు చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ శృతి సాయినాథుని, కరస్పాండెంట్ జీవీ.భాస్కర్, ప్రిన్సిపాల్ ఎం.మహేష్, శశిలక్ష్మి పాల్గొన్నారు.

రైతు ఆర్థికాభివృద్ధిపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 2 : రైతు ఆర్థికాభివృద్ధికి ఆపరేషన్ గ్రీన్స్ పథకం అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్రవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరగా పాడైపోయే 22 పంటలకు రైతుల ఆర్థిక స్తోమతను పెంచేందుకు, ఉత్పత్తుల నష్టాలను తగ్గించేందుకు కేంద్రం ఈ పథకం ద్వారా ఎటువంటి చర్యలు తీసుకుందన్నారు. దీనిపై కేంద్ర ఆహార తయారీ పరిశ్రమలశాఖ సహాయక మంత్రి రావ్‌నీత్‌సింగ్ సమాధానం ఇస్తూ టమెటా, ఉల్లి, ఉర్లగడ్డ తదితర 22 రకాల పంటలు త్వరగా పాడై పోయే పంటలకు రైతులకు నష్టాలు తగ్గించేందుకు పీఎం కిసాన్ సంపద యోజన కార్యక్రమం ద్వారా ఆపరేషన్ గ్రీన్స్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో 77,140 మంది రైతులకు లాభం చేకూరిందన్నారు స్వల్పకాలిక భాగం కింద రూ.119కోట్ల సబ్సిడీ మంజూరు చేయగా, దేశంలో 31,364 మంది రైతులు తమ ఉత్పత్తుల నిల్వ, రవాణాకు లాభపడతారని కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

117 జీవోను రద్దు చేయాలి

ఒంగోలు(విద్య), ఆగస్టు 2: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రభుత్వం వెంటనే జీవోనెంబరు 117 రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ.కీర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి బివెంకట్రావు, బి.అశోక్‌కుమార్, గౌరవాధ్యక్షుడు ఎ.అమ్మయ్య, ఐపీయా కౌన్సిలర్ పీవీ.సుబ్బారావు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. హైస్కూళ్ళలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలను కొనసాగించి విద్యార్థులు తెలుగు లేదా ఇంగ్లీషు మీడియంలలో పబ్లిక్ పరీక్షలు రాసుకునేందుకు అవకాశం కల్పించాలని, టీచర్లకు బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలన్నారు. పాఠశాలల గ్రాంట్లను వెంటనే విడుదల చేయాలని, టీచర్ల అంతర్ జిల్లాల బదిలీలకు అనుమతించాలని, ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఇతర అన్ని క్యాడర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

కొత్త నేర చట్టాలను ఉపసంహరించుకోవాలి



సభలో మాట్లాడుతున్న గోవిందయ్య

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 2: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త నేర చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఓపీడీఆర్, ప్రజాతంత్ర మేధావుల వేదిక డిమాండ్ చేశాయి. స్థానిక ఈమనిపాలెం లోని తరిమెల నాగిరెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన సభలో ప్రజాతంత్ర మేధావుల వేదిక కన్వీనర్, ప్రముఖ న్యాయవాది పంగులూరి గోవిందయ్య మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యఅధినియంల పేరిట వచ్చిన చట్టాలు ప్రజల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయన్నారు. ఇలాంటి చట్టాలకు వ్యతిరేకంగా ప్రజాతంత్రవాదులందరూ గళం విప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐఎఫ్‌టీయూ రాష్ట్రకోశాధికారి డీవీఎన్.స్వామి మాట్లాడుతూ నూతన చట్టాలు ప్రజా ఉద్యమాలకు, ప్రజలహక్కులకు భంగం కలిగించే విధంగా ఉన్నాయన్నారు. ఓపీడీఆర్ నాయకులు పి.సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కత్తి పేరయ్య, కె.సుబ్బారావు, ఎస్.లలితకుమారి, ఎంఎస్.సాయి, ఐ.విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్ ఆసుపత్రిలో 7వరకు ఉచిత ఓపీ

ఒంగోలు నగరం, ఆగస్టు 2: ఒంగోలు నగరం గుంటూరురోడ్డులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈ నెల ఏడవ తేదీ వరకు చిన్న పిల్లల వైద్యవిభాగంలో ఉచిత ఓపీతో వైద్యసేవలు అందిస్తామని ఆసుపత్రి అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ శుక్రవారం తెలిపారు. తల్లిపాల వారోత్సవాల నేపథ్యంలో తమ వంతు కర్తవ్యంగా తల్లి, పిల్లల విభాగంలో డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ వెంకటేష్ వైద్యసేవలు అందిస్తారన్నారు. అలాగే వైద్యపరీక్షలు, కాన్పులు, ఆపరేషన్లు రాయితీపై చేస్తారని, రోగులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న
సింగరాయకొండ వైస్ సర్పంచ్

● మంత్రి స్వామి సమక్షంలో పార్టీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, ఆగస్టు 2 : సింగరాయకొండ వైస్ సర్పంచ్ షేక్ కరిమున్ వైసీపీకి గుడ్‌బై చెప్పారు. శుక్రవారం రాత్రి టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆమెతోపాటు వైసీపీనేత ఆయన కుమారుడు షేక్ సుభానీకి కూడా కండువాకప్పి ఇరువురును పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ సందానీబాషా, నేతలు యస్థాని, సనావుల్లా, ఉప్పిరెట్ల రవి, జాకీర్‌బాషా పాల్గొన్నారు.

పులికొండలో విద్యాసామగ్రి పంపిణీ



సామగ్రిని అందజేస్తున్న దాత ప్రకాష్, ఎంఈవో నరసింహారావు

చీమకుర్తి, ఆగస్టు 2: చీమకుర్తి మండలంలోని పులికొండ మండలపరిషత్ ప్రాథమికోతన్నతపాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. గ్రానైట్ వ్యాపారి నూకల ప్రకాష్, ఎంఈవో నరసింహారావుల చేతుల మీదుగా వాటిని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న దాతలను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో ఆలపాటి నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు తహసీల్దార్‌గా ప్రవీణ్‌కుమార్

నాగులుప్పలపాడు, ఆగస్టు 2 : మండల తహసీల్దార్‌గా ప్రవీణ్‌కుమార్ నియామకమయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ అద్దేటి శ్రీనివాసరావు ఎన్నికల విధుల్లో భాగంగా గుంటూరు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇటీవల పక్క జిల్లాల తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేశారు. ఈక్రమంలో ప్రవీణ్‌కుమార్‌ను నాగులుప్పలపాడుకు నియమిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

పారిశుధ్య కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 2: కారంచేడు గ్రామ పంచాయతీ టెండర్లలో అవకతవకలు జరిగాయని, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులను విధుల్లోకి రాకూడదని ఈవోఆర్డీ రమేష్ మెమో జారీ చేయటం పట్ల పారిశుధ్య కార్మికులు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈకార్యక్రమానికి సీఐటీయు మద్దతుగా నిలిచి కార్మికులతో కలిసి కార్యాలయం ముందు నిరసన గళం వినిపించారు. సీఐటీయూ నేత కొండయ్య మాట్లాడుతూ పంచాయతీ కాంట్రాక్టర్లు మారినా, టెండర్ దారులు మారినాపారిశుధ్య కార్మికులను కొనసాగించాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారులు ఈవిషయాన్ని గుర్తించి టెండర్లను ఆమోదించి కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని కోరారు. ఈకార్యక్రమంలో కారంచేడు గ్రామ సర్పంచ్ బాలిగ శివపార్వతి, గ్రామస్థులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థినుల వివాదంపై విచారణ

చీరాలటౌన్, ఆగస్టు 2 : చీరాల పట్టణంలో బీసీ హాస్టల్ విద్యార్థినుల వాయిస్ సోషల్ మాధ్యమాల ద్వారా వైరల్ అయిన ఘటనపై ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి విచారణ జరిపారు. హాస్టల్‌లో ముగ్గురు విద్యార్థినులు హాస్టల్ నుంచి బయటకు రావడంతో స్థానికులు వారిని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. దీంతో స్పందించిన పోలీసులు వారిని హాస్టల్ వార్డెన్ పాలపర్తి కోటేశ్వరమ్మకు అప్పగించారు. దీనిపై ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి నేరుగా హాస్టల్‌కు వెళ్లి విచారణ జరిపారు. ప్రస్తుత పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నట్లు గుర్తు చేశారు. అలాగే వార్డెన్, ఆమె కుమారుడికి పలు హెచ్చరికలు జారీ చేశారు. మరోమారు ఇటువంటివి ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. అయితే వార్డెన్ కోటేశ్వరమ్మ చాలాకాలంగా అనారోగ్యం బారిన పడటంతో మరో విభాగానికి బదిలీకి దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

చిన్నారిని ఆదుకోవటం అభినందనీయం

బల్లికురవ, ఆగస్టు 2: అనారోగ్యం బారిన పడిన చిన్నారి కుటుంబానికి ఎన్ఆర్ఐలు ఆర్థిక చేయూత నివ్వటం అభినందనీయమని ఎంఈవో రమేష్ అన్నారు. శుక్రవారం అంబడిపూడి ఉన్నత పాఠశాలలో అదేగ్రామానికి చెందిన బడుగు సుధారాణి చిన్నబాబు దంపతుల 8 ఏళ్ల కుమారుడు జాన్‌వెస్లీ మెదడుకు సంబంధించిన వ్యాధి బారిన పడి విజయవాడ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివలింగారావు తన వద్ద చదివిన యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థి బత్తుల అనిల్ దృష్టికి తీసుకుపోయాడు. అనిల్ అమెరికాలో స్థిరపడి వారి మిత్ర బృందం ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 1.60 లక్షల చెక్కును చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. అదేవిధంగా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కూడా రూ. 60వేల నగదును కూడా అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఈసందర్భంగా ఎంఈవో రమేష్ గ్రామ పెద్దలు ఎన్ఆర్ఐల ఆర్థిక సహకారాన్ని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొట్లగుంట వెంకటనర్సయ్య, వేణుబాబు, దద్దాల అంజయ్య, సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు ఎస్సెస్సీ కాలనీలో చోరీ

కురిచేడు, ఆగస్టు 2: కురిచేడు పాత ఎస్సెస్సీ కాలనీలోని ఓ గృహంలో శుక్రవారం మధ్యాహ్నం దొంగతనం జరిగింది. కురిచేడు ప్రధాన కూడలిలో ఫ్యాన్లు, మిక్సీలు మరమ్మతులు చేసే రాంబాబు పాత ఎస్సెస్సీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మధ్యాహ్న సమయంలో ఇద్దరు యువకులు వారి ఇంటి వద్దకు వచ్చి ఒకరు బయట కాపలా ఉండి మరొకరు ఇంటి వెనుకవైపు గోడదూకి తలుపులు పగుల కొట్టి ఇంట్లోకి వెళ్లాడు. బీరువా తలుపులు తీసి అందులో నుంచి రూ.5 వేలు తీసుకుని బయటకు వచ్చాడు. ఆ సమయంలో రాంబాబు భార్య గమనించి ఇంటి వైపు వెళ్లగా పారిపోయారు. ఇరుగుపొరుగు వారు వెంబడించినా వారు చిక్కలేదు. కురిచేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు పరిశీలించి వెళ్లారు. ఇప్పటికీ రెండుసార్లు అదే ఇంట్లో చోరీ జరిగింది. నాలుగు నెలల క్రితం ఇంట్లోకి వచ్చి బీరువా పగులకొట్టి రూ.60 వేలు చోరీ చేశారు. మరోసారి అలాగే జరిగింది. వీటిపై రాంబాబు ఫిర్యాదు చేయలేదు. ఇదే అదనుగా తీసుకున్న దొంగలు మూడోసారి అదే ఇంటికి దొంగతనానికి వచ్చారు. పోలీసులు సీసీ పుటేజి పరిశీలిస్తున్నారు. చోరీల పాల్గొన్న ఇద్దరు కూడా మైనర్లేనని బాధితులు చెప్తున్నారు.

జూదరుల అరెస్టు

తాళ్లూరు, ఆగస్టు 2: మండలంలోని లక్కవరం గ్రామ సమీప పొలాల్లో పేకాడుతుండగా శుక్రవారం ఎస్సై కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేశారు. ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని పది సెల్‌ఫోన్లు, రూ.74,640 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని దర్శి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

‘తాళ్లూరు’కు సిబ్బంది కావలెను!

ఆర్ఐ, ఏఎస్‌వో, వీఆర్‌వోలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఆరు గ్రామసచివాలయాలకు రెగ్యులర్ అధికారి లేరు..

మూడుచోట్ల విలేజ్ సర్వేయర్లకు బాధ్యతలు

తాళ్లూరు, ఆగస్టు 2: తాళ్లూరు మండలాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. పాలనపరంగా కీలంగా ఉండే తహసీల్దార్ కార్యాలయం, రెవెన్యూ శాఖలో ఏడు సచివాలయాలకు వీఆర్‌వోలు లేరు. రెవెన్యూసంబంధిత పనులు సకాలంలో జరుగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 14గ్రామ సచివాలయాలు ఉండగా ఆరు చోట్ల గ్రామరెవెన్యూ అధికారులు(వీఆర్‌వోలు) లేరు. తురకపాలెం, బొద్దికూరపాడు, తాళ్లూరు-2, లక్కవరం, దోసకాయలపాడు, శివరాంపురం సచివాలయాలకు వీరులేరు. తురకపాలెం సచివాలయానికి ఇన్‌చార్జ్‌గా నాగంబొట్లపాలెం వీఆర్‌వో పి.చంద్రశేఖర్‌రావు, బొద్దికూరపాడు సచివాలయానికి ఇన్‌చార్జ్‌గా వెలుగువారిపాలెం వీఆర్‌వో ఎం.రమణారెడ్డి, తాళ్లూరు-2 సచివాలయం ఇన్‌చార్జ్‌గా తాళ్లూరు-1 సచివాలయం వీఆర్‌వో కె.నాగలక్ష్మి వ్యవహరిస్తున్నారు. లక్కవరం సచివాలయం ఇన్‌చార్జ్‌గా ఆగ్రామ విలేజ్ సర్వేయర్ ప్రసన్నకుమార్, దోసకాయలపాడు ఇన్‌చార్జ్‌గా ఆగ్రామవిలేజ్ సర్వేయర్ ఎం.శివ, శివరాంపురం సచివాలయ ఇన్‌చార్జ్‌గా ఆ గ్రామ విలేజ్ సర్వేయర్ కె.చంద్రశేఖర రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఎన్నికల సమయంలో వచ్చిన తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్ సొంత జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆర్ఐ మేరీ రెండేళ్లుగా డిప్యుటేషన్‌పై ఇతరప్రాంతంలో పని చేస్తుండటంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఏడాది క్రితం ఏఎస్‌వో బదిలీపై వెళ్లగా మద్దిపాడు ఏఎస్‌వో విజయలక్ష్మి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ సుధీర్ సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ సంబంధ సమస్యలు అధికంగా ఉన్నందున అన్ని సచివాలయాలకు పూర్తి స్థాయిలో వీఆర్‌వోలు లేక పోవటంతో ప్రజల సమస్యలు పరిష్కారంలోతీవ్రజాప్యం జరుగుతుంది. విలేజ్ సర్వేయర్ ఉన్న గ్రామాల్లో సమస్యల పట్ల వారికి పూర్తి స్థాయి అవగాహన లేక పోవటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉండటంతో రైతాంగ సమస్యలు, విద్యార్థులకు కావాల్సిన సర్టిఫికెట్లు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే ఖాళీగా ఉన్న ఆర్ఐ, ఏఎస్‌వో, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, వీఆర్‌వోల నియామకాలు జరుగుతాయని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు రెండునెలలు కావస్తున్నా సిబ్బంది నియామకాల భర్తీ ఇంకా కాలేదు. ఇప్పటికైనా పాలకులు, జిల్లా అధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను, వీఆర్‌వోను నియమించి ప్రజల ఇబ్బందులు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయం

అద్దంకిలో ఎంవీఐ కార్యాలయం ఏర్పాటు చేయాలి

మంత్రి రవికుమార్‌కు అద్దంకి వాసులు వినతి

అద్దంకి, ఆగస్టు2: అద్దంకిలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ అద్దంకి పట్టణానికి చెందిన పలువురు మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం అద్దంకిలో తాత్కాలికంగా రోజు మార్చి రోజు ఎంవీఐ వచ్చి వెళ్తున్నారని, కొద్దిమేర సేవలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయని తెలిపారు. ఎక్కువ శాతం పనులకు చీరాల వెళ్ళాల్సి వస్తుందని, అద్దంకిలో పూర్తి స్థాయిలో కార్యాలయం ఏర్పాటు ద్వారా అద్దంకి నియోజకవర్గంతో పాటు మార్టూరు ప్రాంత వాహనచోదకులకు కూడా ప్రయోజనంగా ఉంటుందని మంత్రి రవికుమార్‌కు వివరించి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, వెలనాటి శ్రీనివాసరావు, రామకృష్ణ, దూళిపాళ్ల సుబ్బారావు, కరి వేణు, చేబ్రోలు వెంకట సుబ్బయ్య తదితరులు ఉన్నారు.



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అద్దంకి నేతలు

సాగు భూములపై హక్కు కల్పించండి

● జేసీని కోరిన రైతులు

మార్టూరు, ఆగస్టు 2: ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న ఈనాం భూములపై చట్టపరంగా తమకు హక్కు కల్పించాలని జాయింట్ కలెక్టర్ సుబ్బారావును రైతులు కోరారు. శుక్రవారం మార్టూరు తహసీల్దారు కార్యాలయంలో మండలంలో ఉన్న ఈనాం భూములపై వివరాలు సేకరణకు, అదేవిధంగా వాటిని సాగుచేసుకుంటున్న రైతులతో జేసీ సుబ్బారావు, ఆర్డీవో గంధం రవీందర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈనాం భూములకు సంబంధించిన రికార్డులను జేసీ పరిశీలించారు. ఆభూముల వివరాలను తహసీల్దారు ప్రశాంతి అధికారులకు వివరించారు. వాటిలో జంగమహేశ్వరపురం గ్రామానికి సంబంధించి 2,539 ఎకరాల ఈనాం భూములు ఉన్నాయని అధికారులకు తెలిపారు. ఈ పొలాలను రామకూరు, కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి, ధర్మవరం, వలపర్ల గ్రామాలకు చెందిన 912 మంది రైతులు సాగుచేసుకుంటున్నారన్నారు. అదేవిధంగా లక్కవరం గ్రామ పరిధిలో 565 ఎకరాలు ఈనాం భూములు ఉన్నాయన్నారు. వాటిని రామకూరు, బొల్లాపల్లి గ్రామాలకు చెందిన 386 మంది రైతులు సాగు చేసుకుంటున్నారన్నారు. దీనిపై జే సీ సంబంధిత రైతులతో మాట్లాడుతూ భూములకు సంబంధించిన వివరాలను చీఫ్‌సెంట్రల్‌ఆఫ్ లాండ్అడ్మినిస్ట్రేషన్‌కు పంపిస్తానని, రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం తరపున ఈనాం భూములపై విచారణ చేస్తున్నట్లు రైతులకు తెలిపారు.



ఈనాం భూముల వివరాలను తెలుసుకుంటున్న జేసీ సుబ్బారావు, ఆర్డీవో రవీందర్‌లతో తహసీల్దారు

వచ్చే ఏడాది జూన్‌కల్లా
రామాయపట్నం పోర్టును ప్రారంభిస్తాం

ప్రతినెలా పురోగతిపై సమీక్ష ● ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి వెల్లడి ● పోర్టు, ఫిషింగ్‌హార్బర్‌లను మంత్రి ఆనంతో కలిసి పరిశీలన

కందుకూరు, ఆగస్టు 2 : వచ్చే సంవత్సరం జూన్ నెలాఖరుకు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను పూర్తిచేసి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కందుకూరు, కావలి ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కృష్ణారెడ్డిలను వెంటబెట్టుకుని కలెక్టరు ఆనంద్, పోర్టు అధికారులతో కలిసి శుక్రవారం సాయంత్రం రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అనంతరం అధికారులతో జరిగిన సమీక్షలో మంత్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ రామాయపట్నం పోర్టును ఎంతో అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో సీఎం చంద్రబాబు సమీక్షలు చేస్తున్నారని, పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రూ.4929 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ పోర్టులో ఇప్పటివరకు రూ. 1300 కోట్లతో 51 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. ఇకముందు పోర్టు నిర్మాణ ప రోగతిపై నెలనెలా నివేదిక ఇవ్వాలని కలెక్టరుకు సూచించారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రామాయపట్నంను మేజరు పోర్టుగా అభివృద్ధి చేసేందుకు కూడా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. మరో మంత్రి ఆనం మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణం పూర్తయితే జిల్లాలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎంతో మెరుగవుతాయన్నారు. పోర్టు సమీప గ్రామాలలో భూ సమస్యలు, పరిహారం సమస్యల పరిష్కారానికి కృషి చేయటం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా తయారు చేస్తామన్నారు. పోర్టు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన చేవూరు, రావూరు, కర్లపాలెం, సాలిపేట రైతులకు పరిహారంగా ఎకరాకు 25 లక్షలకు (ప్రస్తుతం రూ.16 లక్షలు) పెంచాలని మంత్రులను కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సమావేశంలో మారిటైంబోర్డు కార్యదర్శి సురేష్‌కుమార్, కలెక్టరు ఆనంద్, కందుకూరు సబ్ కలెక్టరు విద్యాధరి, టీడీపీ నేతలు బీద రవిచంద్ర, అబ్దుల్‌అజీజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, అంతకుముందు బోగోలు మండలం జువ్వలదిన్నెలో నిర్మాణంలో ఉన్న ఫిషింగ్‌హార్బర్‌ను మంత్రులు జనార్దన్‌రెడ్డి, ఆనం పరిశీలించారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేసి మత్స్యకారులకు అందజేస్తామని వారు స్పష్టం చేశారు.



రామాయపట్నం పోర్టు మ్యాపును పరిశీలిస్తున్న మంత్రులు జనార్దన్‌రెడ్డి, ఆనం

ఆటో, మోటార్‌సైకిల్ ఢీ

● ఒకరికి గాయాలు



ఆటోలో దూరిన బైకు

మార్కాపురం, ఆగస్టు 2: ముందు వెళ్తున్న ఆటోను క్రాస్ చేయబోయిన మోటార్‌సైకిల్ అదుపు తప్పి ఢీకొంది. ఈ ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పట్టణ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని దరిమడుగు గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి మోటార్‌సైకిల్‌పై మార్కాపురం వస్తున్నాడు. ఈ క్రమంలో గౌతమ్ కాలేజీ సమీపంలోకి వచ్చేసరికి ముందు వెళ్తున్న ఆటోను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో కిందపడిపోయిన రాజశేఖర్‌రెడ్డి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆయనను స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు ఏఎస్ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకులో చోరీకి విఫలయత్నం

త్రిపురాంతకం, ఆగస్టు 2: మేడపిలో యూనియన్ బ్యాంక్‌లో చోరీకి విఫల యత్నం జరిగింది. ఎప్పటిలాగే గురువారం విధులు ముగించుకుని తాళాలు వేసి వెళ్లిన సిబ్బంది శుక్రవారం ఉదయం బ్యాంకు తెరిచేందుకు ప్రయత్నించారు. షట్టర్ తాళాలు పగలగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు బ్యాంకు వద్దకు చేరుకుని పరిశీలించారు. డీఎస్పీ అశోక్‌వర్ధన్, ఎస్సై వి.సాంబశివయ్య సీసీపుటేజీని పరిశీలించారు. అర్ధరాత్రి సమయంలో ఒక మహిళతో కలిసి బ్యాంకు వద్దకు వచ్చిన వ్యక్తి గోడ దూకి షట్టర్ పగులగొట్టిన అనంతరం గేటు వద్దనే కాపలా ఉన్నాడు. మహిళ మాత్రం లోపలికి వెళ్లి అన్నీ పరిశీలించింది. లాకర్ తెరుచుకోక పోవడంతో ఇద్దరూ వెనుదిరిగారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వెలుగులోకి అరుదైన ‘అలుగు’



అలుగు

మార్కాపురం, ఆగస్టు 2: ప్రపంచంలో అంతరించి పోతున్న జాతుల్లో ఒకటైన పంగోలిన్ (అలుగు) శుక్ర వారం మార్కాపురం సమీపంలోని జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో దర్శనమిచ్చింది. కళాశాలలోని విద్యార్థి నుల హాస్టల్ సమీపంలో దీన్ని గుర్తించారు. వెంటనే విద్యార్థినులు కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబుకు తెలిపారు. ఆయన సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని ఫొటోలు తీయించి అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాక దాన్ని ఒక డ్రమ్ములో ఉంచారు. అది పంగోలిన్ అని గుర్తించిన అటవీశాఖ అధికారులు వెంటనే సి బ్బంది నిరంజన్‌ను అక్కడకు పంపారు. దానిని సురక్షితంగా తీసుకుని వెళ్లి నల్లమల అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

భూములు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి

ముండ్లమూరు, ఆగస్టు 2: పసుపుగల్లు పంచాయతీ చింతలపూడి చెరువు కింద ఉన్న భూములు ముంపునకు గురికాకుండా చూడాలని ఉమామహేశ్వరఅగ్రహారం గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం ముండ్లమూరులో ఎంపీడీవో జనార్దన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా చింతలపూడి చెరువు కింద మాగాణి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని వారు పేర్కొన్నారు. గత మూడేళ్లుగా చెరువులో చేపలు వేసి పెంచుతున్నారని, అయితే నీరు పుష్కలంగా పెడుతుండటంతో భూములు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి నిధుల ద్వారా చెరువుకట్ట పటిష్ట పరచటంతో పాటు రైతుల పంటలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

టీడీపీ నేత, కుమారుడిపై దాడి

చీరాలటౌన్, ఆగస్టు 2 : చీరాల పట్టణంలో టీడీపీ నాయకుడు మరియు ఆయన కుమారుడిపై పలువురు దాడిచేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల మండలం వాడరేవుకు చెందిన పిక్కి నారాయణ టీడీపీ నాయకులు. ఈ మధ్యకాలంలోనే పట్టణంలో ఆయన కుమారుడు వెంకటేష్ ఓ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈనేపథ్యంలో సంబంధిత ఓపెనింగ్‌కు సంబంధించి పూల డెకరేషన్ చేయించుకున్నారు. అందుకు నగదు వసూలు చేసేందుకు వచ్చిన ముగ్గురు యువకులు తండ్రీ, కొడుకు పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీంతో వాదన పెరిగింది. వెంటనే యువకులు మరి కొందరిని పిలిపించి మూకుమ్మడిగా దాడిచేశారు. ఘటనలో తండ్రి తలకు రక్త గాయాలు కాగా కుమారుడి శరీరంపై పలు గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు వారిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఇప్పటికే దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నేడు ముప్పవరంలో మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, ఆగస్టు 2 : రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం ముప్పవరంలో పర్యటించనున్నారు. గ్రామంలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మంత్రి అందుబాటులో ఉంటారని కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 2 : మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని డీజీపీ కార్యాలయంలో శుక్రవారం డీజీపీ ద్వారకా తిరుమలరావును ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లా అండ్ ఆర్డర్‌కు సంబంధించి వారి మధ్య కొంత చర్చ జరిగింది. నియోజకవర్గ పరిధిలో పోలీస్ యంత్రాంగం బదిలీలు, నియామకాలపై కూడా చర్చించినట్లు సమాచారం.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

మార్టూరు, ఆగస్టు 2: జాతీయ జెండా రూపకర్త స్వర్గీయ పింగళి వెంకయ్య 148వ జయంతి వేడుకలను శుక్రవారం మార్టూరు లంబాడీతండాలోని ఎంపీపీఎస్ స్కూల్‌లో రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జాతీయగీతం ఆలపించారు. వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, చెన్నుపాటి బసవరాములు, ఉపాధ్యాయులు కె.తిరుమలేశ్వరరావు, కె.యేలిశమ్మ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక..తల్లిదండ్రులకు అప్పగింత

అద్దంకి, ఆగస్టు2: అద్దంకి మున్సిపల్ కార్యాలయం వద్ద తప్పిపోయిన ఉన్న బాలికను మున్సిపల్ అధికారులు పోలీస్‌లకు అప్పగించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు శుక్రవారం మధ్యాహ్నం 3 సంవత్సరాల బాలిక ఒంటరిగా ఉండటాన్ని గమనించిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పూర్ణ మున్సిపల్ కార్యాలయం లోపలకు తీసుకెళ్ళి సాయంత్రం వరకు అక్కడే ఉంచారు. రాత్రికి పట్టణంలోని గుర్రాల కాలనీకి చెందిన తల్లిదండ్రులు రావడంతో పోలీసులు బాలికను అప్పగించారు.

ఆస్తి వివాదంలో వ్యక్తిపై దాడి

చీరాలటౌన్, ఆగస్టు 2 : ఆస్తి వివాదంలో వ్యక్తిపై దాడిచేసిన ఘటన శుక్రవారం ఇంకొల్లు మండలం నాగండ్లలో జరిగింది. గ్రామానికి చెందిన హుస్సేన్‌వలీకి సమీప బంధువు మస్తాన్‌కు మధ్య ఆస్తి వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మస్తాన్, మరికొందరు హుస్సేన్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు గాయాలతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఒంగోలు నగర పరిసర ప్రాంతముల వారికి
బాంబేటెక్స్ వారి శుభవార్త
SHOP NO. 134 & 135, శ్రీ బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, ONGOLE.
Raymond Phant Rs.500/-
BSL Phant Rs.500/-
Cotton Shirt 1.60Cut Rs.300/-
Phant+Shirt Rs.800/-
పై తెలిపిన ఆఫర్లను వినియోగించుకొని ఎప్పటివలె మా వ్యాపారాభివృద్ధికి తోడ్పడగలరు.
BOMBAYTEX
GENTS CLOTH & CUT PIECES SHOW ROOM
SHOP NO. 134 & 135, S.B.M.C. ONGOLE.
PROP:- K.V. SUBBA RAO, CELL:- 9966003542

AJC ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

అమ్మబడును

■ తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు సిటీలో రన్నింగ్ హోటల్స్, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, హాస్టల్స్ & ఫ్లాట్లు, ఖాళీ స్థలాలు, ఇల్లులు అమ్మబడును. సంప్ర॥ 97042 50705.
AJO-20007

అద్దెకు ఇవ్వబడును

■ నివాస గృహములకు, కార్యాలయాలకు 1వ అంతస్తు, కర్నూల్ రోడ్ నుండి 2 ఇల్లు శ్రీనగర్ కాలనీ, 4వ వీధి, ఒంగోలు. సంప్ర॥ సెల్: 94400 45144, 8985447437.
AJO-ONG

WANTED IMMEDIATELY

■ 1) సైటు సూపర్‌వైజర్, 2) సైటు ఇంజనీర్స్ గా మా కన్‌స్ట్రక్షన్ నందు పనిచేయుటకు అనుభవము కలిగిన అభ్యర్థులు వెంటనే కావలెను. విద్యార్హత, 1). ఏదేని డిగ్రీ / ఇంటర్, 2). B.Tech Civil or Diploma Civil, Contact సెల్: 9948260744
AJO-190200

WANTED STAFF

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 20k. Phone : 8977639662 / 8977639663
AJH-4211

WANTED

■ ప్రకాశం జిల్లా, సింగరాయకొండలోని శ్రీ విద్యానికేతన్ హైస్కూల్ నందు ఇంగ్లీష్, హింది, తెలుగు మరియు సోషల్ బోధించుటకు ప్రైమరీ టీచర్స్ కావలెను. అర్హులైనవారు సంప్ర॥ సెల్: 7095767709
AJO-285

WANTED

■ ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్టూరు (మం) బొబ్బేపల్లి (గ్రా)లో ఇంటి వద్ద సహాయకురాలుగా ఉండుటకు చదువుకున్న హిందూ యువతి కావలెను. అర్హతను బట్టి జీతం 10,000 నుండి 12,000 వరకు ఉండును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 72931 99999.
AJG-191780

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.
జన్మదిన శుభాకాంక్షలు
వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు
విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు
లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అదనం.
ఒంగోలు : 99854 11071, 97036 18694, 99854 11483
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358
ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్ర॥ 9985411484

బ్యాంకులో చోరీకి విఫలయత్నం


బ్యాంకును పరిశీలిస్తున్న డీఎస్పీ

త్రిపురాంతకం, ఆగస్టు 2: మండలంలోని మేడపిలో యూనియన్ బ్యాంకులో చోరీకి విఫలయత్నం జరిగింది. ఎప్పటిలాగే గురువారం విధులు ముగించుకుని తాళాలు వేసి వెళ్లిన సిబ్బంది శుక్రవారం ఉదయం బ్యాంకు తెరిచేందుకు ప్రయత్నించారు. షట్టర్ తాళాలు పగలగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు బ్యాంకు వద్దకు చేరుకుని పరిశీలించారు. దర్శి డీఎస్పీ అశోక్‌వర్థన్, త్రిపురాంతకం ఎస్సై వి.సాంబశివయ్య బ్యాంకులో సీసీ ఫుటేజీని పరిశీలించారు. అర్ధరాత్రి సమయంలో ఒక మహిళతో కలిసి బ్యాంకు వద్దకు వచ్చిన వ్యక్తి గోడ దూకి షట్టర్ పగులగొట్టిన అనంతరం గేటు వద్దనే కాపలా ఉన్నాడు. మహిళ మాత్రం లోపలికి వెళ్లి అన్నీ పరిశీలించింది. లాకర్ తెరుచుకోక పోవడంతో ఇద్దరూ వెనుదిరిగారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పుపై నిరసన


నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

కంభం, ఆగస్టు 2 : భారత సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలమైన తీర్పునివ్వడంపై మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కల్వకూరి అబ్రహం శుక్రవారం కందులాపురం సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పునివ్వడంపై ఖండించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని గతంలో చెప్పిన కోర్టులే ఇప్పుడు అనుకూలంగా తీర్పునివ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. కలిసి ఉన్న మాలమాదిగల మధ్య చిచ్చుపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 9న ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. 26వ తేదిన కంభంలో జరిగే ఎస్సీవర్గీకరణ వ్యతిరేక సదస్సులో మాలలందరూ కలిసి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజేంద్రరాజు, శంకర్, శ్రీరామ్‌పెద్దక్క, లక్ష్మయ్య, రాజు, శేషు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు ఉపకరణాల పంపిణీ


ఫ్లోరోసిస్ బాధితులకు ఉపకరణాలు అందజేస్తున్న అధికారులు

మార్కాపురం రూరల్, ఆగస్టు 2: మండలంలోని గజ్జలకొండ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఫ్లోరోసిస్ బాధితులకు శుక్రవారం పరికరాల పంపిణీ చేశారు. జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ కుమార్, స్థానిక నాయకులు నారు వెంకటేశ్వరెడ్డి, శనిగె నాసర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఫ్లోరిసిస్ బాధితుల కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన చేతికర్రలు, మెడకు, నడుముకు కట్టుకునే బెల్టులు అందజేసినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు సాయిచరణ్ తేజ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫ్లోరోసిస్ బాధితులకు ప్రభుత్వం పరికరాలను పంపిణీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో బి.శ్రీకాంత్, సూపర్‌వైజర్లు టి.పెద్దన్న, టి.విమల, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఆటో, మోటార్ సైకిల్ ఢీ

- ఒకరికి గాయాలు


ఆటోను ఢీకొన్న బైకు

మార్కాపురం, ఆగస్టు 2: ముందు వెళ్తున్న ఆటోను క్రాస్ చేయబోయిన మోటార్ సైకిల్ అదుపుతప్పి ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పట్టణ పోలీసుల కథనం మేరకు, మండలంలోని దరిమడుగు గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి మోటార్‌సైకిల్‌పై మార్కాపురం వస్తున్నాడు. ఈ క్రమంలో గౌతమ్ కాలేజీ సమీపంలోకి వచ్చేసరికి ముందు వెళ్తున్న ఆటోను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో కిందపడిపోయిన రాజశేఖర్‌రెడ్డి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి ఆయన స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పట్టణ ఏఎస్ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలయ్యకు నివాళి


నివాళి అర్పిస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 2 : నగర పంచాయతీ పరిధిలోని పాములపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బండ తిరుమలయ్య (59) అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. టీడీపీ సీనియర్ నాయకుడు కృష్ణకిశోర్‌రెడ్డి శుక్రవారం పాముపల్లె గ్రామానికి వెళ్లి తిరుమలయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, దప్పిలి కాశిరెడ్డి, పాముల వెంకటరమణయాదవ్, శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణాలపై సబ్‌కలెక్టర్ దాడులు


దుకాణాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఎర్రగొండపాలెం (పుల్లల చెరువు), ఆగస్టు 2: ఎర్రగొండపాలెం పట్టణంలోని రేషన్‌షాపులపై మార్కాపురం సబ్‌కలెక్టరు రాహుల్‌మీనా అర్ధ రాత్రి దాడులు నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. రేషన్ బియ్యం గోదాముల్లో నుంచి సక్రమంగా దుకాణాలకు చేరిందా..? లేదా..? అని తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో బాగంగానే వచ్చామని ఆయన తెలిపారు. అయితే కొంతమంది డీలర్లు దుకాణాల తాళాలు తీసేందుకు రాకపోవడంతో తాళాలు పగలగొట్టి మరి తనిఖీ చేశారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, గోడౌన్ డీటీ తిరుపతిరెడ్డి ఉన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

- 44వేల నగదు స్వాధీనం

పొదిలి, ఆగస్టు 2 : మండలంలోని ఉప్పలపాడు గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు. పేకాట, కోడిపందేలు ఆడుతున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. ఉప్పలపాడు సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను రూ.44వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. మీ ప్రాంతాల్లో ఎక్కడైనా కోడిపందాలు, పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంటవానిపల్లె అభివృద్ధి కుంటు

గ్రామంలో అధ్వానంగా పారిశుధ్యం


శిథిలావస్థకు చేరుకున్న చప్టా

పెద్దదోర్నాల, ఆగస్టు 2: మండలంలోని గంటవానిపల్లె గ్రామంలో దశాబ్దాలుగా అభివృద్ధి గుంటు పడుతోంది. ఈ గ్రామంలో సుమారు 600 కుటుంబాలు నివసిస్తున్నాయి. అధిక శాతం ఎస్టీ(సుగాలీలు) నివసిస్తున్నారు. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారికి 5 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. గ్రామానికి వెళ్లేందుకు సరైన రహదారి కూడా లేదు. తీగలేరువాగు దాటి వెళ్లాల్సి ఉంది. ఆ వాగుపై దశాబ్దాల క్రితం నిర్మించిన చిన్నపాటి చప్టా శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో వరద లొస్తే గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. గ్రామంలో టీడీపీ హయాంలో కొంతమేర


ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

సిమెంటు రోడ్లు నిర్మించారు. అయితే సైడ్ కాలువల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో ఇళ్లలోని వాడుకనీరు, చిన్న జల్లులకు నీరంతా సిమెంటు రోడ్డుపై నిలువ ఉంటోంది. దీంతో బురద తయారై నడిచేందుకు వీలు లేక జారి పడుతున్నారు. ఈగలు, దోమలు వృద్ధి చెంది దుర్వాసనతో నివాసితులు ఉండలేని దుస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. వీధి దీపాలు కూడా కనిపించవు. ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి గ్రామాభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కలగానే వంతెన నిర్మాణం

గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణం దివంగత సీఎం వైఎస్ఆర్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి గ్రామస్థులకు కలగానే మిగిలింది. బ్రిడ్జి నిర్మాణానికి కోటి రూపాయలు నిధులు మంజూరు చేస్తానని 2007లో వెలిగొండ ప్రాజెక్టు పనుల ప్రారంభోత్సవ బహిరంగసభలో నాటి సీఎం వైఎస్ఆర్ హామీ ఇచ్చారు. అనంతరం పలువురు సీఎంలు, ప్రజాప్రతినిధులు మారినా ఆ హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు. ప్రజల కోరిక నెరవేరలేదు.

తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు



అధికారులతో సమీక్షిస్తున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, ఆగస్టు 2 : వైపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాలల్లో శాశ్వతంగా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని వై.పాలెం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అధికారులకు సూచించారు. శుక్రవారం మార్కాపురంలోని తన కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు, విద్య, ఉపాధిహామీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో జలజీవన్ ద్వారా చేసిన పనులను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. నియోజవర్గం లోని తాగునీటి పథకాల ద్వారా ప్రజల దాహార్తిని తీర్చేలా నీరివ్వాలన్నారు. ఉపాధి హామీ పథకంలో లోటుపాట్లు లేకుండా రైతులకు మొక్కలపెంపకం సక్రమంగా అమలు చేయాలన్నారు. ఉపాధి నిధుల ద్వారా గ్రామాల్లోని లింకురోడ్లకు మరమ్మతులు చేయించు కోవాలన్నారు. వెలుగు ద్వారా మహిళలకు రుణాలు ఇచ్చి వారు అభివృద్ధి చెందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్ధన్‌అలీ, వెలుగు ఏసీ లక్ష్మారెడ్డి, డ్వామా ఏపీడీ నిర్మలాదేవి, పీఆర్ డీఈ మద్దు ల సుబ్బారెడ్డి, ఐదు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాదిగల చిరకాల స్వప్నం నెరవేరింది

ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు ఫ్రాంక్లిన్ మాదిగ


కేకు కట్ చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

గిద్దలూరు, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండే కావున వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకే ఉంటుందని సుప్రీం కోర్టు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చిందని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు పులిగుజ్జు ఫ్రాంక్లిన్‌మాదిగ అన్నారు. స్థానిక ఎంఆర్‌పీఎస్ నాయకులతో కలిసి గిద్దలూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. 30 ఏళ్ల పోరాట ఫలితంగా ఎన్నో అడ్డంకులను అధిగమించి, ఎంతోమంది మాదిగ అమరవీరుల త్యాగాల ఫలితంగా న్యాయమైన డిమాండ్ సాధించుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో కృషి చేసిన మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, నాయకులు గుర్రం బాబూరావు, కె.దేవ ప్రభాకర్, బొప్పూరి ప్రసాద్, కొమ్మునూరి వెంకటేష్, బాలు మాదిగ, పండిటి రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగులోకి అరుదైన జీవి పంగోలిన్(అలుగు)



అటవీశాఖ అధికారులకు అప్పగిస్తున్న కళాశాల సిబ్బంది, పంగోలియన్ (ఇన్‌సెట్)

మార్కాపురం, ఆగస్టు 2: ప్రపంచంలో అంతరించిపోతున్న జాతుల్లో ఒకటైన పంగోలిన్ (అలుగు) శుక్రవారం మార్కాపురం సమీపంలోని జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో దర్శనమిచ్చింది. కళాశాలలోని విద్యార్థినుల హాస్టల్ సమీపంలో దీన్ని గుర్తించారు. వెంటనే విద్యార్థినులు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబుకు తెలిపారు. ఆయన సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని ఫొటోలు తీయించి అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాక దాన్ని ఒక డ్రమ్ములో ఉంచారు. అది పంగోలిన్ అని గుర్తించిన అటవీశాఖ అధికారులు వెంటనే సిబ్బంది నిరంజన్‌ను అక్కడకు పంపారు. దానిని సురక్షితంగా తీసుకుని వెళ్లి నల్లమల అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలి

- ఎంఈవోకు బీజేపీ నాయకుల వినతి


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 2 : ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు మౌలిక వసతులను కల్పించేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారులకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. శుక్రవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాశి వెంకట రామాంజనేయులు, పట్టణ అధ్యక్షులు అబిశెట్టి ఉదయ్‌శంకర్, తదితర నాయకులు మండల విద్యాశాఖాధికారులు కావడి వెంకటేశ్వర్లు, జింకా వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో మౌలిక వసతులు ఆటస్థలాలు లేవని, ఫీజుల పట్టిక, స్టేషనరీ అమ్మకం లాంటివి నియంత్రణలో లేవని, అన్నారు. ఫీజుల వసూలుపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రూరల్, మండల అధ్యక్షులు కె.తిరుపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు మారుతీప్రసాద్, బండారు ప్రసాద్, ఎం.వి.రమణ, వీరచక్రం, ఎం.రామక్రిష్ణ, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు),ఆగస్టు 2: ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలుజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ కోరారు. శుక్రవారం ఎర్రగొండపాలెం పట్టణ కార్యాలయంలో సీపీఐ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి అయిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి తాగు, సాగు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రకాశం జిల్లాను వెనకబడిన జిల్లాల జాబితాలో చేర్చడం ఆనందనీయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, డి.శ్రీనివాస్ సీపీఐ మండల కార్యదర్శులు బాణాల రామయ్య, విశ్వరూపచారి, తిరుమలయ్య, తిరుపతయ్య, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

రైతు ఆర్థికాభివృద్ధిపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 2 : రైతు ఆర్థికాభివృద్ధికి ఆపరేషన్ గ్రీన్స్ పథకం అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్రవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరగా పాడైపోయే 22 పంటలకు రైతుల ఆర్థిక స్తోమతను పెంచేందుకు, ఉత్పత్తుల నష్టాలను తగ్గించేందుకు కేంద్రం ఈ పథకం ద్వారా ఎటువంటి చర్యలు తీసుకుందన్నారు. దీనిపై కేంద్ర ఆహార తయారీ పరిశ్రమలశాఖ సహాయక మంత్రి రావ్‌నీత్‌సింగ్ సమాధానం ఇస్తూ టమెటా, ఉల్లి, ఉర్లగడ్డ తదితర 22 రకాల పంటలు త్వరగా పాడై పోయే పంటలకు రైతులకు నష్టాలు తగ్గిం చేందుకు పీఎం కిసాన్ సంపద యోజన కార్యక్రమం ద్వారా ఆపరేషన్ గ్రీన్స్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో 77,140 మంది రైతులకు లాభం చేకూరిందన్నారు స్వల్పకాలిక భాగం కింద రూ.119కోట్ల సబ్సిడీ మంజూరు చేయగా, దేశంలో 31,364 మంది రైతులు తమ ఉత్పత్తుల నిల్వ, రవాణాకు లాభపడతారని కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

117 జీవోను రద్దు చేయాలి

ఒంగోలు(విద్య), ఆగస్టు 2: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రభుత్వం వెంటనే జీవోనెంబరు 117 రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ.కీర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి బివెంకట్రావు, బి.అశోక్‌కుమార్, గౌరవాధ్యక్షుడు ఎ.అమ్మయ్య, ఐపీయా కౌన్సిలర్ పీవీ.సుబ్బారావు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. హైస్కూళ్లలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలను కొనసాగించాలన్నారు.

అమ్మకానికి అన్నదాన సత్రం

- దాతల సహకారంలో 1995లో ఏర్పాటు
- అదేం లేదంటున్న నిర్వాహకులు


ఆలయ సమీపంలోని ఆనంద నిలయం అన్నదాన సత్రం

త్రిపురాంతకం, ఆగస్టు 2: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయ సమీపంలో దాతల సహకారంతో 1995లో ఏర్పాటు చేసిన ఆనంద నిలయం బ్రాహ్మణ అన్నదాన సత్రాన్ని దాని నిర్వాహకులు అక్రమంగా అమ్ముకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆలయాలకు వచ్చే భక్తుల కోసం వసతి, భోజనం ఇతర సౌకర్యాలను అందించే ఉద్దేశంతో అనేక సామాజిక వర్గాలకు చెందిన దాతలు సహకారంతో సత్రాన్ని నిర్మించారు. ఆలయాల సమీపంలోని ప్రభుత్వ భూమిలో సర్వే నెంబరు 703లో 1995లో నిర్మించారు. 2001లో ఆ సత్రం నిర్వహణ కోసం రిజిస్టర్ కమిటీని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆలయాలకు వచ్చే భక్తులకు శుక్రవారం రోజున, దసరా నవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నారు. అనంతరం మరికొన్ని అన్నదాన సత్రాలను ఎటువంటి అనుమతులూ లేకుండానే ఏర్పాటు చేశారు. వాటన్నింటిని క్రయ విక్రయాలు చేసేందుకు, రిజిస్ట్రేషన్ చేసేందుకు ఎటువంటి అవకాశం లేదు. కాగా కరివెన నిత్యాన్నదాన సత్రం ఆధ్వర్యంలో నిర్వహించుకునేందుకు సుమారు కోటి రూపాయలకు పైగా ఒప్పందంతో ఇటీవల విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సత్రం ఏర్పాటు సమయం నుంచి అనేక రకాలుగా సహకరించిన దాతలు ఆందోళనలో ఉన్నారు. కాగా దీనిపై సత్రంలో ప్రస్తుత నిర్వహణా బాధ్యతలు చూస్తున్న ఏఎల్ఎన్‌వీ సుబ్బారావును వివరణ కోరగా అలాంటిదేమీ లేదని అన్నారు. సత్రం నిర్వహణ భారంగా ఉన్నందున కొన్ని షరతులతో శ్రీశైలానికి చెందిన కరివెన నిత్యాన్నదాన సత్రం ఆధ్వర్యంలో ఆనంద నిలయం సత్రాన్ని నిత్యాన్నదానసత్రంగా నిర్వహించేందుకు మాత్రమే ఒప్పందం జరిగిందన్నారు.

అవీ..ఇవీ..

కందిపైరును పరిశీలించిన ఏడీఏ


కందిపైరును పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీ నాయక్

పొదిలి, ఆగస్టు 2 : మండలంలో సాగు చేసిన సజ్జ, కంది పైరులను దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కందిలో వైరస్ తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు 50 రోజుల వ్యవధిలో సల్ఫర్ పిచికారి చేయాలన్నారు. దాని వలన ఒకమొక్క నుండి మరోమొక్కకు వైరస్ సోకకుండా అదుపు చేయవచ్చన్నారు. ఎండుతెగులు కూడా వస్తుందని అందుకు విత్తనశుద్ధి ముఖ్యమన్నారు. వేపనూనె కషాయం వినియోగించడం వలన గూడుపురుగు ఉధృతిని అదుపు చేయవచ్చన్నారు. వ్యవసాయాధికారి షేక్ జైన్‌లుబ్దీన్ మాట్లా డుతూ పంటసాగు చేసిన ప్రతి రైతు, కౌలురైతులు ఈ-పంట ద్వారా తప్పకుండా పంట నమోదు చేసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు మాత్రమే తగిన మోతాదులో సమయాన్ని బట్టి పురుగు మందులు, ఎరువులు వినియోగించాలన్నారు. సాగులో ఖర్చులు తగ్గించుకోవాలని ఆయన సూచించారు. అలా పాటించడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

పత్తిలో తెగుళ్ల నివారణపై అవగాహన

మార్కాపురం రూరల్, ఆగస్టు 2: పత్తిపైరు సాగులో తెగుళ్లపై రైతులకు ఏడీఏ బాలాజీనాయక్ పైర్లను శుక్రవారం పరిశీలించి అవగాహన కల్పించారు. మండలంలోని జమ్మనపల్లి, కోలభీమునిపాడు గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న పత్తిపైరును పరిశీలించి వారికి సలహాలు సూచనలు ఇచ్చారు. పత్తి పైరులో పచ్చదోమ, పేనుబంక ఉన్నట్లు గుర్తించారు. దీనికి నివారణగా ఏసీపేట్ 300 గ్రాములు లేదా ఏసీ టామీప్రిడ్ 80 గ్రాములు 200 లీటర్లలో కలిపి పది రోజులకు మందులను మార్చి పిచికారి చేయాలని సూచించారు. పత్తిపంట చుట్టూ జొన్న లేదా మొక్కజొన్న పంటలను రెండు మూడు వరసలు నాటికి రసం పీల్చే పురుగులు ఆశించకుండా నివారించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో దీవిరెడ్డి శ్రీనివాసులు, కోలభీమునిపాడు, వేములకోట వ్యవసాయ సిబ్బంది సంధ్య, మల్లికార్జున్, రైతులు పాల్గొన్నారు.

4న ఎమ్మెల్యేకు ఆత్మీయ అభినందనసభ

కంభం, ఆగస్టు 2 : గిద్దలూరు ఎమ్మెల్యేగా ముత్తుముల అశోక్‌రెడ్డి గెలిచిన సందర్భంగా అర్ధవీడు, బేస్తవారపేట, కంభం మండలాల ఉద్యోగ, ఉపాధ్యాయులతో ఈ నెల 4న ఆదివారం ఉదయం 10గంటలకు బృందావన్ ఫంక్షన్ హాలులో ఆత్మీయ అభినందనసభ నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు మండలాల ఉపాధ్యాయులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తర్లుపాడు, ఆగస్టు 2: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం అని సీడీపీవో పి.సుశీలాదేవి అన్నారు. తర్లుపాడులోని నాయుడుపల్లె, ముదిరాజు కాలనీలు, శివాలయం వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యతను వివరిస్తూ, అంగన్‌వాడీ కార్యకర్తలు తర్లుపాడులో ర్యాలీ నిర్వహించారు. పుట్టినబిడ్డకు గంటలోపు ముర్రు పాలు తాగించటం ఎంతో ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి, సీహెచ్‌వో తులసీప్రసాద్, ఏఎన్ఎం రాధ, నాగేశ్వరమ్మ, తర్లుపాడులోని 4 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరి అలంకారంలో జగదాంబ


శాకాంబరి అలంకారంలో జగదాంబ

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 2: మార్కాపురం పట్టణంలోని శ్రీజగదాంబ సమేత మర్కాండేశ్వరస్వామి ఆలయంలో వెలసిన శ్రీజగదాంబ మాతను శుక్రవారం శాకాంబరీగా అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆర్.వరుణ్‌తేజశర్మ అమ్మవారి మూలవిరాట్‌ను వివిధ కూరగాయాలు, ఆకుకూరలు, పండ్లతో, పూలతో అలంకరించారు. ఆషాఢ బహుళ త్రయోదశి మాస శివరాత్రి పురష్కరించుకుని శాకాంబరి అలంకారంలోని జగదాంబను దర్శించుకుని భక్తులు పూజలు నిర్వహించారు. ఈ ఆషాఢ మాసంలో అమ్మవారికి శాకంబరీ పూజ చేసుకోవడం ద్వారా పాడిపంటలు సమృద్ధిగా ఉండి సకాలంలో వర్షాలు పడి సస్యశ్యామలంగా ఉంటుందని అర్చకులు తెలిపారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఘనంగా పింగళివెంకయ్య జయంతి

పొదిలి, ఆగస్టు 2 : జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతిని చైతన్య కళాస్రవంతిలో శుక్ర వారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ఆధ్యాత్మిక, సంగీత సాహిత్య సంస్కృతి సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పింగళి వెంకయ్య చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని సూచించారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అధ్వానంగా రోడ్లు


అర్బన్‌కాలనీలో జలమయమైన రోడ్డు

గిద్దలూరు, ఆగస్టు 2 : పట్టణంలోని అర్బన్‌కాలనీలోని పలు వీధుల్లోని రోడ్లు చినుకుపడితే చిత్తడవుతున్నాయి. మురికినీటి కాలువలు, సిమెంటురోడ్లు చాలా వీధులకు లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా వర్షం నీరంతా మట్టిరోడ్డు మధ్యలో నిలిచిపోతోంది. దీంతో బురదమయంగా మారి నడిచేందుకు వీలులేని పరిస్థితి నెలకొంటోంది. మోటార్ సైకిళ్లపై, సైకిళ్లపై కూడా వెళ్లలేని దుస్థితిలో ఉన్నామని కాలనీవాసులు వాపోతున్నారు. రాత్రిపూట అయితే బయటి నుంచి వచ్చి ఇళ్లలోకి వెళ్లాలంటే బురదనీటిలో జారిపడి ఇబ్బందులు పడుతున్నామన్నారు. సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించాలని, అప్పటివరకు వర్షంనీరు రోడ్లపై నిలబడకుండా దూరంగా పంపేందుకు కచ్చా కాలువలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

దాడి కేసు నమోదు

మార్కాపురం, ఆగస్టు 2: ఆస్తివివాదం నేపథ్యంలో ఓ మహిళపై దాడిచేసిన వ్యక్తిపై పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు స్థానిక సాయిబాలాజీ థియేటర్ రోడ్డులో నివాసముండే రామిశెట్టి శివ అనే వ్యక్తికి వారి బంధువులతో ఆస్థి తగాదాలు ఉన్నాయి. గతంలో కూడా కొన్ని ఘర్షణలు జరిగాయి. దీంతో శివపై పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసులు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సమీప బంధువైన రామిశెట్టి మహేశ్వరి అనే మహిళను శివ దూషించి దాడి చేశాడు. ఈ మేరకు మహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పట్టణ ఏఎస్ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

దొనకొండ, ఆగస్టు 2: విద్యార్థులు కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్ ప్రభావతిదేవి అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కలలను విద్యాభ్యాసం ద్వారా సాకారం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేరుస్తూ మంచి పేరుతెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు, ఉపాధ్యాయులు, ఆరోగ్యకేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి స్థల పరిశీలన



దేవస్థాన కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న డీఈ జనార్దన్

పామూరు, ఆగస్టు 2: స్థానిక మదన వేణుగోపాలస్వామి దేవాలయ ప్రాంగణంలో టీటీడీ మంజూరుచేసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, కల్యాణ మండపం, గోశాలకు శుక్రవారం గుంటూరు జోన్ డిప్యూటీ ఇంజనీర్ ఈ.జనార్దన్‌రావు స్థలపరిశీలన చేశారు. ఈసందర్భంగా దేవస్థాన ఈవో జి.నరసింహబాబు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గోశాల, ప్రహరీగోడ ప్లాస్టింగ్, శ్రీవారి ఆలయం, కల్యాణ మండపం నిర్మించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని ఈవో నరసింహబాబు తెలిపారు. సమావేశంలో దేవస్థాన కమిటీ చైర్మన్, గుర్రం వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ కావిటి సుబ్బయ్య, పసుపులేటి రఘురాం, బండ్ల సురేష్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న గుంత పూడ్చివేత

పామూరు, ఆగస్టు 2: పట్టణ పరిధిలోని తూర్పు బైపాస్ జాతీయ రహదారి ఆనుకొని సుమారు పది అడుగులమేర తీసిఉన్న గుంతను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో శుక్రవారం పూడ్పించారు. గుంత తీశారు - వదిలేశారు, పొంచిఉన్న పెను ప్రమాదం శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీవో పుల్లారెడ్డి గుంతను వెంటనే పూడ్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో గుతంను పూడ్చివేశారు.

పర్యావరణం పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ముండ్లమూరు, ఆగస్టు 2: వృక్ష సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని టీడీపీ జిల్లా లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు. ముండ్లమూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం విద్యార్థినులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సునీత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం

తాళ్లూరు, ఆగస్టు 2: తాళ్లూరు పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎస్సై కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రమదానం చేసి శుభ్రపరిచారు. ఇటీవల స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ దామోదర్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను అపరిశుభ్రంగా లేకుండా చూడాలని, పోలీస్ స్టేషన్‌ను ఆహ్లాదకరంగా ఉండేలా ఎస్సైను ఆదేశించారు. దీంతో ఎస్సై సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు, ఆగస్టు 2: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. వర్షాలు కురుస్తూ నీరు నిల్వ ఉంటున్నందున గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో పారిశుధ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మురుగు కాలువలో పూడికతీత పనులు చేయించాలన్నారు. వాటర్‌ట్యాంక్‌లను శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ కేజేఎస్ రాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దేవవరపు శ్రీనివాసరావుకు డాక్టరేట్ ప్రదానం



శ్రీనివాసరావు

ముండ్లమూరు, ఆగస్టు 2: మండలంలోని వేముల గ్రామానికి చెందిన దేవవరపు శ్రీనివాసరావు డాక్టరేట్ పొందారు. తమిళనాడులోని అన్నామలై విశ్వవిద్యాలయం శుక్రవారం ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. డాక్టర్ ఎం.అనుహెచ్ నాయర్ పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో వివిధ అభ్యసన నమూనాలను ఉపయోగించి న్యూమెనియా వర్గీకరణ కోసం ఆటోమేటెడ్ సిస్టమ్‌ను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం శ్రీనివాసరావు హైదరాబాద్‌లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. డాక్టరేట్ అందుకున్న శ్రీనివాసరావును మండలంలోని వేముల గ్రామస్థులు, స్నేహితులు, బంధువులు అభినందించారు.

భూములు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి



ఎంపీడీవో జనార్దన్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ముండ్లమూరు, ఆగస్టు 2: మండలంలోని పసుపుగల్లు పంచాయతీ పరిధిలోని చింతలపూడి చెరువు కింద ఉన్న భూములు ముంపునకు గురికాకుండా చూడాలని ఉమామహేశ్వర అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం ఎంపీడీవో ఆర్.జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా చింతలపూడి చెరువు కింద మాగాణి భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని ఈసందర్భంగా వారు పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా చెరువులో చేపలు వేసి పెంచుతున్నారని చెప్పారు. నీరు పుష్కలంగా పెడు తుండటంతో భూములు ముంపునకు గురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో పొదిలి ఖాశింబీ, చిన ఖాశీం, వలి, హసన్‌వలి, ఆలమూరి హుస్సేన్, నసీమా, కాలేషా, పెద కాలేషా, చిన కాలేషా, అమరా కోటేశ్వరరావు, వెంకన్న, ఎస్కే సుల్తాన్ బాబు, తదితరులు ఉన్నారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా చెరువుకట్ట పటిష్ఠ పరచటంతో పాటు రైతుల పంటలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

ఎన్నెస్పీ కాలనీలో చోరీ

కురిచేడు, ఆగస్టు 2: కురిచేడు పాత ఎన్నెస్పీ కాలనీలోని ఓ గృహంలో శుక్రవారం మధ్యాహ్నం దొంగతనం జరిగింది. కురిచేడు ప్రధాన కూడలిలో ఫ్యాన్లు, మిక్సీలు మరమ్మతులు చేసే రాంబాబు పాత ఎన్నెస్పీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మధ్యాహ్న సమయంలో ఇద్దరు యువకులు వారి ఇంటి వద్దకు వచ్చి ఒకరు బయట కాపలా ఉండి మరొకరు ఇంటి వెనుకవైపు గోడదూకి తలుపులు పగుల కొట్టి ఇంట్లోకి వెళ్లాడు. బీరువా తలుపులు తీసి అందులో నుంచి రూ.5 వేలు తీసుకుని గోడదూకి బయటకు వచ్చాడు. ఆ సమయంలో రాంబాబు భార్య గమనించి ఇంటి వైపు వెళ్లగా పారిపోయారు. ఇరుగుపొరుగు వారు వెంబడించినా వారు చిక్కలేదు. రాంబాబు కురిచేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పరిశీలించి వెళ్లారు.

ఇప్పటికీ రెండుసార్లు అదే ఇంట్లో దొంగతనం జరిగింది. నాలుగు నెలల క్రితం రాంబాబు ఇంట్లో పట్టపగలు ఇంట్లో ఎవరూలేని సమయంలో వెనుక తలుపులు పగులకొట్టి ఇంట్లోకి వచ్చి బీరువా పగులకొట్టి రూ.60 వేలు చోరీ చేశారు. మరోసారి అలాగే జరిగింది. వీటిపై రాంబాబు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. ఇదే అదనుగా తీసుకున్న దొంగలు మూడోసారి అదే ఇంటికి దొంగతనానికి వచ్చారు. శుక్రవారం జరిగిన దొంగతనంలో పాల్గొన్న రెండవ వ్యక్తి రాంబాబు భార్య పక్కనే కూర్చొన్నాడు. ఆమె దొంగను గుర్తుపడుతుందని పోలీసులు గ్రామంలోని ఎన్నెస్పీ కాలనీ దారిలోని సీసీ ఫుటేజి పరిశీలిస్తున్నారు. దొంగతనంలో పాల్గొన్న ఇద్దరు కూడా 18 సంవత్సరాల లోపు వారే అని రాంబాబు భార్య చెప్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

- వేలాడుతున్న కరెంట్ తీగలు
- పొంచి ఉన్న ప్రమాదాలు
- పట్టనట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు



విరిగిన స్తంభానికి అతుకువేసి విద్యుత్ సరఫరా



విద్యుత్ స్తంభానికి సాలిగూడులా ఏర్పాటుచేసిన కరెంట్ తీగలు

దర్శి, ఆగస్టు 2: దర్శి నగర పంచాయతీలో అనేకచోట్ల విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పలుచోట్ల విరిగిన విద్యుత్‌స్తంభాలు, కాలంచెల్లిన స్తంభాల ద్వారానే ఎంతో కాలంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అనేక ప్రాంతాల్లో విద్యుత్ తీగలు గృహాల మధ్యలో కిందకు వ్రేలాడుతున్నాయి. అవసరాలకు సరిపడ స్తంభాలు వేయకపోవటంతో ఒక్కో స్తంభానికి సాలిగూడులా విద్యుత్ తీగలు ఏర్పాటుచేయటంతో ప్రమాదకరంగా మారింది. విద్యుత్ అభివృద్ధి పనుల గురించి అధికారులు పట్టించుకోవటం లేదు. కొత్త మెటీరియల్ అందు బాటులో ఉన్నప్పటికీ నూతన స్తంభాలు, తీగలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేని వెంచర్లకు యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు ఏర్పాటుచేస్తున్న అధికారులు ప్రజల ఇబ్బందుల గురించి పట్టించుకోవటం లేదు.

దర్శి పట్టణంలోని లంకోజనపల్లిలోని ఒక వీధిలో బ్రిటీష్‌కాలంలో వేసిన కాలం చెల్లిపోయిన ఇనుప స్తంభాలు అలాగే ఉన్నాయి. కొన్నిచోట్ల ఆ స్తంభాలు విరిగిపోవటంతో అతుకులు వేసి కరెంట్ సరఫరా చేస్తున్నారు. పాత స్తంభాలు ఎత్తు లేకపో వటంతో ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. గృహాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పటిష్ఠమైన కరెంట్ లైను ఏర్పాటు చేయకపోవటంతో తీగలు క్రిందకు వేలాడుతున్నాయి. విద్యుత్ కనెక్షన్లు అధి కంగా ఉండటంతో కొన్ని స్తంభాలకు విద్యు త్ తీగలు సాలిగూడులా అధికసంఖ్యలో ఏర్పాటుచేశారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ అభివృద్ధి పనుల గురించి పట్టించుకున్న నాథుడు లేడు. అధికారులు ఆదాయ వనరులు ఉన్న పనులు మాత్రమే చేస్తూ ప్రజలకు అవసరమైన పనులను పట్టించుకోలేదు. ఇటీవల కాలంలో మరమ్మతులకు, అభివృద్ధి పనులకు మెటీరియల్ అందుబాటులోకి వచ్చినప్పటికీ అవసరమైన చోట స్తంభాలు, తీగలు వేయటం లేదు. ఎక్కడో సుదూర ప్రాంతాల్లో ఉన్న అక్రమ వెంచర్లకు అడ్డగోలుగా విద్యుత్ లైన్లు ఏర్పాటుచేస్తున్నారు.

దర్శి పట్టణంలో కాలంచెల్లిన విద్యుత్ స్తంభాలు, తీగలు ద్వారా కరెంట్ సరఫరా చేస్తుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా గతంలో పనిచేసిన అధికారులే కొనసాగుతుండటంతో వారితీరు మారలేదు. ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అనేక శాఖల్లో మార్పు కనిపించకపోవటంతో ప్రజలు వీలైనంత త్వరగా పాత అధికారులను సాగనంపాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా కొత్త స్తంభాలు

సమర్థవంతమైన కొత్త అధికారులను రప్పించి అభివృద్ధి పథంలో పనులు సాగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

దర్శి అభివృద్ధికి సహకరించాలి

దర్శి, ఆగస్టు 2: దర్శి నియోజకవర్గ అభివృద్ధికి పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులు, ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. గురువారం రాత్రి ఢిల్లీలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి గృహంలో ఏర్పాటుచేసిన విందు కార్యక్రమంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, తదితర నాయకులను కలిశారు. ఈసందర్భంగా ప్రకాశం జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా చేర్చే విధంగా కృషిచేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పార్లమెంట్ సభ్యులకు అభినందనలు తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రప్రభుత్వ సహకారం అందుకోవటంలో పార్లమెంట్ సభ్యులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దొనకొండలో చేపట్టిన పారిశ్రామిక కారిడార్ వేగవంతంగా అభివృద్ధి జరిగేందుకు సమష్టిగా కృషి చేస్తామని ఈసందర్భంగా ఎంపీలు పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ పాలనలో మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారిన సాగర్ కాలువల అభివృద్ధి పనులకు, తాగునీటి పథకాల అభివృద్ధి పనులకు అధిక నిధులు విడుదల అయ్యేందుకు కృషి చేస్తామని చెప్పారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్నట్టు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చెప్పారు. కూటమి ప్రభుత్వంలో మంత్రులు ఇతర ప్రజాప్రతినిధులు అన్నిరకాలుగా సహకారం అందిస్తున్నారని ఆమె వివరించారు.

జూదరుల అరెస్టు

తాళ్లూరు, ఆగస్టు 2: మండలంలోని లక్కవరం గ్రామ సమీప పొలాల్లో పేకాడుతుండగా శుక్రవారం ఎస్సై కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దా డిచేశారు. ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని పది సెల్‌ఫోన్లు, రూ.74,640 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని దర్శి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

శిథిలావస్థలో అతిథి గృహాలు

- మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు

పామూరు, ఆగస్టు 2: ప్రభుత్వాలు లక్షలాది రూపాయాల ప్రజాధనంతో వెచ్చించి భవనాలు నిర్మిస్తుంటే, మరోవైపున నిర్మించి ఉన్న భవనాలు మాత్రం ఉపయోగంలో లేకుండా నిరుపయోగంగా పడిఉన్నాయి. పామూరు, సీఎస్‌పురం మండలాల్లో పంచాయతీరాజ్ అతిథి గృహాలను నిర్మించి వదిలి వేయడంతో ప్రజాధనం వృథా అవుతుంది. సీఎస్‌పురం మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగంలో నిర్మించిన పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని 2001లో అప్పటి ఎంపీ కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతినాయుడు ప్రారంభించారు. అప్పటినుంచి కొన్ని సంవత్సరాల పాటు అతిథి గృహం వాడుకలో ఉంది. గత 15 సంవత్సరాలుగా అధికారులు అతిథి గురించి పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. అతిథి గృహంలో వేలాది రూపాయలతో సమకూర్చిన విలువైన ఫర్నిచర్ నిరుపయోగంగా ఉన్నాయి. అతిథి గృహం పరిసరాలు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దాంతో ఈప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది.



పిచ్చి మొక్కల మధ్య నిరుపయోగంగా పీఆర్ అతిథి గృహం



కూలేందుకు సిద్ధంగా ఉన్న పామూరు పీఆర్ గృహం

అలాగే, పామూరులోని కనిగిరి రోడ్డులో ఉన్న పీఆర్ అతిథి గృహం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. పంచాయతీరాజ్‌కు చెందిన ఈ భవనాన్ని నిర్మించిన పాతికేళ్లకే మరమ్మతులకు గురైంది. దాంతో పంచాయతీరాజ్ అధికారులు విధులు నిర్వహించేందుకు వీలులేక పాత హాస్పిటల్‌లోని ఓ గదిలో చేరారు. 2002 వరకు ఎంపీడీవో కార్యాలయంగా వినియోగించుకొన్న అధికారులు సీఎస్‌పురం రోడ్డులో ఎంపీడీవో కార్యాలయానికి సొంత భవనం నిర్మించడంతో నూతన కార్యాలయంలోకి మారారు. వానకాలంలో గోడలు చెమ్మదిగి దెబ్బతిన్నాయి. దాంతో శ్లాబు పెచ్చులూడి పడుతూ కూలేందుకు సిద్ధంగా ఉంది. దాంతో పంచాయతీరాజ్ ఉద్యోగులు ప్రాణ భయంతో కార్యాలయాన్ని ఖాళీ చేసి పాత హాస్పిటల్‌లోని గదిలోకి మారారు.

నాటి జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు అతిథి గృహాన్ని పరిశీలించి పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేయాలని ఆదేశించినా కార్యరూపం దాల్చలేదు. గత వైసీపీ ప్రభుత్వం అతిథి గృహాల మరమ్మతులకు నిధులు కేటాయించ కుండా నిర్లక్ష్యం చేసింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అతిథి గృహాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోని తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

'చంద్రబాబుకు రుణపడి ఉంటాం'

కనిగిరి, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణలో ప్రముఖ పాత్ర వహించి మాదిగలకు న్యాయం చేసిన సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటామని ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు, టీడీపీ నేత తాతపూడి ఐజాక్ అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ (ఎండ్లూరి సాల్మన్‌రాజు) రోడ్డులో ఉన్న టీడీపీ కార్యాలయం వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో తాతపూడి బ్రా క్, ఎస్థాని బాషా(పులి), కరాటపు సుందరరావు, బడేబాయి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సంబరాలు

కురిచేడు, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం పట్ల కురిచేడు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మార్పీఎస్ నాయకుడు మం దా క్రిష్ణమాదిగ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో మొఘల్ మస్తాన్ వలి, గొటిపాటి రామయ్య, గంధం గురునాథం, మస్తాన్, ఇజ్రాయేలు, బయ్యారం ఏలియా, కె.మోషే, జి.యోగేశ్వరరావు, సామ్యేలు, దాను, జోసెఫ్, సురేష్, ప్రసాద్, దానియేలు, సాయన్న, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, **Porumamilla Branch**. I issue the following notice. My client company intends to grant a loan to **Sri Jakka Ramana** S/o **Chinna Cehnnaiah**, Thimmapuram Village, Giddalur Mandal, Prakasan District Intended to borrow loan and create equitable mortgage schedule property in favour of my client for the loan to be borrowed by him. As such if anyone has any claims, charges, mortgages, Sale Agreements, Court attachments, Court disputes etc., should be informed by him to me within Five days from the date of this Public Notice. Otherwise later objections will not bind my Client in this regard. **B-SCHEDULE**:- Prakasam Dt, Markapur Sub-Registrar, Giddalur Mandal, Thimmapuram village lands limits area, Sy.No. 120/3, vacant site to the extent of 169.4 Sq. yards or 141.61 Sq. Meters, Bounded by ; East – Site of Jakka Ramana and others, South - Cement Road, West - Site of Jakka Srinivasulu (A-Schedule Property) and North - Cement Road i.e., Admeasuring that **East to West** : 26 feet 3.5 inches, **North to South** : 58 feet in total 169.4 Sq. yards or 141.61 Sq. meters

BODDU PRAKASH, M.Sc., M.Ed., LL.B. ADVOCATE, Giddalur, 9393456730

AJ ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

అమ్మబడును

■ తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు సిటీలో రన్నింగ్ హోటల్స్, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, హాస్టల్స్ & ఫ్లాట్లు, ఖాళీ స్థలాలు, ఇల్లులు అమ్మబడును. సంప్ర॥ 97042 50705.
AJO-20007

అద్దెకు ఇవ్వబడును

■ నివాస గృహములకు, కార్యాలయాలకు 1వ అంతస్తు, కర్నూల్ రోడ్ నుండి 2 ఇల్లు శ్రీనగర్ కాలనీ, 4వ వీధి, ఒంగోలు. సంప్ర॥ సెల్: 94400 45144, 8985447437.
AJO-ONG

WANTED IMMEDIATELY

■ 1) సైటు సూపర్‌వైజర్, 2) సైటు ఇంజనీర్స్ గా మా కన్‌స్ట్రక్షన్ నందు పనిచేయుటకు అనుభవము కలిగిన అభ్యర్థులు వెంటనే కావలెను. విద్యార్హత, 1). ఏదేని డిగ్రీ / ఇంటర్, 2). B.Tech Civil or Diploma Civil, Contact సెల్: 9948260744
AJO-190200

WANTED STAFF

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 20k. Phone : 8977639662 / 8977639663
AJH-4211

WANTED

■ ప్రకాశం జిల్లా, సింగరాయకొండలోని శ్రీ విద్యానికేతన్ హైస్కూల్ నందు ఇంగ్లీష్, హిందీ, తెలుగు మరియు సోషల్ బోధించుటకు ప్రైమరీ టీచర్స్ కావలెను. అర్హులైనవారు సంప్ర॥ సెల్: 7095767709
AJO-285

WANTED

■ ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్టూరు (మం) బొప్పేపల్లి (గ్రా)లో ఇంటి వద్ద సహాయకురాలుగా ఉండుటకు చదువుకున్న హిందూ యువతి కావలెను. అర్హతను బట్టి జీతం 10,000 నుండి 12,000 వరకు ఉండును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 72931 99999.
AJG-191780

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

తల్లి పాలు బిడ్డకు అమృతం

పామూరు, ఆగస్టు 2: తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన ప్రపంచ తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లి పాలు కీలకమన్నారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం అందజేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.పుల్లారెడ్డి, సీడీపీవో పి.సరోజిని, సూపర్‌వైజర్ జి.పద్మజ, ప్రభుత్వ డాక్టర్లు గద్దె హేమసుధ, రవళి, రుబీనా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి, హెల్త్‌సూపర్‌వైజర్ ఎన్.బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.



పామూరు: తలి పాల వారోత్సవాల ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ లక్ష్మి

దొనకొండలో తల్లిపాల వారోత్సవాలు

దొనకొండ, ఆగస్టు 2: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠకరమని, పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించటం కీలకమని స్థానిక ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సునీత పేర్కొన్నారు. శుక్రవారం దొనకొండలోని బేతేల్‌పురం, వీవీపురం-1, వీవీపురం-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు వెంటనే పట్టించటం ద్వారా ఆ బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఈనెల 7 వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం డబ్బాపాలు వద్దు - తల్లిపాలు ముద్దు అనే నినాదంతో దొనకొండలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కె.ప్రభావతిదేవి, అలెగ్జాండర్, సీహెచ్‌వో ఇన్నాసమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, కార్యకర్తలు జయమణి, నసీమా సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

'తాళ్లూరు'కు సిబ్బంది కావలెను!

- ఆర్ఐ, ఏఎస్‌వో, వీఆర్‌వోలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఆరు గ్రామసచివాలయాలకు రెగ్యులర్ అధికారి లేరు
- మూడుచోట్ల విలేజ్ సర్వేయర్లకు బాధ్యతలు



తాళ్లూరు తహసీల్దార్ కార్యాలయం

తాళ్లూరు, ఆగస్టు 2: తాళ్లూరు మండలాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. పాలనపరంగా కీలంగా ఉండే తహసీల్దార్ కార్యాలయం, రెవెన్యూ శాఖలో ఏడు సచివాలయాలకు వీఆర్‌వోలు లేరు. రెవెన్యూసంబంధిత పనులు సకాలంలో జరుగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 14 గ్రామ సచివాలయాలు ఉండగా ఆరుచోట్ల గ్రామరెవెన్యూ అధికారులు(వీఆర్‌వోలు)లేరు. తురకపాలెం, బొద్దికూరపాడు, తాళ్లూరు-2, లక్కవరం, దోసకాయలపాడు, శివరాంపురం సచివాలయాలకు వీరులేరు. తురకపాలెం సచివాలయానికి ఇన్‌చార్జ్‌గా నాగంబొట్లపాలెం వీఆర్‌వో పి.చంద్రశేఖర్‌రావు, బొద్దికూరపాడు సచివాలయానికి ఇన్‌చార్జ్‌గా వెలుగువారిపాలెం వీఆర్‌వో ఎం.రమణారెడ్డి, తాళ్లూరు-2 సచివాలయం ఇన్‌చార్జ్‌గా తాళ్లూరు-1 సచివాలయం వీఆర్‌వో కె.నాగలక్ష్మి వ్యవహరిస్తున్నారు. లక్కవరం సచివాలయం ఇన్‌చార్జ్‌గా అగ్రామ విలేజ్ సర్వేయర్ ప్రసన్నకుమార్, దోసకాయలపాడు ఇన్‌చార్జ్‌గా అగ్రామవిలేజ్ సర్వేయర్ ఎం.శివ, శివరాంపురం సచివాలయ ఇన్‌చార్జ్‌గా ఆ గ్రామ విలేజ్ సర్వేయర్ కె.చంద్రశేఖరరెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.


తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఎన్నికల సమయంలో వచ్చిన తహశీల్దార్ మహమ్మద్ హుస్సేన్ సొంత జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆర్ఐ మేరీ రెండేళ్లుగా డిప్యూటేషన్‌పై ఇతరప్రాంతంలో పనిచేస్తుండటంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఏడాదిక్రితం ఏఎస్‌వో బదిలీపై వెళ్లగా మద్దిపాడు ఏఎస్‌వో విజయలక్ష్మి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ సుధీర్ సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ సంబంధ సమస్యలు అధికంగా ఉన్నందున అన్ని సచివాలయాలకు పూర్తి స్థాయిలో వీఆర్‌వోలు లేక పోవటంతో ప్రజల సమస్యలు పరిష్కారంలో తీవ్రజాప్యం జరుగుతుంది.విలేజ్ సర్వేయర్ ఉన్న గ్రామాల్లో సమస్యల పట్ల వారికి పూర్తి స్థాయి అవగాహన లేక పోవటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు

తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉండటంతో రైతాంగ సమస్యలు, విద్యార్థులకు కావాల్సిన సర్టిఫికెట్లు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే ఖాళీగా ఉన్న ఆర్ఐ, ఏఎస్‌వో, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, వీఆర్‌వోల నియామకాలు జరుగుతాయని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు రెండునెలలు కావస్తున్నా సిబ్బంది నియామకాల భర్తీ ఇంకా కాలేదు. ఇప్పటికైనా పాలకులు, జిల్లా అధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను, వీఆర్‌వోను నియమించి ప్రజల ఇబ్బందులు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.
జన్మదిన శుభాకాంక్షలు
వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు
విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు
లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి.
ప్రతి ప్రకటనపై GST 5% అదనం.
ఒంగోలు : 99854 11071 97036 18694 99854 11483
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358
ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్ర॥ 9985411484



- రాజధానికి మకుటాయమానంగా తీర్చిదిద్దుతా
- నాణ్యమైన విద్యా బోధన, పరిశోధనలకు పెద్దపీట
- నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు



పని చేసినా పస్తులే



- కష్టాల్లో ఉపాధి కూలీలు
- 74 రోజులుగా అందని వేతనాలు
- ఒక్కో ఉపాధి కూలికి రూ.20,128 బకాయి
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.98.77 కోట్ల పెండింగ్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వలసలు నివారించి.. ఉన్న ప్రాంతంలోనే పనులు చూపి కూలీల ఆర్థిక కష్టాలు తీర్చేందుకు రూపొందించి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం.. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అభాసుపాలవుతోంది. కూలీలకు దిన సరి వేతనాలు ఇవ్వకుండా.. జాబ్‌కార్డులు ఉన్న వారందరికీ పనులు కల్పించకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారు. కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు.. అయితే వారికి వారం వారం కాదు కదా నెలకు కూడా కూలి చెల్లించడం లేదు. దీంతో పనులు చేసిన వారు కూలి ఎప్పుడు జమవుతుందో తెలియక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక జాబ్ కార్డులు ఉన్న వారు ఉపాధి పని ఎప్పుడు వస్తుందో తెలియక ఇతర పనులకు వెళ్లలేక అల్లాడిపోతున్నారు. ఉపాధి పనులు చేసినా కూలీలకు 74 రోజులుగా వేతనం అందలేదు. పనులకు హాజరైన ఒక్కో కూలీకి సుమారు రూ.20,128 వేతనం చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దాదాపు రూ.98.77 కోట్లు ఉంది. రోజురోజుకు బకాయిలు పేరుకుపోతున్నాయే కానీ చెల్లింపులపై అధికారుల నుంచి సమాధానం లేదు. 74 రోజులుగా ఉపాధి కూలీలకు వేతనాలు పెండింగ్‌లో ఎందుకు ఉన్నాయో సమాధానం చెప్పే వారే లేకుండా పోయారు. కూలీలు మాత్రం కూలి నగదు ఎప్పుడు జమ చేస్తారో తెలియక నిత్యం పాస్ పుస్తకాలు చేతపట్టుకుని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఎప్పుడు చూసినా ఖాతాలు ఖాళీగా ఉండటంతో కూలీలు నిరాశకు లోనవుతున్నారు.

బిల్లుల నమోదుతో సరి..

ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బంది ఉపాధి కూలీల వేతన బిల్లులను మండల కార్యాలయానికి పంపిస్తారు. వాటిని అక్కడి సిబ్బంది అంతర్జాలంలో నమోదు చేస్తారు. ఇలా నమోదు చేసిన రెండు రోజులకు కూలీలకు చెందిన ఖాతాల్లో వారు చేసిన పనులకు సంబంధించిన నగదు జమ చేస్తుంటారు. అయితే బిల్లుల నమోదు వరకు సక్రమంగా జరుగుతున్నా ఆ తర్వాత నగదు జమ ప్రక్రియ మాత్రం జరగడం లేదు. రెండు నెలలకు పైగా వేతనాలు రావడంలేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మే 20 నుంచి ఇప్పటివరకు పనులు చేసిన కూలీలకు ఉపాధి సొమ్ములు చెల్లించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చేసిన పనికి రెండు రోజుల్లో కూలి సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమచేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని కూలీలు మండిపడుతున్నారు. కష్టపడి చేసిన పని కూలి సకాలంలో రాక పోతుండ టంతో వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రతి వ్యక్తికి 100 రోజుల పనిదినాలను కల్పించడంలో యంత్రాంగం విఫలమ వుతున్నది. చేసిన పనికి వెంటనే కూలి రాకపోతుండటంతో ఈ పనులపై కార్మికులు ఆసక్తి చూపడంలేదు. దీంతో ఉపాధి పథకం లక్ష్యాలు నెరవేరడంలేదు.

సగటు వేతనం.. పనులు అంతంతే..

కేంద్ర ప్రభుత్వం కార్మికుడికి సగటు వేతనం రూ.272గా నిర్ణయించింది. అయితే ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు సగటు వేతనం లభించడంలేదు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా తమకు సగటు వేతనం అమలు చేయాలని కూలీలు కోరుతున్నారు. వ్యక్తిగత పని దినాలు కల్పించడంలో యంత్రాంగం కొంత అలసత్వం వ్యవహరిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 5.56 లక్షల జాబ్ కార్డులు రిజిస్ట్రేషన్ చేశారు. గుంటూరు జిల్లాలో 2.05 లక్షల, బాపట్ల జిల్లాలో 4.56 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. నమోదు చేసుకున్నవారందరూ పనులకు హాజరు కావడంలేదు. పల్నాడులో 4.38 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. బాపట్లలో 3.65 లక్షల, గుంటూరులో 1.48 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. వీరు మాత్రమే ఉపాధి పనులకు హాజరౌతున్నారు. పేరు నమోదు చేసుకుని పనులకు హాజరు కాని కార్మికుల సంఖ్య లక్షల్లో ఉండటం గమనార్హం. వీరికి కూడా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడంలేదు. ఉపాధి పనుల్లో కార్మికుల పని దినాలను ముందుగానే అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పని దినాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి. పనులకు సంబంధించిన సామగ్రి బిల్లుల బకాయి కూడా రూ.కోట్లలో పేరుకుపోయినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం మార్చిలో విడుదల చేసిన సామగ్రి బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించుకోవడంతో బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి.

సెంట్రల్ వర్సిటీ స్థాయికి.. ఏఎన్‌యూ

పెదకాకాని, ఆగస్టు 2: నాణ్యమైన బోధన.. అత్యుత్తమ పరిశోధనలు.. సకల సౌకర్యాలతో విద్యా కేంద్రంగా వర్సిటీని తీర్చిదిద్ది సెంట్రల్ యూనివర్సిటీ హోదా తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తా. ఆంధ్ర రాజధాని అమరావతికి సమీపంలో ఉన్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని రాజధానికే మకుటాయమానంగా తీర్చిదిద్దుతా.. అని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆచార్య కంచర్ల గంగాధరరావు తెలిపారు. ఇండియా టు డే సర్వేలో వర్సిటీకి దేశవ్యాప్తంగా 12వ ర్యాంకు వచ్చిన సందర్భంగా శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వర్సిటీలో త్వరలో ఇంకుబేసిన్(శిక్షణ కేంద్రాలు) సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. నాణ్యమైన బోధన అందిస్తూ, పరిశోధనలకు పెద్ద పీట వేయనున్నట్లు తెలిపారు. ఏఎన్‌యూకి కేంద్రీయ విశ్వవిద్యాలయం హోదా వస్తే ప్రస్తుతం ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. వర్సిటీలో కేంద్రీయ కృషి విద్యాలయ స్థాయి సౌకర్యాలు ఉన్నాయి, వీటిని వినియోగించుకుని ఆ హోదా తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర విభజన తర్వాత అనంతపురం, వైజాగ్, తిరుపతి, విజయనగరం జిల్లాలలో కేంద్రీయ విశ్వవిద్యాలయాలను కేంద్రం నెలకొల్పిందన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం ఒక రాష్ట్రానికి ఎన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఉండాలన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రయత్నాలు చేస్తామన్నారు.

ప్రక్షాళన.. చర్యలు

వర్సిటీలో గత ప్రభుత్వ హయాంలో తప్పు చేసిన ఉద్యోగులపై నిబంధనల మేరకే చర్యలు ఉంటాయి. గతంలో కొందరు ఉద్యోగులు అప్పటి పార్టీ అండ చూసుకుని చేసిన పనులు, నిర్ణయాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. వర్సిటీలో అన్ని శాఖల్లో పరిశీలన చేస్తున్నాం. ఆయా శాఖల్లో జరిగిన లోటుపాట్లను పరిశీలించి త్వరలో ప్రక్షాళన మొదలు పెడతాం. బాధ్యతలు చేపట్టిన పది రోజుల నుంచి వర్సిటీలో ఖాళీగా ఉన్న పరిపాలనాపరమైన పదవులను సామాజిక వర్గాల వారీగా భర్తీ చేశాం. నూతన సంస్కరణలతో వర్సిటీ కీర్తిని మరో మెట్టు పైకి తీసుకెళ్తాం.

నూతన కోర్సులు.. స్కిల్ డెవలప్‌మెంట్

విశ్వవిద్యాలయంలో సైన్స్ అండ్ టెక్నాలజీలో నూతన కోర్సులను ప్రవేశపెడుతున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి కోర్సులు ప్రస్తుతం ఉన్నాయి. వాటికి అనుబంధంగానే నూతన కోర్సులను ప్రవేశ పెట్టేందుకు చర్యలు జరుపుతున్నాం. ఆయా కోర్సులకు సంబంధించి నిష్ణాతులతో ప్రత్యేక శిక్షణాకేంద్రాలను నెలకొల్పే యోచనలో ఉన్నాం. వర్సిటీలో సాధారణ కోర్సులు అభ్యసించే విద్యార్థుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ ఎలా అభివృద్ధి చేయాలో కూడా ఆలోచన చేస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడం, అధునాతన పరిశోధనలకు, ఉపాధికల్పనే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాం. వర్సి టీలో చదువుకుంటు న్న విద్యార్థులు ఉద్యోగాలతో బయటకు వెళ్లే లాగా ప్రణాళిక లు రూపొంది స్తున్నాం.



ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రాంగణంలో నిపుణుల బృందం

ఇప్పటికైతే భేష్

- ఐదేళ్లైనా పటిష్ఠంగానే నిర్మాణాలు
- పూర్తిగా పరిశీలించి నివేదిక రూపొందిస్తాం
- అమరావతి భవన నిర్మాణాల నాణ్యతపై సంతృప్తి
- రాజధానిలో ఐఐటీ హైదరాబాద్ నిపుణుల బృందం పర్యటన

తుళ్లూరు, ఆగస్టు 2: అమరావతిలో గత టీడీపీ ప్రభుత్వం నిర్మాణం చేపట్టగా, వైసీపీ పాడుబెట్టిన భవనాలు.. ఇప్పటికైతే బాగున్నాయి. ఐదేళ్లు అయినా నిర్మాణాలు పటిష్ఠంగానే ఉన్నాయి.. అని హైదరాబాద్ ఐఐటీ నిపుణులు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతిపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ ఆదేశాలతో తొలుత సీఆర్‌డీఏ జంగిల్ క్లియరెన్స్ చేసింది. ఆ తర్వాత గత టీడీపీ హయాంలో నిర్మాణాలు చేపట్టి వైసీపీ తీరుతో నిలిచి పోయిన పనులపై దృష్టి పెట్టింది. ఐదేళ్లుగా వైసీపీ పాడుబెట్టిన నిర్మాణాల నాణ్యత, పనులపై చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దృష్టిపెట్టారు. నిర్మాణాల నాణ్యతను పరిశీలించి నివేదిక ఇవ్వాలని హైదరాబాద్ ఐఐటీ నిపుణులను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలో ఆ బృందం శుక్రవారం రాజధానిలో పర్యటించింది. ఐఐటీ హైదరాబాద్‌లోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కేబీఎల్ సుబ్రహ్మణం, విభాగాధిపతి మున్వర్‌బాషాల నేతృత్వంలో ఆరుగురు సభ్యులు సీఆర్డీఏ అధికారులతో భేటీ అయి చర్చించారు. తొలుత ఈ బృందం రాయపూడి రెవెన్యూ పరిధిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్, ఐపీఎస్‌ల కోసం గత టీడీపీ ప్రభుత్వం నిర్మించిన భవన సముదాయాలను పరిశీలించింది. మధ్యాహ్నం తర్వాత గ్రూప్ 1, 2, క్లాస్-4, ఉద్యోగుల ఇళ్ల టవర్లను జడ్జీలు, మంత్రుల భవనాలను పరిశీలించింది. అనంతరం ప్రొఫెసర్ కేబీఎల్ సుబ్రహ్మణ్యం విలేకర్లతో మాట్లాడుతూ అమరావతిలో ప్రభుత్వం నిర్మించిన భవన నిర్మాణాల స్థితిగతులను అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. భవనాల పరిస్థితి ఎలా ఉంది, సామర్థ్యం, వాటిని ఎప్పటికి అందుబాటులోకి తీసుకురాగలుగుతామనే అంశాలపై సీఆర్డీఏతో కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరింత విస్తృతస్థాయిలో పరిశోధించి సీఆర్‌డీఏకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ప్రస్తుతం భవనాల పరిస్థితి బాగానే ఉందనిపించినా అప్పుడే ఒక అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేమన్నారు. భవన నిర్మాణాలకు వేసిన రంగులు, ప్లాస్టరింగ్ నాణ్యతను పరిశీలించిన అధికారులు ఐదేళ్ల తర్వాత కూడా అవి చెక్కు చెదరక పోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నిర్మాణాల విషయంలో గత టీడీపీ ప్రభుత్వం నాణ్యతా ప్రమాణాలను పక్కాగా పాటించడం వల్లే ఇప్పటికీ భవనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు.

మంత్రుల క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న ఐఐటీ నిపుణుల బృందం






నాగార్జున సాగర్ జలాశయం

సాగర్‌కు ఉధృతంగా వరద

- 3.99 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- జలాశయంలో 552 అడుగులకు చేరిన మట్టం
- పులిచింతలకు 27,586 క్యూసెక్కులు నీరు విడుదల
- 16 నెలల తర్వాత టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి

నరసరావుపేట (ఆంధ్రజ్యోతి), మాచర్ల రూరల్, రెంటచింతల, ఆగస్టు 2: బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను.. బంగారు పంటలే పండేను... ఈ చిత్రం నాగార్జున సాగర్ కుడి కాల్వ ఆయకట్టులో త్వరలో ఆవిష్కృతం కానున్నది. ఎగువనుంచి వస్తోన్న ప్రవాహంతో సాగర్ జలాశయంలో నీటి నిల్వలు గణనీయంగా పెరుగుతున్నాయి. 3.99 లక్షల క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి 5.35లక్షల కూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శనివారం సాగర్‌కు మరింతగా వరద పెరుగుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. కృష్ణమ్మ ఉప్పొంగుతుండటంతో కుడికాల్వ ఆయకట్టు రైతుల్లో సంతోషం వెల్లివిరుస్తున్నది. కుడి కాల్వకు నీటి సరఫరాను కొనసాగిస్తుండటంతో రైతులు వరి నారుమళ్లు పోస్తున్నారు. సాగర్ జలాశయంలో నీటి మట్టం 590 అడుగులకు 552 అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయి నిల్వ 312.05 టీఎంసీలు కాగా శుక్రవారానికి 215.10 టీఎంసీలకు చేరింది. ఇంకా 96.95 టీఎంసీల నీటి నిల్వ చేరితే జలాశయం పూర్తిగా నిండుతుంది. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1650, కుడి కాల్వ ద్వారా 5944, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 23,565 మొత్తం ఔట్‌ఫ్లోగా 31,159 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సత్రశాలలో నదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో గురువారం రాత్రి నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభించినట్లు ఎస్ఈ వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. 2023 మార్చి 31 తర్వాత విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ఇదే ప్రథమమని తెలిపారు. విద్యుదుత్పత్తి అనంతరం 23,475 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వస్తుందన్నారు. దీంతో రిజర్వాయర్‌లో 75.30 మీటర్లు అంటే 7.011 టీఎంసీల నీరుందన్నారు. డ్యాంకు సంబంధించి 4 క్రస్ట్‌గేట్లలో 2 గేట్లు 1 మీటర్, 2 గేట్లు 1.25 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 19,298 క్యూసెక్కులు, విద్యుత్ తయారీ అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8288 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు.రెండు టర్బయిన్ల ద్వారా మంగళవారం సాయంత్రం వరకు 0.9 ఎంయు(మిలియన్ యూనిట్)ల విద్యుత్ తయారైందన్నారు. టెయిల్ పాండ్ ప్రాజెక్టులో 16 నెలల అనంతరం విద్యుత్‌ను తయారు చేయడంపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎస్ఈ వెంకటరమణతో ఫోన్లో మాట్లాడారు. కిందటేడు వర్షాలు లేక రిజర్వాయర్లు వెలవెలపోయాయని ఈ సారి అందుకు భిన్నంగా పరిస్థితి ఉందని ఆనందం వ్యక్తం చేశారు.



నిండుకుండలా టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్

ఇన్‌చార్జి మంత్రులెవరో?

- ఆగస్టు 15న సమీపిస్తున్నా పూర్తి కాని నియామకాలు
- స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ జెండా ఎగరేసేదెవరో?



గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం తేదీ సమీపిస్తున్నా ఇంకా జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రుల నియామకం పూర్తికాలేదు. దీంతో జిల్లా స్థాయిలో జరిగే వేడుకల్లో జాతీయ జెండాని ఎవరు ఎగుర వేసి స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్నిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ ఆలోపు ఇన్‌చార్జి మంత్రుల నియామకం పూర్తికాకుంటే ఎవరితో త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయిస్తారనేది అర్థం కాకుండా ఉన్నది. గుంటూరు జిల్లాలో ఇద్దరు మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్ ఉన్నారు. బాపట్లలో గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లాకు ఒక్క మంత్రి కూడా లేరు. ఈ క్రమంలో గుంటూరు, బాపట్ల జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రుల నియామకం జరగని పక్షంలో సీనియర్ మంత్రుల్లో ఒకరికి అవకాశం కల్పిస్తారు. అయితే పల్నాడు జిల్లా నుంచి మంత్రి ఎవరూ లేని దృష్ట్యా ఆ జిల్లాలో ఎవరు జెండా ఎగుర వేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే ప్రతీ జిల్లాకు ఒక ఇన్‌చార్జి మంత్రిని నియమించడం ఆనవాయితీగా వస్తున్నది. ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ప్రతీ మూడు నెలలకు ఒకసారి జిల్లా సమీక్షా మండలి సమావేశాన్ని నిర్వహించి వివిధ అంశాలపై చర్చించి తీర్మానాలు ఆమోదిస్తారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చివరిసారిగా డీఆర్‌సీ మీటింగ్ గత ఏడాది డిసెంబరు 1న జరిగింది. ఆ తర్వాత ఎన్నికల వాతావరణం వచ్చేసింది. మార్చిలో ఎన్నికల కోడ్ రావడంతో డీఆర్‌సీ నిర్వహించే అవకాశం లేకుండా పోయింది. ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం పడిపోయి టీడీపీ అధికారంలోకి వచ్చింది. అయితే ఇప్పటివరకు ఇన్‌చార్జి మంత్రుల నియామకాన్ని చేపట్టలేదు. జిల్లాలో రైతులు, పేదలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటిపై చర్చించి తీర్మానాలను ఆమోదించి ప్రభుత్వానికి పంపాలి. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ఆ ప్రక్రియని పూర్తి చేయాలని ప్రతీ ఒక్కరూ కోరుకొంటున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఇచ్చే సందేశంపైనా సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అమరావతి రాజధానిని స్వాతంత్ర్య దినోత్సవ సందేశాల్లో లేకుండా చేసింది. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దృష్ట్యా ఈ దఫా ఖచ్చితంగా అమరావతి ప్రస్తావన ఉండే అవకాశం ఉంది. కేంద్రం ఇప్పటికే రూ.15 వేల కోట్ల సాయాన్ని రాజధాని నిర్మాణానికి ప్రకటించింది. ఆ విషయాన్ని సందేశంలో చేర్చే అవకాశం ఉన్నది. అలానే సూపర్ సిక్స్ హామీల అమలుకు కార్యాచరణని కూడా ప్రకటించొచ్చు. ఒకవేళ ఇన్‌చార్జి మంత్రుల నియామకం పూర్తికాకపోతే సీనియర్ మంత్రుల్లో ఒకరికి జెండా ఎగుర వేసే అవకాశం లభిస్తుంది. ఆ ప్రకారం చూసుకుంటే గుంటూరు జిల్లాలో సీనియర్ మంత్రి నారా లోకేశ్ అవుతారు. ఇందుకు కారణం గత టీడీపీ ప్రభుత్వంలోనే ఆయన మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ దృష్ట్యా లోకేశ్‌కే జెండా ఎగురవేసే అవకాశం లభిస్తుంది. ఇంకా 12 రోజుల సమయం ఉన్న నేపథ్యంలో ఇన్‌చార్జి మంత్రుల నియామకాన్ని ప్రభుత్వం చేపట్టే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు.

పరీక్షా కేంద్రాల్లో వర్సిటీ కోఆర్డినేటర్ తనిఖీ

పెదకాకాని, ఆగస్టు 2: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 1 నుంచి ప్రారంభమైన డిగ్రీ 5, 6 సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాలను కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్వీ కృష్ణారావు శుక్రవారం తనిఖీ చేశారు. మంగళగిరిలోని వి.టి.జే.ఎం అండ్ ఐ.వి.టి.ఆర్ డిగ్రీ కళాశాలలోని కేంద్రాన్ని సందర్శించి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

APS RTC
టెండరు ప్రకటన
... apsrtc.ap.gov.in లో tenders ... APSRTC ...
నెం.P1/122(02)/2024-DPTO(BPTL), తేది: 01-08-2024

సీఎస్‌పురం తహసీల్దార్‌పై వేటు

అక్రమ మ్యుటేషన్ చేయడంతో సస్పెన్షన్

ముసునూరు వీఆర్వో కూడా..

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్)/సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 2: అక్రమానికి పాల్పడ్డ చంద్రశేఖరపురం తహసీల్దార్ ఎస్‌కే.నాగూల్‌మీరా, ముసునూరు గ్రామ రెవెన్యూ అధికారి డి.శ్రీనివాసులపై వేటు పడింది. వారిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. రైతుకు చెందిన భూమిని మరొకరికి అక్రమంగా మ్యుటేషన్ చేసినట్లు నిరూపణ కావడంతో కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గత నెల 2న సీఎస్‌పురం మండలంలో పర్యటించారు. ఈ సం దర్భంగా రెడ్డిగారి కొత్తపల్లి గ్రామానికి చెందిన చావా చంద్రశేఖర్ మండలంలోని ముసునూరు గ్రామంలో సర్వే నెంబర్ 219లో గల తమ భూములను తహసీల్దార్, సిబ్బంది అక్రమంగా మ్యుటేషన్ చేశారని వినతిపత్రం అందజేశారు. దీనిపై కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారిని విచారణ జ రిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జేసీ ఆదేశాల మేరకు ఆర్డీవో జాన్‌ఇర్విన్ విచారించి నివేదిక ఇచ్చారు. తహసీల్దార్ షేక్ నాగూల్‌మీరా, ముసునూరు రెవెన్యూ గ్రామంలోని సర్వేనెంబర్ 219లో ఉన్న 1.48 ఎకరాల భూమిని ఖాతా నెంబర్ 233 నుంచి తొలగించి నిబంధనలకు విరుద్ధంగా కాకు నాగేశ్వరరావుకు ఖాతా నెంబర్ 236, 90024కు అక్రమంగా మ్యుటేషన్ చేశారని నివేదికలో పేర్కొన్నారు. ఇందులో గ్రామ వీఆర్వో దాసరి శ్రీనివాసులు పాత్ర ఉందని కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఆర్డీవో నివేదిక ఆధారంగా తహసీల్దార్ నాగూల్‌మీరా, వీఆర్వో శ్రీనివాసులును కలెక్టర్ శుక్రవారం సస్పెండ్ చేస్తు ఆదేశాలు జారీ చేశారు.

రోగులకు పండ్లు పంపిణీ



అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సుబ్బారావు, తదితరులు

అద్దంకిటౌన్, ఆగస్టు 2:గత మూడు దశాబ్దాల పోరాటానికి, ఎదురు చూపులకు శుభ ముగింపు పలుకుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు వెల్లడించిన నేపథ్యంలో శుక్రవారం టీడీపీ ఎస్సీ సెల్ అద్దంకి నియోజక వర్గ అధ్యక్షుడు వలపర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు, బాలింతలకు, గర్భిణులు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యమ నాయకులు మందా కృష్ణమాదిగకు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌కి, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్‌రాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ లక్ష్మి శృతికీర్తి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మందా ఆమోసు, ప్రధాన కార్యదర్శి కొలకలూరి సురేష్, అద్దంకి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసుమర్తి పెద్ద సామ్యూల్, పూనూరి సామ్యూల్, పట్టణ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మున్నంగి లక్ష్మణకవి, పూనూరి నరేంద్ర, నెహెమ్యా, పురుషోత్తం, సాల్మన్, ఏసుదాసు, రవికుమార్, నాగేంద్రబాబు, సుబ్బారావు, కావూరి నాగమ్మ, మున్నంగి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు, మాదక ద్రవ్యాలపై యువతను చైతన్య పరచాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 2: పొగాకు, మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలను యువతకు తెలియజేసి వారిని చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు అన్నారు. శుక్రవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, ర్యాగింగ్ నిరోధక విభాగం, కళాశాల ఇన్‌క్లూసివ్ సెంటర్ల సంయుక్త ఆధ్వర్యంలో యువతకు పొగాకు, మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ధేనువకొండ ఎస్టీ కాలనీలో వైద్య శిబిరం

అద్దంకిటౌన్, ఆగస్టు 2: మండలంలోని ధేనువకొండలో ఎస్టీ కాలనీలో శనివారం ఉదయం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో జీవీ సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని ఆ యా ట్రైబల్ కాలనీలోని స్త్రీలు సద్వినియోగపర్చుకోవాలని ఆ యన కోరారు.

వచ్చే ఏడాది జూన్‌కల్లా రామాయపట్నం పోర్టును ప్రారంభిస్తాం

- ఇకపై ప్రతినెలా పోర్టు పురోగతిపై సమీక్ష
- రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్దన్ వెల్లడి
- పోర్టు, ఫిషింగ్‌హార్బర్‌ను మంత్రి ఆనంతో కలిసి పరిశీలన



రామాయపట్నం పోర్టు మ్యాపును పరిశీలిస్తున్న మంత్రులు జనార్దన్, ఆనం

కందుకూరు, ఆగస్టు 2: వచ్చే సంవత్సరం జూన్ నెలాఖరుకు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను పూర్తిచేసి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కందుకూరు, కావలి ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కృష్ణారెడ్డిలను వెంటబెట్టుకుని కలెక్టరు ఆనంద్, పోర్టు అధికారులతో కలిసి శుక్రవారం సాయంత్రం రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అనంతరం అధికారులతో జరిగిన సమీక్షలో మంత్రి జనార్దన్ మాట్లాడుతూ రామాయపట్నం పోర్టును ఎంతో అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో సీఎం చంద్రబాబు సమీక్షలు చేస్తున్నారని, పోర్టు నిర్మాణపనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రూ.4929 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టినఈ పోర్టులో ఇప్పటివరకు 1300 కోట్లతో 51 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. ఇకముందు పోర్టు నిర్మాణ పురోగతిపై నెలనెలా నివేదిక ఇవ్వాలని కలెక్టరుకు సూచించారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రామాయపట్నంను మేజరు పోర్టుగా అభివృద్ధి చేసేందుకు కూడా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

మరో మంత్రి ఆనం మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణం పూర్తయితే జిల్లాలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎంతో మెరుగవుతాయన్నారు. పోర్టు సమీప గ్రామాలలో భూ సమస్యలు, పరిహారం సమస్యల పరిష్కారానికి కృషి చేయటం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా తయారు చేస్తామన్నారు. పోర్టు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన చేవూరు, రావూరు, కర్లపాలెం, సాలిపేట రైతులకు పరిహారంగా ఎకరాకు 25 లక్షలకు (ప్రస్తుతం రూ.16 లక్షలు) పెంచాలని మంత్రులను కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. సమావేశంలో మారిటైంబోర్డు కార్యదర్శి సురేష్‌కుమార్, కలెక్టరు ఆనంద్, కందుకూరు సబ్ కలెక్టరు విద్యాధరి, టీడీపీ నేతలు బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బోగోలు మండలం జువ్వలదిన్నెలో నిర్మాణంలో ఉన్న ఫిషింగ్‌హార్బర్‌ను మంత్రులు జనార్దన్, ఆనం పరిశీలించారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేసి మత్స్యకారులకు అందజేస్తామని వారు స్పష్టం చేశారు.

చెన్నయ్య ఆలయ అభివృద్ధిపై నీలినీడలు

- దాతల సహకారంతో సాగిన రూ.8 కోట్ల పనులు
- బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆపిన కాంట్రాక్టర్
- లెక్కలు తేలకపోవడంతో తప్పుకోని ప్రస్తుత పాలకవర్గం

మార్కాపురం చెన్నకేశవస్వామి ఆలయంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఆలయ అభివృద్ధి పనులకు నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో దేవదాయశాఖ నుంచి సకాలంలో నిధులు రాబట్టలేకపోయారు. దీంతో నాలుగు నెలలుగా పనులు నిలిచిపోయాయి. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోవడంతో దర్శనానికి వచ్చే భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ఇదిలా ఉండగా గత పాలకవర్గమే ప్రస్తుతం ఉంది. సాధారణంగా ప్రభుత్వం మారిన తర్వాత పాత పాలకవర్గాలు తప్పుకుంటాయి. పనులు పెండింగ్‌లో ఉన్నందున, ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదలైతే లెక్కలు చూసుకుని తప్పుకుంటామని ప్రస్తుత పాలకవర్గం చెబుతోంది. అయితే వైసీపీ ప్రభుత్వంలో నిధులు సాధించుకోలేని వారు నెపం కూటమి ప్రభుత్వంపై వేయాలని చూడటం ఏమిటని భక్తులు విమర్శిస్తున్నారు.

మార్కాపురం, ఆగస్టు 2: రాయలసీమ ప్రాంత ప్రజల ఆరాధ్యదైవం శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి. మార్కాపురం పట్టణ నడిబొడ్డున కొలువైన స్వామివారి ఆలయం ఏటికేడు అభివృద్ధి చెందుతోంది. ఒక్కో పాలకవర్గం హయాంలో ఒక్కో వసతి ఆలయానికి సమకూరింది. దశాబ్దన్నర నుంచి జరుగుతున్న ఈ అభివృద్ధి పనులతో ఆలయం నూతన శోభను సంతరించుకుంది. గతంలో పాతదాని స్థానే నూతన రథం, గాలిగోపుర జీర్ణోద్ధరణ, తిరుమల స్వర్ణరథం తరహాలో వెండి రథం, ఆలయం లోపల నూతనంగా ఫ్లోరింగ్ తదితర అభివృద్ధి పనులు జరిగాయి. ఈక్రమంలోనే గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన పాలకవర్గం కూడా ఆలయానికి నూతన సొబగులు అద్దాలని తలపోసింది. ఆలయ నాలుగు దిక్కుల ఉన్న గోపురాలు శిథిలావస్థకు చేరడంతో నూతన గోపురాలు, ఉపాలయాలు నిర్మించాలని నిర్ణయించింది. దీనికోసం రూ.8కోట్ల వరకు ఖర్చవుతున్నందున దాతల సహకారం తీసుకున్నారు. అందులో దేవదాయశాఖ సీజీఎఫ్ ద్వారా రూ.3 కోట్ల వరకు నిధులు మంజూరు చేయాలి. మిగిలిన నిధులకు దాతలు నుంచి సేకరించి పనులు ప్రారంభించారు. అయితే దేవదాయశాఖ నుంచి రావాల్సిన నిధులు ఆలస్యమయ్యాయి. దీంతో పనులు ఆగిపోయాయి.

లెక్కలు తేలక తప్పుకోని పాలకవర్గం

వైసీపీ ప్రభుత్వం సక్రమంగా బిల్లులు చెల్లించి ఉంటే పనులు కూడా సకాలంలోనే పూర్తయ్యేవి. బిల్లులు రాకపోవడంతో పాలకవర్గం దాతల నుంచి సమీకరించిన నిధుల నుంచి కాంట్రాక్టర్‌కు ఇప్పటివరకు బిల్లులు చెల్లించింది. కానీ ఇంకా రూ.1.40కోట్ల మేర నిధులు దేవదాయశాఖ నుంచి రావాల్సి ఉంది. ముందుగా పనులు చేస్తే నిధులు వస్తాయో రావో తెలియక పాలకవర్గం కూడా పనులు పూర్తిచేయించేందుకు వెనుకడుగు వేస్తోంది. అంతేకాక ప్రభుత్వం మారడం కూడా వారికి ప్రతిబంధకంగా మారింది. ఇప్పటికే పాలకవర్గంలోని కీలకమైన వ్యక్తి అధికారపార్టీ నాయకులతో ఆలయ అభివృద్ధి పనులపై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మీరు ఇప్పిస్తే పనులు పూర్తి చేసి తప్పుకొంటామని ప్రతిపాదన పంపారు. కానీ అధికారపార్టీ నాయకులు మాత్రం తొలుత ఆయనపై మండిపడినట్లు తెలిసింది. పనులు పూర్తికాకుండానే ఎన్నికలకు ముందు హడావుడిగా ఎందుకు గోపురాలకు కలశాలను అమర్చారని ప్రశ్నించారు. కేవలం రాజకీయ స్వార్థంకోసం పవిత్రమైన దేవస్థానాన్ని కూడా వేదిక చేసుకోవడం దారుణమని మండిపడ్డారు.

ఇప్పటివరకు చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు చెల్లించిన మొత్తం ఎంత, దాతల నుంచి సేకరించిన విరాళాలు ఎంత మొత్తం అనేవి లెక్కచెప్పి తప్పుకోవాలని సూచించారు. దీనికి పాలకవర్గం అంగీకరించలేదని తెలిసింది. మరోవైపు ప్రస్తుతం పాలకవర్గంపై దాతలు కూడా ఒత్తిడి తీవ్రం చేశారు. తాము దేవుని కోసం విరాళాలు అందజేస్తే పనులు పూర్తి చేయించకుంటే ఎలా అంటూ పాలకవర్గంలోని కీలకమైన వ్యక్తిని ప్రశ్నించారు కూడా. ఏదిఏమైనా అటు వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు రాక, పనులు పూర్తికాకుండానే రాజకీయ అవసరాల కోసం కలశస్థాపన చేయడం తదితర కారణాల వలన పాలకవర్గం అభాసుపాలైంది.

నిధులు ఇవ్వని వైసీపీ ప్రభుత్వం

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో నాలుగు గోపురాలు, రంగనాయక, ఆండాల్ అమ్మవారి గుడుల జీర్ణోద్ధరణ, నూతనంగా ఆంజనేయస్వామి గుడి, భేరి మండపం, సాలాహారాలు, బండపరుపు తదితర పనులకు సుమారు రూ.8 కోట్లు ఖర్చవుతుందని 2021లో దేవస్థాన పాలకవర్గం అంచనాలు వేయించింది. దేవదాయశాఖ అధికారులు మాత్రం తాము మ్యాచింగ్ గ్రాంట్ కింద కొన్ని పనులకు మాత్రమే నిధులు మంజూరు చేస్తామన్నారు. అందులోభాగంగా నాలుగు గోపురాలకుగాను మూడింటి నిర్మాణానికి రూ.కోటి చెల్లిస్తే మరో రూ.2 కోట్లు ఇస్తామని పాలకవర్గానికి చెప్పారు. దాతల నుంచి సమీకరించి రూ.కోటిని పాలకవర్గం వెంటనే దేవదాయశాఖకు చెల్లించింది. దీంతో పనులను 2022 అక్టోబర్‌లో ప్రారంభించారు. తూర్పు, ఉత్తరం, దక్షిణ గోపురాలకు రూ.3కోట్ల పనికి దేవదాయ శాఖ బిల్లులు చెల్లించాల్సి ఉంది. వీటికి పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వకపోవడంతో పనులు మధ్యలో నిలిచాయి. మరో రూ.2.10 కోట్లను పాలకవర్గం 17మంది దాతల ద్వారా సమీకరించింది. కీలకమైన పడమర గోపుర నిర్మాణం చేపట్టింది. అంతేకాక రూ.1.20 కోట్లతో పాత గుడుల స్థానే నూతనంగా రంగనాయకస్వామి, ఆండాల్ అమ్మవార్లకు, రూ.35లక్షలతో బయట ఉన్న ఆంజనేయస్వామి గుడిని లోపలి వైపున, రూ.25లక్షలతో భేరి మండపం, రూ.1.50 కోట్లతో పాడైపోయిన సాలాహారాలు, బండపరుపు పనులను దాతల నుంచి సేకరించిన నిధులతో నిర్మించాలి. దాతల ద్వారా దాదాపు నిధుల సేకరణ పూర్తయింది. వాటి పనులు జరుగుతున్నాయి. కానీ దేవదాయశాఖ నిధులతో జరగాల్సిన పనులకు బిల్లులు చెల్లించడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది. రూ.3 కోట్లకుగాను ఇప్పటివరకు రూ.1.70 కోట్లు మాత్రమే బిల్లులు చేశారు. ఇచ్చిన ఈ నిధుల్లోనూ, పాలకవర్గం చెల్లించిన రూ.కోటి ఉంది. అంటే గత వైసీపీ ప్రభుత్వం ఇంతటి కీలకమైన ఆలయ అభివృద్ధి పనికి చెల్లించింది కేవలం రూ.70లక్షలు మాత్రమే. బిల్లులు చెల్లించడంలో జాప్యం చోటు చేసుకుంటుండటంతో కాంట్రాక్టర్ ఈ సంవత్సరం మార్చి నుంచి పనులు నిలిపివేశారు. దాతలు పూర్తిస్థాయిలో సహకరించినా వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించింది.



దాతల సహకారంతో నిర్మిస్తున్న పడమర వైపు గోపురం

త్వరలో బిల్లులు అవుతాయి

- గొలమారి శ్రీనివాసరెడ్డి, ఈవో

ఎన్నికల కోడ్ నేపథ్యంలో గతంలో బిల్లులు నిలిచాయి. మరో వారం పదిరోజుల్లో పనులు పూర్తవుతాయి. బిల్లులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. భక్తులకు అసౌకర్యం లేకుండా చూస్తాం.

పోలీసుశాఖ ప్రక్షాళన

మొన్న ఐడీ పార్టీలు రద్దు

ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్ పటిష్టతకు శ్రీకారం

దిద్దుబాటు చర్యలు చేపట్టిన ఎస్పీ



ఒంగోలు(క్రైం), ఆగస్టు 2: పోలీసు శాఖ ప్రక్షాళనకు నూతన ఎస్పీ ఏఆర్.దామోదర్ శ్రీకారం చుట్టారు. పోలీసు స్టేషన్‌లో ఐడీ పార్టీల పేరుతో వసూల్ రాజాలుగా ఉన్నవారిని సాధారణ విధులకు వినియోగించుకోవాలని ఆదేశాలు జారీచేసిన ఆయన స్పెషల్ బ్రాంచ్ పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు ఔత్సాహికులైన హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల నుంచి దరఖాస్తులు కోరారు. దీంతో ఎస్‌బీలో దీర్ఘకాలికంగా ఉన్నవారి గుండెల్లో అలజడి మొదలైంది. క్షేత్రస్థాయిలో 16మంది ఎస్‌బీ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది దీర్ఘకాలికంగా పనిచేసేవారు ఉన్నారు. అనేకమందిపై ఆరోపణలు ఉన్నాయి. అదేక్రమంలో ఏఎస్ఐలకు అవకాశం లేదని స్పష్టం చేశారు. పోలీసుశాఖలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది జిల్లాలో ఏమి జరుగుతుంది, అసాంఘిక శక్తుల కార్యకలాపాలు, నాయకుల వ్యవహారశైలిపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి నేరుగా ఎస్పీకి చేరవేయడం ఎస్‌బీ పని. అయితే ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న సంఘటనలు, రాజకీయ మార్పులు తదితర విషయాలను నేరుగా ప్రజాప్రతినిధులకు చేరవేయడం పరిపాటిగా మారింది. ఎస్పీ కార్యాలయం కంటే ముందుగా ప్రజాప్రతినిధులకు తెలియజేయడం ఆక్షేపణీయం. అదేక్రమంలో పాస్‌పోర్టు వెరిఫికేషన్ పేరుతో వసూళ్లకు పాల్పడడం పోలీసు శాఖకు అప్రతిష్ట తెచ్చే అంశంగా మారింది. ఇలాంటి పరిస్థితులలో ఎస్‌బీని ప్రక్షాళన చేయడంవైపు ఎస్పీ అడుగులు వేయడం ఆహ్వానించదగ్గ అంశం.

ఎస్‌బీ నియమాకాలలో నిబంధనలు ఇలా..

స్పెషల్ బ్రాంచ్ నియామకాలలో తీసుకోవాల్సిన నిబంధనలు ఇలా ఉన్నాయి. హెడ్‌కానిస్టేబుల్ మాత్రమే క్షేత్రస్థాయిలో అధికారిగా పనిచేయాలి. వారికి సహాయం కోసం కానిస్టేబుల్‌ను నియమించాలి. అవినీతి ఆరోపణలు, పోలీసు కేసులు ఉండకూడదు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేసేందుకు ఆసక్తిచూపుతున్న వారి జాబితాను తయారుచేసి ఇంటిలిజెన్సీ క్లియరెన్స్ తీసుకోవాలి. అలాంటి వారి ప్యానల్ లిస్టు తయారుచేసి అవసరమైనచోట నియామకాలు జరపాలి. అయితే గత ఐదేళ్లుగా అలాంటి ప్రక్రియను పక్కనపెట్టి రాజకీయ నాయకుల సిఫార్సులకు ప్రాధాన్యత ఇస్తూ వచ్చారు. దీంతో ఎస్‌బీ పనితీరు ఆశాజనకంగా లేదని చెప్పవచ్చు.

ఎస్‌బీలో పనిచేయాలనుకునే వారు పేర్లు నమోదు చేసుకోవాలి: ఎస్పీ

స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేసేందుకు ఆసక్తిచూపుతున్న వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. హెడ్‌కానిస్టేబుళ్లు తప్పనిసరిగా పోలీసు శాఖలో 20ఏళ్ల పనిచేయాలని, కానిస్టేబుళ్ల అయితే కనీసం మూడేళ్ల సర్వీసులో చేరి ఉండాలని అలాంటి వారు స్పెషల్ బ్రాంచ్‌కి తమ పేర్లు ఇవ్వాలని ఎస్పీ మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. అదేక్రమంలో తాము కేటాయించిన చోట పనిచేయాలన్నారు. దీంతో ఎస్బీలో ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందిలో అలజడి బయలుదేరింది. సమూలంగా మార్పులు చేస్తారా? లేక అంచెలంచెలుగా బదిలీలు ఉంటాయా అనేది చర్చనీయంశమైంది.

'బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి'

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 2: జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిచేందుకు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం బాలకార్మిక వ్యవస్థపై టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో బాలకార్మికులపై ఈనెల 1 నుంచి 31వతేదీ వరకు నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌ను పక్కాగా నిర్వహించాలన్నారు. ఎక్కడైనా బాలలు పనిచేస్తుంటే వారిని ఆ పని నుంచి విముక్తులు చేసి వారిని పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రైవ్ ద్వారా విముక్తి కల్పించిన వారందరూ బడికి వెళ్తున్నారా.. లేదా? అనేది నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రభుత్వం పిల్లల చదువుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నందున వాటిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. స్పెషల్‌డ్రైవ్‌లో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఐసీడీఎస్, పోలీస్, మెడికల్ తదితర శాఖల అధికారులను సమన్వయం చేసుకొని క్షేత్రస్థాయిలో పర్యటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో అధికారులు మాధురి, సుభద్ర, డాక్టర్ సురేష్‌కుమార్, దినేష్‌కుమార్, సీడబ్ల్యూసీ ఛైర్మన్ రామాంజనేయులు, సార్డ్ స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ సెక్రటరి ఆర్.సునీల్‌కుమార్ పాల్గొన్నారు అంతకుముందు బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలనపై కలెక్టరేట్ వద్ద ఏర్పాటుచేసిన ర్యాలీని కలెక్టర్ జెండాను ఊపి ప్రారంభించారు.

కేజీబీవీ ప్రత్యేక అధికారి, ఏఎన్ఎంపై వేటు

ఇద్దరిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ డీఈవో ఉత్తర్వులు

పాఠశాలలో బాలిక ప్రసవంపై కలెక్టర్ సీరియస్



ఒంగోలు నగరం/విద్య, ఆగస్టు 2: కొత్తపట్నం మండలం పాదర్తి-మోటుమాల గ్రామాల మధ్య ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో రెండురోజుల క్రితం ఇంటర్ బాలిక ప్రసవించిన ఘటనపై కలెక్టర్ తమీ మ్ అన్సారియా సీరియస్ అయ్యారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలకు కలెక్టర్ ఆదేశించటంతో ప్రత్యేకాధికారి వి.అరుణకుమారి, ఏఎన్ఎం జె.సత్యవతిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ డీఈవో సుభద్ర ఉత్తర్వులు జారీచేశారు. విద్యాలయంలో ఆ విద్యార్థిని గర్భంతో ఉంటే గుర్తించలేకపోవడానికి పాఠశాల ప్రత్యేక అధికారి(ప్రిన్సిపాల్) అరుణకుమారి నిర్లక్ష్యమే కారణమని తేల్చారు. అలాగే కేజీబీవీలో ఔట్‌సోర్సింగ్‌పై ఏఎన్ఎంగా పనిచేస్తున్న జె.సత్యవతి ప్రతిరోజూ విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలి. పాఠశాలలో బాలిక గర్భంతో ఉన్నప్పటికీ గుర్తించకపోవటంపై ఆమెను కూడా ఉద్యోగం నుంచి తొలగించేశారు.

ఘటనపై చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆరా...

కేజీబీవీలో జరిగిన ఘటనపై జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ వేము రామాంజనేయులు ఆరా తీశారు. బాలిక గర్భం దాల్చటం, బాత్‌రూమ్‌లోనే ప్రసవించటంపై ఆయన ప్రాథమిక విచారణను పూర్తి చేశారు. ఈ ఘటనపై చీమకుర్తి పోలీసుస్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. నిందితులు కొంతమంది పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాలిక పూర్తిగా కోలుకున్న తర్వాత పోలీసులు ఆమెను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచనున్నారు. ఈ కమిటీ మరోసారి బాలికను పూర్తిస్థాయిలో విచారించనున్నారు. ఈ అఘాయిత్యానికి పాల్పడిన వారు ఎవరు, బాలికను పాఠశాలలో చేర్పించిన వారు ఎవరు, అక్కడ సిబ్బంది బాలిక గర్భంతో ఉన్న విషయం తెలిసి కూడా దాచిపెట్టారా? ప్రసవించిన విషయాన్ని తొలుత దాచిపెట్టాలని చూశారని వస్తున్న ఆరోపణలు ఎంతవరకు నిజం అనే దిశగా ఇప్పటికే పోలీసులు విచారణ జరుపుతుండగా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కూడా మరోసారి పూర్తిస్థాయిలో విచారణ జరుపనున్నారు.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

40 మందికి ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 2 : జిల్లాలో 40మంది తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల సమయంలో బాపట్ల, పల్నాడు, గుంటూరు, నెల్లూరు జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లను తిరిగి వారి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ ఇటీవల సీసీఎల్ఏ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆయా మండలాలకు నియమించిన వారి వివరాలిలా ఉన్నాయి. కే.ప్రవీణ్‌కుమార్(నాగులుప్పలపాడు), ఒంగోలులో పనిచేస్తున్న ఎం.సృజన్‌కుమార్ (మద్దిపాడు), ఆర్.బ్రహ్మయ్య(చీమకుర్తి), వి.ఆదిలక్ష్మి(సంతనూతలపాడు), ఎం.హరిబాబు (యర్రగొండపాలెం), ఎండి నయూమ్ అహ్మద్ (పుల్లలచెరువు), జి.శ్రీనివాస్(త్రిపురాంతకం), పి బాలాజీ విశ్వనాథ్(దోర్నాల), పి.శైలేంద్రకుమార్(పెద్దారవీడు), బి. రమాదేవి(దొనకొండ)లు నియమితులయ్యారు. జి.రజనికుమారి(కురిచేడు), ఎల్.లక్ష్మీనారాయణ (ముండ్లమూరు), ఎం. శ్రావణ్‌కుమార్(దర్శి), పి.సింగారావు(తాళ్ళూరు), ఎస్.వాసు(ఒంగోలు), పి.మధుసూదనరావు(కొత్తపట్నం), ఎం.జ్వాలానరసింహం(మద్దిపూడి), డి.సీతారామయ్య(టంగుటూరు), వి.పుల్లారావు(పొన్నలూరు), కే.చిరంజీవి (మార్కాపురం) నియమితులయ్యారు. బి.జయవర్ధన్(తర్లుపాడు), కనిగిరిలో పనిచేస్తున్న ఎ.సురేష్(కొనకనమిట్ల), ఎంవి.కృష్ణారెడ్డి (పొదిలి), వి.కిరణ్(కంభం), ఎం.ఆంజనేయరెడ్డి(గిద్దలూరు), బి.దిలీప్‌కుమార్(హెచ్‌ఎంపాడు), ఎం.సువర్ణ(వెలిగండ్ల), సీహెచ్. అశోక్‌కుమార్‌రెడ్డి(కనిగిరి), సీహెచ్.ఉష (పీసీపల్లి), ఎం.మంజునాథరెడ్డి (సీఎస్‌పురం)లు నియమితులయ్యారు. బీవీ.రమణారావు(పామూరు), ఎస్.ఉషారాణి(ఏఓ, కనిగిరి ఆర్డీవో ఆఫీసు), కే.రవీంద్రారెడ్డి(ఏఓ, మార్కాపురం సబ్‌కలెక్టర్ ఆఫీస్), మార్కాపురం ఆర్డీవో ఆఫీసులో పనిచేస్తున్న సీహెచ్.శ్రీనివాసరావు(కలెక్టరేట్, అడ్మిన్), ఎస్ఎల్ నారాయణరెడ్డి(కలెక్టరేట్, సూపరింటెండెంట్), టి.రవి(కలెక్టరేట్, సూపరిండెంటెంట్, కోఆర్డినేషన్), ఎం.రాజ్యలక్ష్మి(కలెక్టరేట్, సూపరింటెండెంట్, ల్యాండ్), ఎస్.సంజీవరావు(సూపరింటెండెంట్, కలెక్టరేట్ ల్యాండ్-2), కేఎస్ఆర్.కృష్ణారావు(ఒంగోలు ఆర్డీవో ఆఫీసు, కేఆర్‌సీసీ), పెద్దారవీడులో పనిచేస్తున్న కే.దాసును(మార్కాపురం ఆర్డీవో ఆఫీసు కేఆర్‌సీసీ)లో నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆంధ్రజ్యోతి
ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం
ప్రతిరోజు క్లాసిఫైడ్స్

అమ్మబడును

■ తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు సిటీలో రన్నింగ్ హోటల్స్, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, హాస్టల్స్ & ఫ్లాట్లు, ఖాళీ స్థలాలు, ఇల్లులు అమ్మబడును. సంప్రః 97042 50705.
AJO-20007

అద్దెకు ఇవ్వబడును

■ నివాస గృహములకు, కార్యాలయాలకు 1వ అంతస్తు, కర్నూల్ రోడ్ నుండి 2 ఇల్లు శ్రీనగర్ కాలనీ, 4వ వీధి, ఒంగోలు. సంప్రః సెల్: 94400 45144, 8985447437.
AJO-ONG

WANTED IMMEDIATELY

■ 1) సైటు సూపర్‌వైజర్, 2) సైటు ఇంజనీర్స్ గా మా కన్‌స్ట్రక్షన్ నందు పనిచేయుటకు అనుభవము కలిగిన అభ్యర్థులు వెంటనే కావలెను. విద్యార్హత, 1). ఏదేని డిగ్రీ / ఇంటర్, 2). B.Tech Civil or Diploma Civil, Contact సెల్: 9948260744
AJO-190200

WANTED STAFF

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 20k. Phone : 8977639662 / 8977639663
AJH-4211

WANTED

■ ప్రకాశం జిల్లా, శింగరాయకొండలోని శ్రీ విద్యానికేతన్ హైస్కూల్ నందు ఇంగ్లీష్, హిందీ, తెలుగు మరియు సోషల్ బోధించుటకు ప్రైమరీ టీచర్స్ కావలెను. అర్హులైనవారు సంప్రః సెల్: 7095767709
AJO-285

WANTED

■ ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్టూరు (మం) బొబ్బేపల్లి (గ్రా)లో ఇంటి వద్ద సహాయకురాలుగా ఉండుటకు చదువుకున్న హిందూ యువతి కావలెను. అర్హతను బట్టి జీతం 10,000 నుండి 12,000 వరకు ఉండును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 72931 99999.
AJG-191760

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.
జన్మదిన శుభాకాంక్షలు
వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు
విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు
లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి.
ప్రతి ప్రకటనపై GST 5% అదనం.
ఒంగోలు : 99854 11071 97036 18694 99854 11483
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358
ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్రః 9985411484



బాలుడి తల్లిదండ్రులకు ఎన్ఆర్ఐలు అందించిన నగదు చెక్కును అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు శివలింగారావు

చిన్నారిని ఆదుకోవటం అభినందనీయం

బల్లికురవ, ఆగస్టు 2: అనారోగ్యం బారిన పడిన చిన్నారి కుటుంబానికి ఎన్ఆర్ఐలు ఆర్థిక చేయూత నివ్వటం అభినందనీయమని ఎంఈవో రమేష్ అన్నారు. శుక్రవారం అంబడిపూడి ఉన్నత పాఠశాలలలో ఆదేగ్రామానికి చెందిన బడుగు సుధారాణి చిన్నబాబు దంపతుల 8 ఏళ్ల కుమారుడు జాన్‌వెస్లీ మెదడుకు సంబంధించిన వ్యాధి బారిన పడి విజయవాడ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివలింగారావు తన వద్ద చదివిన యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థి బత్తుల అనిల్ దృష్టికి తీసుకుపోయాడు. అనిల్ అమెరికాలో స్థిరపడి వారి మిత్ర బృందం ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 1.60 లక్షల చెక్కును చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. అదేవిధంగా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కూడా రూ.60వేల నగదును కూడా అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఈసందర్భంగా ఎంఈవో రమేష్ గ్రామ పెద్దలు ఎన్ఆర్ఐల ఆర్థిక సహకారాన్ని కొనియాడారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు గొట్లగుంట వెంకటనర్సయ్య, వేణుబాబు, దద్దాల అంజయ్య, సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వై. రామకృష్ణ

కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు అందించాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 2: ఆయా బ్యాంక్‌లన్నీ కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు అందించాలని బాపట్ల జిల్లా వ్యవసాయఅధికారి వై. రామకృష్ణ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు కార్డు కలిగి ఉన్న ప్రతి రైతుకు పంట రుణం మంజూరు చేయాలన్నారు. అద్దంకి నియోజకవర్గంలో సుమారు 10 వేల మందికి కౌలు రైతు గుర్తింపు కార్డులు అందించామని, అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణాలను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ, అద్దంకి, మార్టూరు ఏడీఏలు ధనరాజ్, శ్రీనివాసరావు, పశు వైద్యశాల ఏడీ డాక్టర్ ఎం. మోహనరావు, అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, కొరిశపాడు, పంగులూరు మండలాల వ్యవసాయ అధికారులు కొర్రపాటి వెంకటకృష్ణ, కుమారి, లావణ్య, శ్రీనివాసరావు, సుబ్బారెడ్డితోపాటు ఆయా బ్యాంకుల మేనేజర్లు ,ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



విద్యార్థినులను విచారిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

బీసీ హాస్టల్ విద్యార్థినుల వివాదంపై విచారణ

చీరాలటౌన్, ఆగస్టు 2 : చీరాల పట్టణంలో బీసీ హాస్టల్ విద్యార్థినుల వాయిస్ సోషల్ మాధ్యమాల ద్వారా వైరల్ అయిన ఘటనపై ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి విచారణ జరిపారు. హాస్టల్‌లో ముగ్గురు విద్యార్థినులు హాస్టల్ నుంచి బయటకు రావడంతో స్థానికులు వారిని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. దీంతో స్పందించిన పోలీసులు వారిని హాస్టల్ వార్డెన్ పాలపర్తి కోటేశ్వరమ్మకు అప్పగించారు. దీనిపై ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి నేరుగా హాస్టల్‌కు వెళ్లి విచారణ జరిపారు. ప్రస్తుత పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నట్లు గుర్తు చేశారు. అలాగే వార్డెన్, ఆమె కుమారుడికి పలు హెచ్చరికలు జారీ చేశారు. మరోమారు ఇటువంటివి ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. అయితే వార్డెన్ కోటేశ్వరమ్మ చాలాకాలంగా అనారోగ్యం బారిన పడటంతో మరో విభాగానికి బదిలీకు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.



కారంచేడు ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పారిశుధ్య కార్మికుల నిరసన

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 2: కారంచేడు గ్రామ పంచాయతీ టెండర్లలో అవకతవకలు జరిగాయని, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులను విధుల్లోకి రాకూడదని ఈవోఆర్డీ రమేష్ మెమో జారీ చేయటం పట్ల పారిశుధ్య కార్మికులు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈకార్యక్రమానికి సీఐటీయు మద్దతుగా నిలిచి కార్మికులతో కలిసి కార్యాలయం ముందు నిరసన గళం వినిపించారు. సీఐటీయూ నేత కొండయ్య మాట్లాడుతూ పంచాయతీ కాంట్రాక్టర్లు మారినా, టెండర్ దారులు మారినాపారిశుధ్య కార్మికులను కొనసాగించాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారులు ఈవిషయాన్ని గుర్తించి టెండర్లను ఆమోదించి కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని కోరారు. ఈకార్యక్రమంలో కారంచేడు గ్రామ సర్పంచ్ బాలిగ శివపార్వతి, గ్రామస్థులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర కృషి

అద్దంకి, ఆగస్టు 2: రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ జి. శ్రీచరణ్ అన్నారు. అద్దంకి తహసీల్దార్‌గా శుక్రవారం శ్రీచరణ్ బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల ఆర్డీవో కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా పనిచేస్తూ ఎన్నికల ముందు ప్రకాశం జిల్లా లింగసముద్రంకు బదిలీ పై వెళ్లిన శ్రీచరణ్ ను అద్దంకి తహసీల్దార్‌గా నియమించారు. దీంతో శ్రీచరణ్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన శ్రీచరణ్ ను కార్యాలయం అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



అద్దంకి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీచరణ్

సాగు భూములపై హక్కు కల్పించండి

జేసీని కోరిన రైతులు

మార్టూరు, ఆగస్టు 2: ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న ఈనాం భూములపై చట్టపరంగా తమకు హక్కు కల్పించాలని జాయింట్ కలెక్టర్ సుబ్బారావును రైతులు కోరారు. శుక్రవారం మండల తహసీల్దారు కార్యాలయంలో మండలంలో ఉన్న ఈనాం భూములపై వివరాలు సేకరణకు, అదేవిధంగా వాటిని సాగుచేసుకుంటున్న రైతులతో జేసీ సుబ్బారావు, ఆర్డీవో గంధం రవీందర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈనాం భూములకు సంబంధించిన రికార్డులను జేసీ పరిశీలించారు. ఆభూముల వివరాలను తహసీల్దారు ప్రశాంతి అధికారులకు వివరించారు. వాటిలో జంగమహేశ్వరపురం గ్రామానికి సంబంధించి 2,539 ఎకరాల ఈనాం భూములు ఉన్నాయని అధికారులకు తెలిపారు. ఈ పొలాలను రామకూరు, కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి, ధర్మవరం, వలపర్ల గ్రామాలకు చెందిన 912 మంది రైతులు సాగుచేసుకుంటున్నారన్నారు. అదేవిధంగా లక్కవరం గ్రామ పరిధిలో 565 ఎకరాలు ఈనాం భూములు ఉన్నాయన్నారు. వాటిని రామకూరు, బొల్లాపల్లి గ్రామాలకు చెందిన 386 మంది రైతులు సాగుచేసుకుంటున్నారన్నారు. దీనిపై జేసీ సంబంధిత రైతులతో మాట్లాడుతూ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను చీఫ్‌సెంట్రల్‌ఆఫ్ లాండ్‌అడ్మినిస్ట్రేషన్‌కు పంపిస్తానని, ఈ విషయంలో రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం తరఫున ఈనాం భూములపై విచారణ చేస్తున్నట్లు రైతులకు తెలిపారు.



ఈనాం భూముల వివరాలను తెలుసుకుంటున్న జేసీ సుబ్బారావు, ఆర్డీవో రవీందర్‌లతో తహసీల్దారు ప్రశాంతి

అద్దంకిలో ఎంవీఐ కార్యాలయం ఏర్పాటు చేయాలి

మంత్రి రవికుమార్‌కు అద్దంకి వాసులు వినతి

అద్దంకి, ఆగస్టు2: అద్దంకిలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ అద్దంకి పట్టణానికి చెందిన పలువురు మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం అద్దంకిలో తాత్కాలికంగా రోజు మార్చి రోజు ఎంవీఐ వచ్చి వెళ్తున్నారని, కొద్దిమేర సేవలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయని తెలిపారు. ఎక్కువ శాతం పనులకు చీరాల వెళ్ళాల్సి వస్తుందని, అద్దంకిలో పూర్తి స్థాయిలో కార్యాలయం ఏర్పాటు ద్వారా అద్దంకి నియోజకవర్గంతో పాటు మార్టూరు ప్రాంత వాహనచోదకులకు కూడా ప్రయోజనంగా ఉంటుందని మంత్రి రవికుమార్‌కు వివరించి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, వెలనాటి శ్రీనివాసరావు, రామకృష్ణ, ధూళిపాళ్ల సుబ్బారావు, కరి వేణు, చేబ్రోలు వెంకట సుబ్బయ్య తదిరులు ఉన్నారు.



మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అద్దంకి నేతలు



నూతన కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

నూతన కమిటీ రైతులకు మెరుగైన సేవలు అందించాలి

- ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 2 : ఏకగ్రీవంగా ఎన్నికైన తోటవారిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ నూతన కమిటీ సభ్యులు ఆయకట్టు రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అన్నారు. కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న తోటవారిపాలెం, ఈపురుపాలెం, గవినివారిపాలెం, కావూరివారిపాలెం, పిట్టువారిపాలెం, బోయినవారిపాలెం, పుల్లాయపాలెంకు చెందిన రైతులను ఎమ్మెల్యే అభినందించారు. సమష్టి చర్యలతో మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. వివాదాలకు తావులేకుండా మేలైన యాజమాన్యపద్ధతులు పాటిస్తూ సకాలంలో సాగుదారులకు సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకుని ముందుకు సాగాలని నూతన సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతు ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

గవినివారిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కమిటీ ఏకగ్రీవం

గవినివారిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం అధ్యక్షుడిగా నక్కల లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ బాధ్యులను ఎమ్మెల్యే కొండయ్య అభినందించారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో గవినివారిపాలెం, పిట్టువారిపాలెం, బుర్లవారిపాలెం, విజయ్‌నగర్ కాలనీ, పచ్చమొగిలి, కీర్తివారిపాలెం, వాడరేవు గ్రామాల రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు ఎంతో మేలు

పంగులూరు, ఆగస్టు 2 :తల్లి పాలతో బిడ్డకు ఎంతో మేలు కలుగుతుందని, పుట్టిన క్షణం నుండి తల్లిపాలు బిడ్డకు అందించాలని పంగులూరు సెక్టార్ సూపర్ వైజర్ జయప్రద కోరారు. పంగులూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. పుట్టిన బిడ్డకు రెండేళ్ళ వయస్సు వచ్చేవరకు తల్లి పాలు తాగించడం వలన పిల్లలు ఎంతో ఆరోగ్యంగా ఎదుగుతారని, ఎలాంటి వ్యాధులు దరిచేరవని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఇచ్చే బాలామృతాన్ని ద్రవరూపంలో అందిస్తే అవికూడా తల్లిపాలతో సమానంగా ఉంటుందన్నారు. తల్లులు ఆకుకూరలు, కూరగాయలు అధికంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని, బిడ్డకు సరిపడా పాలు ఏర్పడతాయని జయప్రద తెలిపారు. కార్యక్రమంలో కార్యకర్త స్వర్ణలత, వెంకటరమణమ్మ, ఆశాలు అంజమ్మ. సంధ్య, అనూరాధ, పలువురు తల్లులు పాల్గొన్నారు.



పంగులూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం నిర్వహిస్తున్న సిబ్బంది

అన్నారు. శుక్రవారం అద్దంకి పట్టణంలోని ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సురేఖ, భాగ్యనగర్, సంజీవనగర్, కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, ఆయాలు పాల్గొన్నారు.



సంతమాగులూరు మండలం పత్తేపురంలో చిన్నారులతో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

తల్లిపాలు అమృతంతో సమానం

సంతమాగులూరు : అప్పుడే పుట్టిన చంటి పిల్లలకు తల్లిపాలు అమృతంతో సమానమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుష్మారాణి తెలిపారు. సంతమాగులూరు మండలం పత్తేపురం గ్రామంలో శుక్రవారం తల్లివారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత, వాటి విలువ, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మలాదేవి, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యం

అద్దంకిటౌన్ : తల్లి పాలద్వారా బిడ్డకు రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి

చీరాలలో

చీరాల : తల్లి పాలు అమృతంతో సమానమని వేటపాలెం ప్రాజెక్టు సూపర్‌వైజర్ సునంద అన్నారు. మండల పరిధిలోని వాడరేవులో శుక్రవారం వాడరేవు-2 అంగన్‌వాడీ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌వో పి. భవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.ప్రమీలారాణి, జి. విజయరూస్సీరాణి, బి.సుజాత, జె. లక్ష్మి, ఎం. నాగ ఉషారాణి, ఎం. సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

- తోటవారిపాలెంలో

తోటవారిపాలెం సెక్టార్ వీవర్స్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం వేటపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ పి. విజయలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు సిహెచ్. రత్నకుమార్, ఎస్. సౌజన్య, ఆర్. వాణి, ఆయాలు జ్యోతి, కె. రాణి, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



వాడరేవులో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

వేటపాలెం(చీరాల), ఆగస్టు 2 : వ్యవసాయ అధికారులు, సిబ్బంది ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని వ్యవసాయ విభాగ ప్రాజెక్ట్ మేనేజరు వాణిశ్రీ చెప్పారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయాల భవన సముదాయంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, వెలుగు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. అందుకు అనుగుణంగా కార్యాచరణతో పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం జె.మోహన్, ఎన్ఎఫ్ఏలు, ఎంటీలు, యూనిట్ ఇన్‌చార్జి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ విభాగ ప్రాజెక్ట్ మేనేజరు వాణిశ్రీ

ఆస్తి వివాదంలో వ్యక్తిపై పలువురు దాడి

చీరాలటౌన్, ఆగస్టు 2 : ఆస్తి వివాదంలో వ్యక్తిపై మరి కొందరు దాడిచేసిన ఘటన శుక్రవారం ఇంకొల్లు మండలం నాగండ్లలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన హుస్సేన్ వలీకి సమీప బంధువు మస్తాన్‌కు మధ్య ఆస్తి వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మస్తాన్, మరి కొందరు ఇటుక రాయితో హుస్సేన్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు తలకు రక్త గాయంతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

వరిగడ్డి వామి దగ్ధం

యద్దనపూడి,(మార్టూరు)ఆగస్టు 2:యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో తన్నీరు కిరణ్‌కు చెందిన వరిగడ్డి వామి శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. దాదాపుగా 3 ట్రాక్టర్లకు చెందిన వరిగడ్డి దగ్ధమయ్యింది.అతను ఇంటి సమీపంలోని కొష్టం వద్ద వరిగడ్డిని వామిగా వేశారు. ఒక్కసారిగా గడ్డి వామి నుంచిమంటలు వ్యాపించి, క్షణాల్లో పూర్తిగా దగ్ధమయ్యింది.అయితే స్థానికుల సహకారంతో కిరణ్ మంటలను ఆర్పివేశారు. సుమారు రూ. 30 వేలు రూపాయలు ఆస్తి నష్టం జరిగినట్లు కిరణ్ తెలిపారు.

రేపు ఇంకొల్లులో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

ఇంకొల్లు, ఆగస్టు : ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ ఆదివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇంకొల్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

టీడీపీ నేత, ఆయన కుమారుడిపై దాడి

● చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు

చీరాలటౌన్, ఆగస్టు 2 : చీరాల పట్టణంలో టీడీపీ నాయకుడు మరియు ఆయన కుమారుడిపై పలువురు దాడిచేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చీరాల మండల పరిధిలోని వాడరేవుకు చెందిన పిక్కి నారాయణ టీడీపీ నాయకులు. ఈ మధ్యకాలంలోనే పట్టణంలో ఆయన కుమారుడు వెంకటేష్ ఓ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈనేపథ్యంలో సంబంధిత ఓపెనింగ్‌కు సంబంధించి పూల డెకరేషన్ చేయించుకున్నారు. అందుకు నగదు వసూలు చేసేందుకు వచ్చిన ముగ్గురు యువకులు తండ్రీ, కొడుకు పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీంతో వాదన పెరిగింది. వెంటనే యువకులు మరి కొందరిని పిలిపించి మూకుమ్మడిగా దాడిచేశారు. ఘటనలో తండ్రి తలకు రక్త గాయాలు కాగా కుమారుడి శరీరంపై పలు గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు వారిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఇప్పటికే దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. ఘటనపై పెద్దలు రంగంలోకి దిగి రాజీ కుదిర్చే పనిలో పడ్డారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 2 : మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని డీజీపీ కార్యాలయంలో శుక్రవారం డీజీపీ ద్వారకా తిరుమలరావును ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లా అండ్ ఆర్డర్‌కు సంబంధించి వారి మధ్య కొంత చర్చ జరిగింది. నియోజకవర్గ పరిధిలో పోలీస్ యంత్రాంగం బదిలీలు, నియామకాలపై కూడా చర్చించినట్లు సమాచారం.



డీజీపీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

గృహాలను వేగవంతంగా నిర్మించుకోండి

ఇంకొల్లు, ఆగస్టు 2 : ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద అర్హులైన లబ్ధిదారులు త్వరిత గతిన నిర్మాణాలు చేసుకోవాలని గృహనిర్మాణ శాఖ ఇంజనీరు ఎం.రామకృష్ణ అన్నారు.ఖాతాల్లో ఐదువేల రూపాయల చొప్పున నగదు జయచేశామని, ఇంకొల్లు మండల పరిధిలో 416 మంది లబ్ధిదారులకు ఈ నిధులు జమ కాగా ఒక్కో లబ్ధిదారునికి రూ.1,80,000లు చొప్పున అందజేస్తామన్నారు.శుక్రవారం మండలంలో నిర్మాణాలు జరుగుతున్న గృహాలను ఆయన పరిశీలించారు.

వర్గీకరణకు అనుకూలంగా తీర్పుపై హర్షం

బల్లికురవ, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు తీర్పు వెలువరించటం పట్ల ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు. శుక్రవారం మండలంలోని కొణిదెన గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగ చిత్రపటంతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షులు కందుకూరి పేతురు, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.



కొణిదెన ఎస్సీ కాలనీలో సంబరాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

నేడు ముప్పవరంలో మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, ఆగస్టు 2 :రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం ముప్పవరంలో పర్యటించనున్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మంత్రి అందుబాటులో ఉంటారని కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

ప్రజలకు శుద్ధి జలం అందించటమే ధ్యేయం

అద్దంకి, ఆగస్టు1: ప్రజలకు శుద్ధిజలం అందించటమే ధ్యేయం అని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో గత కొంతకాలంగా మూతపడి ఉన్న ఆర్వో ప్లాంట్‌ను మరమ్మతులు చేయించి శుక్రవారం కమిషనర్ సత్యనారాయణ ప్రారంభించారు. టీడీపీ నేతలు క్లస్టర్ ఇన్‌చార్జి కాకాని అశోక్, కోనేటి అనిల్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, వలి,షేక్ మదీనా, సైదులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్వోప్లాంటును ప్రారంభిస్తున్న కమిషనర్

తప్పిపోయిన బాలిక

● పోలీస్‌లకు అప్పగించిన మున్సిపల్ అధికారులు

అద్దంకి, ఆగస్టు2: తప్పిపోయి మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న బాలికను మున్సిపల్ అధికారులు పోలీస్‌లకు అప్పగించారు. అద్దంకి మున్సిపల్ కార్యాలయం ముందు శుక్రవారం మధ్యాహ్నం 3 సంవత్సరాల బాలిక ఒంటరిగా ఉండటాన్ని గమనించిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పూర్ణ మున్సిపల్ కార్యాలయం లోపలకు తీసుకువెళ్ళి కూర్చొబెట్టి మంచినీళ్ళ బాటిల్, మజ్జిగ ఇప్పించి అక్కడే ఉంచారు. సాయంత్రం వరకు అక్కడే ఉంచారు. రాత్రికి పట్టణంలోని గుర్రాల కాలనీకి చెందిన తల్లిదండ్రులు రావడంతో పోలీసులు బాలికను అప్పగించారు.



పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న తప్పిపోయిన బాలిక

సంతమాగులూరు సీఐ బాధ్యతల స్వీకరణ

సంతమాగులూరు, ఆగస్టు 2: సంతమాగులూరు సీఐగా కె. వెంకట్రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ప్రస్తుతం సీఐగా పనిచేస్తున్న నరసింహారావు వీఆర్‌కు బదిలీ అయ్యారు. గుంటూరు సీసీలో సీఐగా పనిచేస్తున్న కె. వెంకట్రావును ఇక్కడ నియమించారు.శనివారం సర్కిల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సంతమాగులూరు, బల్లికురవ స్టేషన్ల సిబ్బంది, పలువురు రాజకీయ నాయకులు నూతన సీఐని మర్యాద పూర్వకంగా కలిశారు.



బాధ్యతలు స్వీకరించిన సీఐ వెంకట్రావు

తహసీల్దార్‌గా పార్వతి బాధ్యతల స్వీకరణ

వేటపాలెం(చీరాల), ఆగస్టు 2 : వేటపాలెం మండల తహసీల్దార్‌గా పార్వతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పార్వతి మాట్లాడుతూ కార్యాలయం వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ, పారదర్శకమైన సేవలు అందించాలని చెప్పారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ పార్వతి

పింగళి వెంకయ్య జయంతి వేడుకలు

మార్టూరు, ఆగస్టు 2: జాతీయ జెండా రూపకర్త స్వర్గీయ పింగళి వెంకయ్య 148వ జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక లంబాడీతండాలోని ఎంపీపీఎస్ స్కూల్‌లో రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జాతీయగీతం ఆలపించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అంతకు ముందు వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, చెన్నుపాటి బసవరాములు, ఉపాధ్యాయులు కె.తిరుమలేశ్వరరావు, కె. యేలీశమ్మ తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

శనివారం 3 ఆగస్టు 2024



బిట్రగుంట : ఫిషింగ్‌హార్బర్ ప్రగతిపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు జనార్దన్, ఆనం తదితరులు

3, 4 నెలల్లో ఫిషింగ్ హార్బర్ పూర్తి

- జగన్ ప్రభుత్వం వల్లే పనుల ఆలస్యం
- పనుల పరిశీలనలో రాష్ట్ర మంత్రి జనార్దన్



గుడ్లూరు : పోర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు

బిట్రగుంట, ఆగస్టు 2: మూడు, నాలుగు నెలల్లో జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్‌హార్బర్ పనులు పూర్తిచేసి, మత్స్యకారులకు అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయ ల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్ పనులను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి జనార్ధన్ పరిశీలించారు. పెండింగ్ పనుల పరిశీలకు వచ్చిన మంత్రు లకు కలెక్టర్ ఆనంద్, కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, ఆర్డీవో శీనానాయక్ స్వాగతం పలికారు. పూర్తయిన, కావల్సిన పనుల వివరాలను అధికారులతో కలిసి కలెక్టర్ మంత్రులకు వివరించారు. హార్బర్ నిర్మాణ నమూనాను పరిశీలించిన అనంతరం హార్బర్ ముఖద్వారం వరకు వెళ్లి సముద్ర అలల తాకిడి, జరిగిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి జనార్దన్ మాట్లాడుతూ తీర ప్రాంత మత్స్యకా రుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని అన్నారు. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన జరిగిందన్నారు. ఆ తర్వాత జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూడేళ్లలో పూర్తి కావల్సిన పనులు ఇంతవరకు కాలేదని అన్నారు. పెండింగ్ పనుల విషయంలో కలెక్టరు, సంబంధిత అధికారులతో చర్చించామని మూడు, నాలుగు నెలల్లో పూర్తి చేసి మత్స్యకారులకు అందజేసేలా కృషి చేస్తామన్నారు. మంత్రి ఆనం మాట్లాడుతూ జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామయపట్నం పోర్టు, దగదర్తి విమానాశ్రయం ప్రాజెక్టులను పూర్తిచేసి నెల్లూరు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. జిల్లాకు 3 జాతీయ రహదారులు అనుసంధానమై ఉన్నాయని తెలిపారు. వీలైనంత త్వరగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు ఆలోచన అని అన్నారు. మంత్రుల వెంట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఐఅండ్ఐ కార్యదర్శి సురేష్‌కుమార్, మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, మత్స్య శాఖ జేడీ నాగేశ్వరావు, కావలి ఏడీఎఫ్ శ్రీనివాసులు, కావలి డీఎస్పీ వెంకటరమణ డిప్యూటీ తహసీల్దారు జూలియాభాయ్, మత్స్యకార నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రామాయపట్నం పోర్టు పరిశీలన

గుడ్లూరు : రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి పరిశీలించారు. తొలుత అధికార యంత్రాంగం, పోర్టు నిర్వహంకులతో వారు సమీక్షించారు. వీరివెంట కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, వెంకట కృష్ణారెడ్డి, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, టీడీపీ నేతలు బీద రవి చంద్ర, అబ్దుల్ అజీజ్, సురేష్‌కుమార్, పోర్టు అధికారులు పాల్గొన్నారు.



'సోమశిల'కు 5,169 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, ఆగస్టు 2 : ఎగువ నుంచి సోమశిల జలాశయానికి వస్తున్న కృష్ణా జలాల వరద తాకిడి పెరిగింది. తొలిరోజు 3వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా శుక్రవారం నాటికి 5,169 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇదే ప్రవాహం కడప జిల్లా ఆదినిమ్మయపల్లి గేజి వద్ద 10 వేల క్యూసెక్కులుగా ఉంది. దీంతో శనివారం సాయత్రానికి సోమశిలకు వచ్చే ప్రవాహంలో మార్పు కనిపించే అవకాశం ఉన్నట్లు ఇంజనీర్లు చెబుతున్నారు. రోజువారీగా ఒక టీఎంసీ నీరు ప్రాజెక్టుకు చేరితే ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న నీటి సమస్యలను అనతికాలంలో అధిగమించవచ్చని యంత్రాంగం భావిస్తుంది. కాగా, జలాశయం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 9.893 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

15 నుంచి బీఎస్ఎన్ఎల్ 4జీ

- పాత టారీఫ్‌లకే ఈ సేవలు
- జిల్లాలో 32 కొత్త టవర్ల ఏర్పాటు
- రెండేళ్లలో 5జీ సేవలు తీసుకొస్తాం
- డీజీఎం శ్రీనివాసులు వెల్లడి



4జీ గోడపత్రికలను ఆవిష్కరించిన డీజీఎం శ్రీనివాసులు తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 2 :ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను జిల్లాలో ఆగస్టు 15 నుంచి ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డిప్యూటీ జీఎం శ్రీనివాసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం సాయంత్రం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పూర్తిగా స్వదేశీ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో 4జీ సేవలు వినియోగ దారులకు అందజేస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 324 టవర్లు ఉండగా, అదనంగా 32 కొత్త టవర్లు మంజూరయ్యాయన్నారు. వీటిలో 184 టవర్లను 4జీకి మార్పు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 2.7 లక్షల మంది వినియోగదారులు ఉండగా, 44వేల మంది మినహా మిగిలిన వారందరూ 4జీ సిమ్‌లకు మారిపోయారని తెలిపారు. గత నెలలో 16 వేల మంది ఇతర నెట్వర్క్ లకు చెందిన వినియోగదారులు పోర్టబులిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌ను ఎంచుకున్నారని తెలిపారు. రాబోయే రెండేళ్లలో పూర్తిగా 5జీ సేవలు అందించాలన్న లక్ష్యంతో 5జీ సాంకేతిక పరికరాలనే వాడుతున్నట్లు తెలిపారు. ఖర్చుకు వెనుకాడడంలేదని పాత టారీఫ్‌ల ద్వారానే 4జీ సేవలు వినియోగదారులకు అందిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ రికార్డులన్నీ సక్రమంగా ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న సీసీఎఫ్ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : అటవీ శాఖ రికార్డులన్నీ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గుంటూరు రేంజ్ సీసీఎఫ్ (చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ పారెస్ట్) శ్రీనివాస రెడ్డి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం నెల్లూరులోని అటవీ శాఖ కార్యాలయంలో అధికారులు, కార్యాలయ సిబ్బందితో సీసీఎఫ్ సమీక్షించారు. జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, పథకాల అమలు, మొక్కల ప్లాంటేషన్ తదితర విషయాలకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా జామాయిల్ టెండర్ల ద్వారా అటవీశాఖకు, వీఎస్ఎస్‌లకు వచ్చిన లాభాల వివరాలు పూర్తిస్థాయిలో సిద్ధం చేయలన్నారు. ఎర్రచందనం రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పులుల సంరక్షణకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డీఎఫ్‌వో చంద్రశేఖర్, రేంజర్‌లు మాల్యాద్రి, రవీంద్రబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లూరు నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శుక్రవారం శాకాంబరిగా దర్శనం ఇచ్చారు. వివిధ రకాల కాయగూరలు, పండ్లతో ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. భక్తులు బారులుతీరి అమ్మవారిని దర్శించుకున్నారు.



సంగం వద్ద డీసిల్టేషన్‌కు ప్రతిపాదించిన పాయింట్

ఇసుక కొరత తీరినట్టే!

- బ్యారేజీల వద్ద డీసిల్టేషన్‌కు ఆమోదం
- మూడు చోట్ల చేపట్టాలని నిర్ణయం
- ప్రభుత్వానికి చేరిన డీఎల్ఎస్‌సీ నిర్ణయాలు
- అనుమతి వచ్చిన వెంటనే తవ్వకాలు ప్రారంభం

నెల్లూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఇసుక కష్టాలు త్వరలో తీరనున్నాయి. ఈ నెలలోనే మూడు ప్రాంతాల్లో డీసిల్టేషన్ ప్రక్రియ మొదలుపెట్టనున్నారు. దీనివల్ల ఇసుక కొరత తీరడంతోపాటు ధర కూడా భారీగా తగ్గనుంది. పెన్నా బ్యారేజీ డీసిల్టేషన్‌ను పోతిరెడ్డిపాలెం వద్ద, సంగం బ్యారేజీ డీసిల్టేషన్‌ను సంగం, సూరాయపాలెం వద్ద నిర్వహించాలని జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ)లో తీర్మానించారు. కలెక్టర్ ఓ ఆనంద్ నేతృత్వంలో ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, భూగర్భ నీటి శాఖలతో కూడిన డీఎల్ఎస్‌సీ సమావేశాలు ఇప్పటికి నాలుగు దఫాలు జరిగాయి. రీచ్‌ల నిర్వహణకు పర్యావరణ అనుమతులు రావడం ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తుండటంతో వాటి స్థానంలో డీసిల్టేషన్ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్ణయించారు. పోతిరెడ్డిపాలెం, సంగం, సూరాయపాలెం వద్ద డీసిల్టేషన్‌కు ఆమోదం తెలుపుతూ జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదికలు పంపింది. అక్కడి నుంచి అనుమతులు రాగానే ఇసుక తవ్వకాలు మొదలు కానున్నాయి. ఈ నెలలోనే వీటిని ప్రారంభించేందుకు వేగంగా సన్నాహాలు జరుగుతున్నాయి.

అనుమతుల్లేక తవ్వకాలకు బ్రేక్

పేరుకేమో జిల్లాలో ఎనిమిది ఇసుక రీచ్‌లు ఉన్నాయి. వాటితోపాటు సంగం వద్ద డీసిల్టేషన్ పాయింట్‌లోనూ ఎన్నికల ముందు వరకూ తవ్వకాలు జరిగాయి. కానీ ఒక్కదానిలో కూడా ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లేవు. గత వైసీపీ ప్రభుత్వం ఈ అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా తవ్వకాలు జరిపింది. అసలు ఎంత తవ్వారు..? అన్నదానికి లెక్కలు కూడా లేవు. నాడు భారీ ధరకు ఇసుకను విక్రయించారు. అదే సమయంలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు నిత్యం వందల లారీల ఇసుక జిల్లా నుంచి తరలివెళ్లింది. ఈ క్రమంలో పలువురు పర్యావరణవేత్తలు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. అక్కడ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలినా ఇసుక తవ్వకాలు మాత్రం ఆగలేదు. దీంతో ఇంకొందరు సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో తవ్వకాలకు బ్రేక్ పడింది. అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి నివేదికలు అందజేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలో 18 ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయని గుర్తించి మైనింగ్ అధికారులు పరిశీలిస్తున్నారు. ఆ జాబితాలో విరువూరు, సూరాయపాలెం, గొల్లకందుకూరు, మినగల్లు, వెంకటేశ్వరపురం, కోడూరుపాడు, లేగుంటపాడు, పల్లిపాడు, ముదివర్తి, వేగూరు, మన్నేటికోట, రాళ్లపాడు, కలవళ్ల రీచ్‌లు, ప్రాంతాలు ఉన్నాయి. ఎన్నికల తర్వాత ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పర్యావరణ అనుమతులు లేనిదే రీచ్‌లలో తవ్వకాలు జరపకూడదని నిర్ణయించింది. ప్రస్తుతం జిల్లాలో ఉన్న రీచ్‌లకు పర్యావరణ అనుమతుల కోసం అధికారులు కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. వాటికి ఆమోదం లభించేందుకు రెండు, మూడు నెలల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు.

వెంటాడుతున్న వైసీపీ పాపాలు

వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు ప్రజలను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. ఇసుక తవ్వకాలకు నాడు పర్యావరణ అనుమతులు తీసుకొని ఉంటే ఇప్పుడు ఎటువంటి ఆటంకాలు లేకుండా రీచ్‌లలో తవ్వకాలు జరిపేందుకు అవకాశం ఉండేది. అదే జరిగి ఉంటే ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం ప్రజలకు మంచి ఫలితాలను అందించి ఉండేది. ప్రస్తుతం రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేకపోవడంతో యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుకను నిర్మాణ రంగానికి ఇబ్బంది లేకుండా విక్రయించాలని నిర్ణయించారు. మర్రిపాడు, మినగల్లు, పల్లిపాడు యార్డుల్లో 1.75 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉండగా విక్రయాలు ప్రారంభించారు. పల్లిపాడు, మినగల్లు యార్డుల్లో ఇసుక నిల్వలు అయిపోయాయి. ఇప్పుడు మర్రిపాడు యార్డులో మాత్రమే ఇసుక అందుబాటులో ఉంది. ప్రభుత్వం టన్నుకు రూ.370 నిర్ణయించగా యార్డు వద్ద ట్రాక్టర్ ఇసుక కొనుగోలు రూ.1600 పడుతోంది. జిల్లాలోని అనేక ప్రాంతాలకు ఈ యార్డు దూరం కావడంతో రవాణా చార్జీలే ఎక్కువగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో పోతిరెడ్డిపాలెం, సూరాయపాలెం, సంగం వద్ద డీసిల్టేషన్ పాయింట్లు ప్రారంభమైతే ఇసుక ధరలు భారీగా తగ్గుతాయి. సూరాయపాలెం పాయింట్ నుంచి సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాలకు, సంగం పాయింట్ నుంచి ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాలకు, పోతిరెడ్డిపాలెం పాయింట్ నుంచి నెల్లూరు సిటీ, రూరల్, కోవూరు నియోజకవర్గాలకు ఇసుకను తక్కువ ధరకు అందించేందుకు వీలు కలుగుతుంది.

ట్రాక్టర్ ఇసుక రూ.3500

- కందుకూరులో జోరుగా అక్రమ రవాణా

కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో ప్రజలకు ఇసుక కష్టాలు తీరడం లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా అందుబాటులో నిల్వలు ఉన్నా ఇసుక కావాలంటే రూ.వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక అని ప్రకటించినా స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల కాకపోవటం, రీచ్‌ల గుర్తింపు జరగకపోవటంతో ఇసుకాసురుల పంట పడుతోంది. నిత్యం పోలీసులు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలిస్తున్నా అక్రమార్కుల్లో మాత్రం మార్పు రావడం లేదు. మరోవైపు పోలీసులు, సెబ్ అధికారులు కూడా మామూళ్లకు అలవాటు పడి ఇసుక రవాణాకు పచ్చజెండా ఊపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. కందుకూరులో ట్రాక్టరు ఇసుక రూ.3500 పలుకుతుండటం, కొంతమంది దర్జాగా ఇసుక తోలుతున్న పరిస్థితి చూస్తుంటే ఈ విమర్శలకు బలం చేకూరుతోంది. ఇసుక నిల్వలు ఉన్న పాలేరు, మన్నేరు, ఉప్పుటేరులలో రీచ్‌లను గుర్తించకపోవటంతో అక్రమ రవాణాదారులకు వరంగా మారింది. మన్నేరులో రాళ్లపాడు రిజర్వాయరుకు ఎగువన మొగిలిచర్ల, గొల్లపాలెం, రాళ్లపాడుకు దిగువన చీమలపెంట, వీఆర్ కోట, అన్నెబోయిన పల్లి, అంగిరేకులపాడు, సీతారామపురం, దప్పళం పాడు, పరకొండపాడు, మాచవరం, పాలూరు - దొండపాడు, భీమవరం, మన్నేటికోట, ఆత్మకూరు, ఉలవపాడు గ్రామాల వద్ద అనధికారిక రీచ్‌లు ఉన్నాయి. వీటిలో పాలూరు - దొండ పాడు, ఆత్మకూరు, దప్పళంపాడు, మాచవరం, చీమల పెంట, మొగిలిచర్ల రీచ్‌ల నుంచి గత ఐదేళ్లలో భారీగా ఇసుక రవాణా సాగింది. అలాగే పాలేరులోను జిల్లెలమూడి, పందలపాడు, విక్కిరాలపేట, పలుకూరు వెంకన్న పాలెం గ్రామాల వద్ద రీచ్‌ల నుంచి పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా జరిగింది. ఇక ఉప్పుటేరు నుంచి కూడా పెద్దఎత్తున ఇసుక అక్రమ రవాణా వ్యవ హారం నడిచింది. ఇటీవల మన్నేరులో దప్పళంపాడు వద్ద ఎక్స్‌కవేటర్‌తో భారీ టిప్పర్లకు లోడుచేసి ఇసుక అక్రమ రవాణాకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్న వ్యవహారం చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితుల్లో కనీసం మన్నేరులో నాలుగైదు చోట్ల, పాలేరు, ఉప్పుటేరులలో కనీసం మూడేసి చోట్ల ఇసుక రీచ్‌లను అధికారికంగా గుర్తించకపోతే యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతుందని భావిస్తున్నారు. ఆ దిశగా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టి ఇసుక అక్రమ రవాణాకు చెక్‌పెట్టాలని సామాన్యులకు అందుబాటు ధరలో ఇసుక వచ్చేలా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఆరు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం



గుడ్లూరు : పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

గుడ్లూరు : ఎలాంటి అనుమతులు లేకుండా, పూరేటిపల్లి మన్నేరు రేవు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, ఓ ఎక్స్‌కవేటర్‌ను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పూరేటిపల్లి దగ్గర మన్నేరులో ఉన్న ఇసుకను వలేటివారిపాలెం మండలానికి చెందిన కొందరు శుక్రవారం తెల్లవారు జామున తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సంఘటనా స్థలికి పోలీసులు చేరుకుని ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆరు ట్రాక్టర్లను, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేయడంతో పాటు కందుకూరు కోర్టులో వారిని హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
కంట్రిబ్యూటర్లు కావలెను

నెల్లూరు జిల్లాలో ఈ దిగువ పేర్కొన్న కేంద్రాల్లో వార్తల సేకరణకు కంట్రిబ్యూటర్లు కావలెను. అభ్యర్థి కనీస విద్యార్హత ఇంటర్. తెలుగు భాషలో చక్కని పరిజ్ఞానం, సంఘటనలను వార్తలుగా మలచగలిగే నైపుణ్యం ఉండాలి. అభ్యర్థులు సంబంధిత మండల వాసులై ఉండాలి.

పని చేయవలసిన కేంద్రాలు

రాపూరు, దగదర్తి, దుత్తలూరు

అర్హులైన అభ్యర్థులు 03-08-2024 (శనివారం) క్రింది అడ్రస్ నందు ఉ.11 గంటలకు జరిగే రాత పరీక్ష, ఇంటర్వ్యూకు హాజరు కావలెను.

ఆంధ్రజ్యోతి కార్యాలయం
ఫ్లాట్ నెం.91, ఉడ్‌కాంప్లెక్స్, అయ్యప్పగుడి వద్ద, వేదాయపాళెం, నెల్లూరు. ఫోన్ నెం.9985411425

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం:: తిరుపతి - 517502

పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

పర్యావరణము మరియు అడవులు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ప్రకటన జారీ నెం.ఎస్.ఓ.1533, తేది: 14.09.2006 ననుసరించి **M/s.** సెవెన్ హిల్స్ ఇండస్ట్రీస్ వారిచే సర్వేనెం.873/బి, వెందోడు (V), గూడూరు(M), తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్ పరిధిలో రోడ్డు మెటల్ ఉత్పత్తి పెంపునకై ప్రతిపాదించినారు. లీజు ఏరియా 19.222 హెక్టార్లు, (రోడ్డుమెటల్– 80,931 నుండి 10,00,000 m^3/Annum) వరకు తీయుటకు పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారిచే ఈ ప్రకటన జారీ చేయబడినది. ప్రతిపాదిత కార్యకలాపాల యొక్క వివరములు ఈ క్రింది వివరించబడినది.

1. కంపెనీ పేరు,చిరునామా మరియు టెలిఫోన్ నెం.	M/s.సెవెన్ హిల్స్ ఇండస్ట్రీస్, రోడ్డుమెటల్ మైను(19.222 హెక్టార్లు), సర్వేనెం.873/బి, వెందోడు(V), గూడూరు (M), తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్ సెల్: 8008632476 & 8332972676 ఈమెయిల్:sevenhillsindustries1960@gmail.com
2. కార్యకలాపాల నిర్వహణకు ప్రతిపాదించబడిన ప్రదేశము మరియు విస్తీర్ణం	రోడ్డు మెటల్ మైను, సర్వేనెం.873/బి, వెందోడు(V), గూడూరు(M), తిరుపతి జిల్లా ఆంధ్రప్రదేశ్ పరిధిలో మొత్తం విస్తీర్ణం 19.222 హెక్టార్లు
3. సంప్రదించవలసిన సంబంధిత కంపెనీ అధికారి పేరు,చిరునామా మరియు ఫోన్‌నెంబరు	శ్రీ డి.నాగేంద్ర బాబు, వి-5 హోం, 3వ వార్డ్, నేతాజీరోడ్డు, సత్యవేడు, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్- 517588 సెల్: 8008632476 & 8332972676 ఈమెయిల్:sevenhillsindustries1960@gmail.com
4. ప్రతిపాదిత కార్యకలాపాలకు కేటాయించిన పెట్టుబడి	రూ.60.0 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాల వివరములు	రోడ్డు మెటల్ మైను లీజు ఏరియా 19.222 హెక్టార్లు (రోడ్డుమెటల్ – 80931 నుండి 10,00,000 m3/annum వరకు) ఉత్పత్తి పెంపునకై
6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 03.09.2024 మంగళవారం సమయం : ఉ.10.30 గం॥లకు ప్రదేశం : ప్రతిపాదిత మైను లీజు ఏరియా వద్ద

7. ప్రతిపాదనకు సంబంధించిన వివరములు సదరు ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సమ్మరీ & REIA రిపోర్టులను ప్రజల సౌకర్యార్థం ఈ క్రింది కార్యాలయముల్లో లభ్యపరచడమైనది.
a) జిల్లా కలెక్టరు & మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, తిరుపతి జిల్లా
b) చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి వారి కార్యాలయము, జిల్లా పరిషత్, నెల్లూరు జిల్లా
c) జనరల్ మేనేజర్ వారి కార్యాలయము, జిల్లా పరిశ్రమల కేంద్రం, తిరుపతి జిల్లా
d) రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయము, గూడూరు, తిరుపతి జిల్లా
e) తహశీల్దారు వారి కార్యాలయము, గూడూరు మండలము, తిరుపతి జిల్లా
f) గ్రామ పంచాయతీ కార్యాలయం, వెందోడు గ్రామం, గూడూరు మండలం, తిరుపతి జిల్లా
g) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయము, బోర్డు ఆఫీస్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్
h) స్టేట్ లెవెల్ ఎన్విరాన్మెంట్ ఇంపాక్ట్ అసెస్మెంట్ అథారిటీ (SEIAA), విజయవాడ,ఆంధ్రప్రదేశ్
i) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ కార్యాలయము, తిరుపతి
j) జాయింట్ డైరెక్టర్ (ఎస్), MoEF&CC, ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీస్, గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాలరెడ్డి రోడ్డు, విజయవాడ

కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ ప్రకటన జారీ ఎస్.ఓ.నెం.1533 తేది: 14.09.2006లో పేర్కొనబడిన (వరుస క్రమము 7III(ii) (ఏ) మరియు (బి)లలో) రీతిలో ఈ ప్రతిపాదన కార్యకలాపాల వలన నష్టపోవు ప్రజల నుండి మరియు పర్యావరణ సంబంధిత అంశముల వల్ల ప్రభావితపు ప్రజల నుండి వ్యాఖ్యలు, అభ్యంతరములు ఏవైనా వున్నట్లయితే వాటిని లిఖిత పూర్వకంగా ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 రోజులలోపు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి, తిరుపతి వారికి తెలుపవచ్చును. అటువంటివారు, పైన పేర్కొనబడిన తేదీన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో కూడా పాల్గొని తమ అభిప్రాయములు స్వయముగా తెలుపవచ్చును.

సం/-
ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, తిరుపతి

ప్రదేశం : తిరుపతి
తేది :02.08.2024

వెంటాడే కుక్కలు.. కుమ్మేస్తున్న ఆవులు!

- పట్టణంలో ఇబ్బందికర పరిస్థితులు
- పట్టించుకోని అధికారులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 2: పట్టణంలో వీధికుక్కలు, ఆవులతో ప్రజలు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. కుక్కలు గుంపులు గుంపులుగా వీధుల్లో సంచరిస్తుండడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజల చేతుల్లో తీసుకెళ్లే కవర్లను సైతం లాగేస్తు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రధానంగా పోలీస్‌స్టేషన్, తహసీల్దారు కార్యాలయాల సమీపంలో చికెన్ దుకాణాలు ఉండటంతో అక్కడ పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తూ వాహనదారులను ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. కుక్కల అరుపులతో రాత్రులు నిద్ర కూడా సరిగా ఉండటంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇక పగలురాత్రి అనే తేడా లేకుండా మెయిన్‌బజార్, పంచాయతీ బస్టాండ్, గండిపాళెం మార్గంలోని ప్రధాన రహదారులపై ఆవుల సంచారం అధికమైంది. రాత్రి సమయంలో పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఆవుల గుంపులుగా చేరి కుమ్ములాడుకుంటూ ప్రజలపై వస్తున్నాయి. ఆవులు వాహనాల రాకపోకలకు సైతం తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. వాటి నివారణకు చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పట్టణప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు నివారించాలని, ఆవులు వీధుల్లో సంచరించకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం లేదని మండిపడుతున్నాయి. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో ప్రజలు అధికారులపై మండిపడ్డారు. అధికారులు వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఉదయగిరి బస్టాండ్ నడిరోడ్డుపై ఆవులు

ఇటీవల జరిగిన సంఘటనలు..

- పట్టణంలోని బాలాజీనగర్, యాదవపాళెం ప్రాంతాల్లో ఓ ఆవును పిచ్చికుక్క కరవడంతో దానికి పిచ్చెక్కింది. దీంతో పలువురు మహిళలు, వృద్ధులపై ఆవు విచక్షణారహితంగా దాడి చేయడంతో గాయపడ్డారు.
- బస్టాండ్ ప్రాంతంలో ఆవుల కుమ్ములాటలో పలువురు వాహనదారులకు గాయాలైన సంఘటనలు ఉన్నాయి.
- పట్టణంలోని యూనియన్‌రోడ్డు, గాజుల వీధి, సినిమాహాలువీధి ప్రాంతాల్లో ఇటీవల చిన్నారులు, మహిళలపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి.

అధ్వానంగా రాళ్లపాడు కుడి కాలువ రోడ్డు


కంకర లేచిపోయి అధ్వానంగా ఉన్న రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ రోడ్డు

లింగసముద్రం, ఆగస్టు 2: రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ రోడ్డుపై కంకర లేచిపోయి, గుంతలమయమై అధ్వానంగా ఉండడంతో అధికారులు, సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కుడి కాలువ మొదటి నుండి కాలువ చివరి వరకు 20 కి.మీ పొడవున ఉన్న ఈ రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. 2012వ సంవత్సరంలో కాలువ మొదటి నుంచి రెండు కి.మీ పొడవున అధికారులు మట్టి రోడ్డును మెటల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఆతర్వాత నుండి ఈ రోడ్డు అభివృద్ధి కోసం తట్టెడు మట్టి వేసిన దాఖలాలు లేవు. దీంతో ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రయాణానికి నరకప్రాయంగా తయారైంది. ముఖ్యంగా ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది కాలువకు నీరు విడుదల సమయంలో బ్రాంచి కాలువలకు, పంట పొలాలకు నీటి నిర్వహణకు ఈ రోడ్డును ఉపయోగిస్తారు. అలాగే రైతులు కూడా తమ పంటల సాగు సమయంలో, పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకొనేందుకు ఈరోడ్డే ఆధారం. రాళ్లపాడు గ్రామస్థులు కూడా నిత్యావసర వస్తువుల కోసం, ప్రభుత్వ కార్యాలయాలకు ఈ రోడ్డు మీదుగానే లింగసముద్రం వస్తుంటారు. దీంతో అధ్వాన్నంగా ఈ రోడ్డుపై వారు అగచాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

- ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి రూరల్, ఆగస్టు 2: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలు నిర్వీర్యమై పేదల పొట్టకొట్టి పెద్దలకే పంచిపెట్టారని ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ అన్నారు. శుక్రవారం ఉదయగిరి మత్స్యకార సహకార సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం 217 జీవోను రద్దు చేయడంతో పొన్నెబోయిన చెంచురామయ్య గండిపాళెం జలాశయం ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని 217 జీవోను రద్దు చేసి మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగు నింపారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జలాశయాలకు నిర్వహణ నిధులు కూడా మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఇటీవల మంత్రి రామానాయుడు కావలి కాలువ పూడికతీతకు నిధులు మంజూరు చేయాలని కోరగా రూ.15కోట్లు విడుదల చేసేందుకు అంగీకరించారన్నారు. పంచాయతీ వ్యవస్థను సర్వనాశనం చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని 143పంచాయతీల్లో 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.381 కోట్లు మంజూరవగా విద్యుత్ బిల్లుల పేరుతో రూ.200 కోట్లను దారి మళ్లించారన్నారు. చివరికి వైద్యశాలలో నిధులను సైతం స్వాహా చేశారని మండిపడ్డారు. నియోజకవర్గంలోని పాఠశాలలు, రోడ్ల అభివృద్ధి చేపట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. పెద్దిరెడ్డిపల్లి, సోమశిల హైలెవల్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పూర్తి చేసి ప్రతి కుటుంబానికి శుద్ధలాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు రియాజ్, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.ఉమాసాయిరాం, ఆర్.వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, నరసింహారావు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు చెన్నరాయుడు, రాముడు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

● ఎస్సీ వర్గీకరణకు పునాది చంద్రబాబే

ఎస్సీ వర్గీకరణకు పునాది వేసింది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీల ఆధ్వర్యంలో దుత్తలూరు సెంటర్‌లో శుక్రవారం బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్‌మాది, మోహన్‌రావు మాదిగ గంగటప్ల సింహాద్రి, వడ్లపల్లి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల జాబితాలో గ్రామకంతం భూములు

- రిజిస్ట్రేషన్లు జరగక ప్రజల ఇబ్బందులు
- గ్రామకంతం భూముల జాబితాలోకి మార్చాలని ప్రజల వినతి

లింగసముద్రం, ఆగస్టు 2: లింగసముద్రంలోని 79 సర్వే నంబరులోని గ్రామకంతం భూములను సుమారు ఎనిమిదేళ్ల క్రితం అప్పటి కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది అనాలోచితంగా ప్రభుత్వ భూముల జాబితాలో నమోదు చేశారు. దీంతో ఆ సర్వే నంబరులోని నివాసాల వారు ఆస్తులు, స్థలాలు, ఇళ్ల అమ్ముకోవాలన్నా, కొనాలన్నా రిజిస్ట్రేషన్లు జరగక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు గురువారం లింగసముద్రం వచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన తగిన చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ టి ప్రసాద్‌ను ఆదేశించగా, తగిన సవరణల కోసం ఫైలును జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించామని చెప్పారు. తాను కలెక్టర్‌తో మాట్లాడతానన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారం


సత్యనారాయణపురానికి తాగునీటి సరఫరా పునరుద్ధరించిన అధికారులు

లింగసముద్రం, ఆగస్టు 2: మండలంలోని చినపవని పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వ రరావు పరిష్క రించారు. సత్యనారాయణపురం గ్రామానికి తాగునీరు అందించే బోరు చెడిపోయి సరఫరా నిలిచి పోయింది. దీంతో వారు ఈ విషయాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు చినపవని గ్రామ టీడీపీ నేత సోంపల్లి మనోహర్ శుక్రవారం బోరు బాగు చేయించి గ్రామనికి తాగునీటి సర ఫరాను పునరుద్ధరంచారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిపాల వారోత్సవ ర్యాలీ


తల్లిపాల వారోత్సవాల ఆవశ్యకతను తెలియచేస్తూ నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

కావలి, ఆగస్టు 2: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సౌజన్య ముసునూరు ఎస్సీ కాలనీలో శుక్రవారం శుక్రవారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డలకు వెంటనే ముర్రు పాలు తాపి స్తే వ్యాధి నిరోధకశక్తి పెరిగి శిశువు ఆరోగ్యకరంగా ఎదుగుతారన్నారు. స్త్రీలు గర్భవతిగా ఉన్నపుడు సమతుల్యమైన అద నపు ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయురాలు రాధాకుమారి, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, దీనాకుమారి, సుకన్య, ప్రభావతి, శివలీల, సుశీల పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని మాలకొండ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవా రం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ఐసీడీ ఎస్ అధికారులు, కార్యకర్తలు తల్లిపాల ప్రాముఖ్యతపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం వజ్రమ్మ, అంగన్‌వాడీ కార్య కర్త పార్వతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అల్లూరు: తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని కావలి సీడీపీవో సౌజన్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అల్లూరు సెక్టారు పరిధిలోని అల్లిమడుగు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. శిశువుకు తల్లిపాలను అందిస్తే వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. తల్లికి రొమ్ము కేన్సర్, గర్భసంచి కేన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. శిశువు ఎదుగుదల, మెదడు ఎదుగదల, మధుమేహం, రక్తహీనత తదితర అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఆరోగ్య సిబ్బంది రాజ్యలక్ష్మి, మహిళా పోలీస్ శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు లలితమ్మ, ప్రసూన, జమీన్ పాల్గొన్నారు.

కందుకూరు: మండలంలోని మాచవరం అంగన్వాడీ సెంటర్- 2లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ ప్రభావతి కార్యక్రమానికి హాజరై తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి అంజయ్య, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్‌ఎం మంజుల, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

శాకాంబరి అలంకరణలో కన్యకా పరమేశ్వరి



అల్లూరు, ఆగస్టు 2: ఆషాఢమాసం ముగించుకొని శ్రావణ మాసంలోకి అడుగెడుతున్న రోజులను పురస్కరించుకుని స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం శాకాంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల్లో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు దమ్మాల వెంకట బ్రహ్మానందరావు, అధ్యక్షులు మొగళ్లపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి యేల్యారి సురేంద్రబాబు, ఉపాధ్యక్షుడు జాలాది వెకంటేశ్వర్లు, సహ కార్యదర్శి మొగళ్లపల్లి సత్యానారాయణ పాల్గొన్నారు.

నేడు కలిగిరిలో ఎమ్మెల్యే కాకర్ల పర్యటన

కలిగిరి, ఆగస్టు 2: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరుగనున్న మండల సర్వసభ్య సమావేశానికి ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరవుతున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతామన్నారు.

పశువుల షెడ్లకు దరఖాస్తు చేసుకోండి

వలేటివారిపాలెం, ఆగస్టు 2: రైతులు పశువుల షెడ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని వలేటివారిపాలెం పశుసంవర్ధక శాఖ సహాయకులు బ్రహ్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మినీ గోకులం పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు పశువుల షెడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, అందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా పశువుల షెడ్ల నిర్మాణాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ బ్రహ్మయ్య తెలిపారు.

రూ. 1.9 కోట్లతో రహదారి, వంతెన నిర్మాణాలకు ప్రతిపాదనలు

వలేటివారిపాలెం, ఆగస్టు 2 : మండలంలోని వలేటివారిపాలెం జాతీయ రహదారి నుండి రోళ్లపాడు గ్రామంలోకి తారురోడ్డు, తూమలేరుపై వంతెన నిర్మాణానికి రూ. 1.9 కోట్లతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించినట్లు పంచాయతీరాజ్ ఏఈ గోపిచంద్‌రెడ్డి తెలిపారు. వలేటివారిపాలెం నుండి రోళ్లపాడు వెళ్లేందుకు గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే నాగేశ్వరరావు జాతీయ రహదారి నుండి రోళ్లపాడు గ్రామంలోకి తారురోడ్డు, మధ్యలో తూమలేరుపై వంతెన నిర్మాణాలకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాలని పంచాయతీరాజ్ ఏఈకి సూచించారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు పి.ఆర్ ఏఈ తెలిపారు.

జనసేన సభ్యత్వం నమోదు

కలువాయి, ఆగస్టు 2: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం జనసేన క్రియాశీల సభ్యత్వం నమోదును మండల పార్టీ అధ్యక్షులు మనోహర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన వీర మహిళ తోకల ప్రవళిక, నాయకులు నరేష్, హరిప్రసాద్, రామ్‌కిషోర్, నాగయ్య, శ్రీహరి, సురేష్, శ్రీనాథ్, శివాజీ పాల్గొన్నారు.

ఘనంగా బళ్లారి రాఘవ జయంతి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 2: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో శుక్రవారం ప్రముఖ రంగస్థల, సినీ నటుడు బళ్లారి రాఘవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి జీ.రమేష్, సీనియర్ ప్రొఫెసర్లు గోపి కృష్ణ, పాల్, సునీత, కిషన్‌తేజ పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి ఆరుద్రనక్షత్ర పూజలు

సంగం, ఆగస్టు 2: స్థానిక తిరుమనకొండలో వెలసిన రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢమాసం ఆరుద్ర నక్షత్ర పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసి పూలతో అలంకరించారు. పూజల్లో ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి, భక్తులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళులు


నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అనంతసాగరం, ఆగస్టు 2: చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురే ష్, ఉపాధ్యాయులు చంద్రోఖర్‌రెడ్డి, మహేష్, రమణ రాజు పాల్గొన్నారు.

భోజనశాల మంజూరుకు వినతి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 2: గండిపాళెం గురుకుల పాఠశాలకు భోజనశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు శుక్రవారం ప్రిన్సిపాల్ పుష్పరాజ్, పూర్వ విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు వారు భోజనశాల పూర్తి శిథిలావస్థకు చేరి కూలేదశలో ఉందని, విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని వివరించారు. స్పందించిన ఆయన నూతన భోజనశాల భవనం మంజూరుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యమంలో పూర్వ విద్యార్థులు వడ్లమూడి వెంకటేశ్వర్లు, విజయభాస్కర్‌రెడ్డి, సుమన్, రవి, కూర్మయ్య, కిరణ్ పాల్గొన్నారు.

పోలీసుల నీడలో పీర్ల మహోత్సవం

వరికుంటపాడు, ఆగస్టు 2: విరువూరు పీర్ల మహోత్సవం శుక్రవారం పోలీసుల నీడలో నిర్వహించారు. గతంలో ఉత్సవాల నేపథ్యంలో వివాదాలు చోటుచేసుకోవడంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సీఆర్‌పీఎఫ్ బలగాలతో నిఘా ఏర్పాటు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పీర్లను ముస్తాబు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం గ్రామోత్సవం చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పశువులకు సబ్సిడీపై బీమా

వింజమూరు, ఆగస్టు 2: పశుపోషకులు సబ్సిడీపై బీమా ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు తెలిపారు. మండలానికి 50ఆవులు లేదా గేదెలకు అవకాశం కల్పించారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇన్సూరెన్స్ చేసుకోవాలంటే రైతుసేవా కేంద్రాల వద్ద పశుసంవర్ధక శాఖ సహాయకులను సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల ప్రతిభ

వింజమూరు, ఆగస్టు 2: పట్టణంలోని సుబ్రహ్మణ్యం విద్యా సంస్థల ఇంజనీరింగ్ విభాగంలో 2023-24 సంవత్సరంలో ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో 233మంది విద్యార్థులకు 218మంది విద్యార్థులు ఇంజనీరింగ్ సీట్లు సాధించినట్లు కళాశాల చైర్మన్ బి.సురేంద్రరాజు తెలిపారు.

తల్లిపాలు అమృతంతో సమానం

ఆత్మకూరు, ఆగస్టు 2: పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగిస్తే అమృతంతో సమానమని సీడీపీవో సునీలత తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం వాశిల సెక్టార్ పరిధిలోని బి.చిరువెళ్ల ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. అనంతరం గర్భవతులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కళావతి, అంగన్‌వాడీ సూర్‌వైజర్ నారాయణమ్మ, ఏఎన్‌ఎంలు జ్యోత్న పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: గడ్డంవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ షాను గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, రమా, సుజాత, రేణుక పాల్గొన్నారు.

దుత్తలూరులో: నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరీష్, ఆరోగ్య పర్యవేక్షకులు రియాజ్, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు

ఆత్మకూరు, ఆగస్టు 2: స్థానిక మార్కెట్‌యార్డు కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్సీ సహాయ వ్యవసాయ సంచాలకులు మారుతీదేవి భూసార పరిరక్షణ పెంపొందించుకోవడం, ఏడాది పొడువున పొలంలో పంట వుండేలా సాగు చేయాలని సూచించారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ, వివిధ తెగుళ్ల బారీన పడకుండా పొలంలో వాడే కషాయల తయారీ విధానాలను వివరించారు. విచక్షణా రహితంగా ఎరువులు వాడకంతో కలిగే నష్టాలను విపులీకరించారు. కార్యక్రమంలో మండల వ్యవయ సాయ అధికారి శైలజ, ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ, మండల వ్యవసాయశాఖ అధికారి కిషోర్‌బాబు, సీఆర్పీ సుబ్బరాయుడు, మాస్టర్ ట్రైనర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు అభినందనీయం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు కల్పిస్తూ తీర్పు ఇవ్వడం అభినందనీయమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ సేవాసమితి అధ్యక్షుడు కాకి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక ఏబీఎం ఆవరణలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ పోరాట ఉద్యమంలో ఎందరో జాతిబిడ్డలు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో అభినందనసభ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జాషువా, బాలగురవయ్య, ఆనందరావు, అశోక్, బీజేపీ నాయకుడు రోశయ్య పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆ సంఘం మాజీ మండల కన్వీనర్ చేవూరి రవితేజ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు తాతిపూడి లాబాన్, చేవూరి సుకుమార్, నూనె ప్రసాద్, సర్పంచ్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

వింజమూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రాలదే నిర్ణయం అని సుప్రీంకోర్టు తీర్పునీయడం సంతోషదాయకరమని ఉదయగిరి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కదిరి వెంకటరావు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన మాట నిల బెట్టుకుని వారి హామీలు నెరవేర్చారని ఇదే ఆయన ఘనతే అన్నారు.

అనంతసాగరం: ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ సమస్య పరిష్కారానికి సుప్రీం కోర్టు ఆమోద ముద్ర వేయడంతో అనంతసాగరంలో సంబరాలు జరుపుకున్నారు. సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చినట్లు కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదరణ కేంద్రానికి అనాథ మహిళ

బిట్రగుంట, ఆగస్టు 2: బోగోలు మండలం విశ్వనాథరావుపపేట పంచాయతీలోని ఇబ్రహీంపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు సమీనంలో పడి ఉన్న మతిస్థిమితం లేని అనాథ మహిళను శుక్రవారం భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు సింహాద్రిరావు ఆదరణ కేంద్రానికి తరలించారు. ఆకలితో అలమటిస్తూ చెత్తకుప్పలో పారేసిన భోజనాన్ని తింటున్న ఆ మహిళను గుర్తించి కాంద్ర సతీష్ నాయుడు, కావాటి శ్రీననివాసులు ద్వారా సింహాద్రిరావు తెలుసుకున్నాడు. మాటలు కూడా అర్థంకాని ఆమెను ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీకు కారులో తరలించారు. రెండు కాళ్లు సచ్చుపడి నడవేని స్థితిలో ఉన్న ఆమెకు స్నానం చేయించి తల వెంట్రుకలను కత్తరించి భోజనం చేయించారు. అనాథ మహిళ ఆచూకీ తెలిపి ఆమె ప్రాణాలను కాపాడిన వారికి కేంద్ర నిర్వాహకులు సింహాద్రి భవానీలు ధన్యవాదాలు తెలిపారు.


3కే రన్‌ను విజయవంతం చేయండి

బిట్రగుంట, ఆగస్టు 2: బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7గంటలకు నిర్వహిస్తున్న 3కే రన్ విజయవంతం చేయాలని బీజడ్‌ఏ అధ్యక్షుడు ఎం.స్వర్ణన్‌రాజు పిలుపునిచ్చారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో గౌరవాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గస్థాయిలో జరిగే పోటీలు వయసును బట్టి ఆరు విభాగాలుగా ఏర్పాటు చేశామన్నారు. అంతే కాకుండా బాలికలు, మహిళలకు పోటీ ఉంటుందన్నారు. నాలుగు వందల మందికి పైగా పోటీలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండర్ అధ్యక్షుడు కే.శ్రీనివాసులు, సభ్యులు అంతోణిరాజ్, సత్యనారాయణ చార్యులు, ఎం.శ్రీనివాసులు ఉన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 2: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నాయకులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం పెట్టుబడి సాయం అందించాలన్నారు. 70శాతం భూములను కౌలు రైతులు సాగు చేస్తున్నందున వారికి ధ్రువపత్రాలు ఇవ్వడంతో పాటు రైతుభరోసా, పెట్టుబడిసాయం, రుణాలు అందించాలన్నారు. ఏళ్ల తరబడి సాగుతున్న పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్ల విధానాన్ని తొలగించాలన్నారు. ఈ నెల 9న దేశవ్యాప్తంగా రైతుసంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ కార్యక్రమం అనే నినాదంతో ఆందోళన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కోడె రమణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పుపై బీజేపీ సంబరాలు


ప్రధాని మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు రావడంపై బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శుక్రవారం బుడమగుంట ఎస్సీ కాలనీలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రధాని నరేంద్ర మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు దేశచరిత్రలో చారిత్రాత్మకంగా నిలిచిపోతుందన్నారు. ఎస్సీలందరికీ సమాన హక్కులందాన్న ఆశయంతో ప్రధాని మోదీ మొదట్నుంచి వర్గీకరణకు సానుకూలంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు బ్రహ్మానందం, రాష్ట్ర నాయకులు వీవీ రంగారెడ్డి, పూనూరు మాధవి, మందా కిరణ్, సమీంద్ర, మందా శ్రీనివాసులు, తూమాటి తిరుపతిస్వామి పాల్గొన్నారు.

ఉలవపాడు: సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీల వర్గీకరణకు సానుకూలత ఏర్పడినందున ఎస్సీలలోని ఉప కులాలకు మేలు జరిగిందని బీసీ సంఘం నాయకుడు మిరియం శ్రీను, మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకుడు రావినూతల ముత్తుమాదిగలు అన్నారు. శుక్రవారం ఉలవపాడు మండలంలోని కరేడు ఎంఆర్‌పిఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు కరేటి గోపాల్, ఆలూరి కోటేశ్వరరావు, పున్నేపల్లి శ్రీను, కరేటి ఏలియా, గడ్డం నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కావలి: రాష్ట్ర ప్రభుత్వాలే ఎస్సీ వర్గీకరణ చేసుకునే అవకాశం కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మాదిగల 30 ఏళ్ల కల ఫలించిందని ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు పట్టణంలోని ట్రంకురోడ్డులో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పరుసు రమేష్, చేవూరు మాల్యాద్రి, దావులూరి దేవకుమార్, దావులూరు జేమ్స్, రావినూతల శింగయ్య, మోహన్‌రావు, గోసాల చిట్టి, పరుసు మాల్యాద్రి, గోసాల మధు, వెంకటస్వామి పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



కావలి టౌన్, ఆగస్టు 2: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని ఘనంగా నిర్వ హించారు. ఈ సందరర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ వైద్యులు ప్రభాకర్ నాయు డు, సంస్థల ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషతో కలిసి పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతావని సగర్వంగా ఆవిష్కరించుకునే మువ్వన్నల జెండా రూపశిల్పి మన తెలుగు బిడ్డ కావడం మనందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు మొగల్ సిరాజ్‌బేగ్, పీవీ రమణయ్య, ఖాదర్‌బీ, దామ మధుసూధన్‌రావు, పీవీఎస్ ప్రసాదరావు, మాలకొండారెడ్డి, బ్రహ్మయ్య, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కావలి రూరల్, ఆగస్టు 2: పట్టణంలోని ఉదయగిరిరోడ్డు బుడంగుంట కాలనీ సమీపంలో శుక్రవారం సాయంత్రం మోటారు సైకిల్.. కారును ఢీ కొంది. ఈ ప్రమాదంలో జలదంకి మండలం లింగరాజు అగ్రహారంకు చెందిన ఆర్.సాయికుమార్ కాలుకు తీవ్ర గాయమైంది. స్థానికుల సమాచారం మేరకు సాయికుమార్ మద్యం సేవించి మోటారు సైకిల్‌పై కావలి నుంచి జలదంకి వైపునకు వెళుతూ ఎదురుగా వచ్చిన కారును ఢీ కొన్నాడు. గాయపడిన అతన్ని 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

కౌలురైతులకు రుణాలివ్వాలి

కావలి, ఆగస్టు 2: కౌలు రైతులకు పంటల సాగునకు పెట్టుబడుల కింద ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు షాన్‌వాజ్, జిల్లా నాయకుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కౌలు రైతులకు గుర్తింపుకార్డుల మంజూరు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. భూ యజమానులకు సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. గుర్తింపుకార్డులు వచ్చిన వారికి కూడా రుణ సదుపాయం అందించటంలేదని వాపోయారు. వాతావరణంలో వచ్చే విపత్తులతో నష్టపోయిన రైతులకు పంటల బీమాసౌకర్యం కల్పించి ఆదుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రైతుసంఘం కార్యదర్శి రాజగోపాల్, సహాయ కార్యదర్శి శివయ్య, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దర్గాబాబు ఉన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేత

కావలి, ఆగస్టు 2: పట్టణంలోని 12వ వార్డు అరుంధతీయవాడకు చెందిన బీ. బ్రహ్మయ్య అనారోగ్యంతో నెల్లూరు నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో ఆయన అవసరాలను గుర్తించిన సచివాలయ కార్యదర్శి సురేష్‌కుమార్ వార్డు టీడీపీ ఇన్‌చార్జి దావులూరి దేవకుమార్‌ను నెల్లూరుకు వెళ్లి బ్రహ్మయ్యకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.